www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 233 | మంగళవారం 13-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

మరో అన్యాయం

- విశాఖ ఐటీ కారిడార్‌కు మంగళం
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- ఉత్తరాంధ్రలో ఉపాధి అవకాశాలు ఉఫ్



విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి :

విభజనానంతరం హామీల అమలులో వైఫల్యం, బడ్జెట్‌లో అన్యాయంపై వామపక్షాలు పిలుపు మేరకు సంపూర్ణ బంద్ రూపంలో జనాగ్రహం పెల్లుబికి నాలుగు రోజులు కూడా గడవక ముందే కేంద్రంలోని బీజేపీ సర్కార్ మరో అన్యాయానికి ఒడిగట్టింది. విశాఖపట్నంలో నెలకొల్పవలసిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్టిమెంట్ కారిడార్‌కు (ఐటీఐఆర్) మంగళం పాడింది. ఈ ప్రాజెక్టుకు 2013 సంవత్సరంలో అప్పుడు అధికారంలో ఉన్న యూపీఏ-2 ప్రభుత్వం మంజూరు చేసింది. విశాఖపట్నంలో ఈ కారిడార్ ఏర్పాటైతే ఐటీ రంగంలో విదేశీ పెట్టుబడులు రావడంతోపాటు స్థానిక యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పన కలిగి ఉండేది. విశాఖపట్నంతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలవాసులకు ఉపాధి అవకాశాలు దొరికేవి. ఈ ప్రాజెక్ట్‌కు అనుమతిని నిలిపివేయడానికి 60 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడుల రాకకు గండిపడింది.

2008లో రూపొందించిన ఐటీటీఆర్ పాలసీ కింద దేశంలో ఇటువంటి కారిడార్ ఏర్పాటు చేయాలని 2013 అప్పటి యూపీఏ-2 ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత విశాఖపట్నంలో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు సంసిద్ధతను వ్యక్తంచేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2014, ఆగస్ట్ 26వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. ఈ దరఖాస్తును పరిగణనలోకి తీసుకున్న కేంద్ర, ఆర్థిక వ్యవహారాల కమిటీ 2008 నాటి పాలసీ అనుభవాలను సమగ్రంగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవలసిందిగా ఆదేశించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం 2008 ఐటీటీఆర్ పాలసీని రద్దు చేసింది. అందువల్ల విశాఖపట్నంలో కారిడార్ ఏర్పాటుకు అవకాశాలు లేనే లేవని మొన్నటి బడ్జెట్ సమావేశాలలో ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభలో స్పష్టంచేశారు. విశాఖపట్నంతోపటు సైదరాబాద్, భువనేశ్వర్, బెంగళూరులో ఇటువంటి కారిడార్లకు యూపీఏ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అయితే 2008 నాటి పాలసీలో సవరణలు చేయవలసి ఉన్నందున కారిడార్ల ఏర్పాటు వీలు కాదంటూ ఎన్డీఏ ప్రభుత్వం నిలిపివేసింది.

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు పదివేల ఎకరాలు అవసరమవుతుందని అంచనా. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదు ఐటీ రంగంలో అభివృద్ధి చెందింది. ఈ నేపథ్యంలో నాటి యూపీఏ ప్రభుత్వం విశాఖను అభివృద్ధిపరిచే నిమిత్తం ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం మరింత అయోమయంలో పడిపోయింది.



చీరతో స్కైడైవింగ్...!

భారత మహిళ కొత్త రికార్డు


ముంబై :

పుణెకు చెందిన ప్రముఖ స్కైడైవర్ శీతల్ రాణె మహాజన్ చీర కట్టుకుని స్కైడైవింగ్ చేసి సరికొత్త రికార్డు నెలకొల్పారు. చీరతో స్కైడైవ్ చేసిన తొలి భారతీయ మహిళగా ఆమె రికార్డులకెక్కారు. అది కూడా సాధారణ చీర కాదు. మహారాష్ట్ర సంప్రదాయ 'నౌవారి' చీర కట్టుకున్నారు. మామూలు చీర ఆరుగజాలుంటే నౌవారి చీర తొమ్మిది గజాలు ఉంటుంది. దోతీ తరహాలో ఉండే ఈ చీరను కట్టుకోవడమే చాలా కష్టం. అలాంటిది ఆమె ఏకంగా ఆ చీర కట్టుకుని స్కైడైవింగ్ చేశారు. థాయ్‌ల్యాండ్‌లోని పట్టాయా రిసార్ట్‌లో 13వేల అడుగుల ఎత్తు నుంచి డైవ్ చేసి శీతల్ ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో ఏదైనా కొత్తగా చేయాలని అనిపించి ఇలా చీరతో డైవింగ్ చేసినట్లు శీతల్ తెలిపారు. తొమ్మిది గజాల పొడవుండే నౌవారి చీర ధరించడమే మొదట పెద్ద సవాలు అని ఆమె పేర్కొన్నారు. దానిపై పారాచూట్, హెల్మెట్, గాగుల్స్, షూస్,

- మిగతా 2 లో

ఇదీ స్వాతంత్ర్య పోరే

- అన్నివిధాలా సహకరించినా.. కేంద్రం వివక్ష
- జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు అంశాల్లో అండగా నిలబడ్డాం
- అయినా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందిపెడుతున్నారు
- నష్టపోయిన ఏపీని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే
- టెలికాన్ఫరెన్స్‌లో స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :

'స్వాతంత్ర్యం కోసం పోరాడటం గత చరిత్ర. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడటం ప్రస్తుత చరిత్ర. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న ఎంపీలు అందరికీ అభినందనలు. ఇదే స్ఫూర్తితో అధికార యంత్రాంగం పని చేయాలి. మూడున్న రేళ్లుగా ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటువల్లే అన్ని సమస్యలు అధిగమించ గలిగాం. బాధ్యత పెంచాం, సమర్థత చూపాం. దీనిని ఇకపై కూడా మరింత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కొనసాగించాలి' అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ప్రతిపక్షం లేఖల ద్వారా అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో పట్టుబట్టిన కేంద్ర మంత్రి మీద ప్రతిపక్షం ఫిర్యాదులు శోచనీయం. తెలిసిచేసినా తెలియక చేసినా ఇది రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధం. ప్రతిపక్ష పోకడలు ప్రజాప్రయోజనాలను కాలరాసేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమే' అని చంద్రబాబు పేర్కొన్నారు.

'మూడున్నరేళ్లుగా కేంద్రానికి అన్నివిధాలా సహకరించాం. జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు తదితర అంశాలలో అండగా నిలిచాం. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మరింత సహకారం అందించాలి. పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయి వచ్చేదాకా కేంద్రం చేయూత ఇవ్వాలి' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నరేగా డిమాండ్ డ్రివెన్ ప్రోగ్రాం అంటూ, దానిపై కూడా ఫిర్యాదులు పంపడం ప్రతిపక్షం అరాచకాలకు పరాకాష్టగా దుయ్యబట్టారు. కన్వర్జన్స్ ద్వారా నరేగాలో ప్రతి రూపాయి ప్రజోపయోగం చేశామన్నారు. నరేగా నిధులు రాష్ట్రానికి వచ్చేందుకు దోహదపడిన యంత్రాంగాన్ని అభినందించారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాలపై సమీక్షించారు. నేటినుంచి 116 రోజులు జలసంరక్షణ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు

- మిగతా 2 లో

రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలకు అతీతంగా పోరు

- జేపీ, ఉండవల్లితో రామకృష్ణ భేటీ
- సమగ్రమైన అవగాహనతో ప్రణాళిక





విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలకు అతీతంగా ఎవ్వరు ముందుకు వచ్చినా కూడా వారితో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధంగా వున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ హక్కుల సాధన కోసం మొదటి నుండి కూడా సీపీఐ పోరాటాలు చేయడంతో పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలనే డిమాండుతో ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రాల విభజన జరిగిన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఏఏ హామీలు ఇచ్చింది, వాటిలో ఎన్ని హామీలు అమలు అయ్యాయి అనే విషయంపై చర్చిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఇక్కడి లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్‌నారాయణ్‌తో పాటు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్‌తో రామకృష్ణ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు చర్చించారు. ముఖ్యంగా ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలతో పాటు నిజనిర్ధారణ కమిటీ విధివిధానాలు తదితర అంశాలపై వారు చర్చించారు. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అందరి అభిప్రాయాలు సేకరిస్తామని, అదే సమయంలో విభజన హామీలపై కూడా చర్చిస్తామని వివరించారు. అందులో కేంద్ర ప్రభుత్వం హామీలను ఎంతవరకు

- మిగతా 2 లో

స్మార్ట్ నిధుల్లోనూ వివక్ష

న్యూఢిల్లీ:

ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఏపీ పట్ల అన్ని విధాలుగా వివక్ష చూపిస్తున్నది. మోడీ ప్రతిష్ఠాత్మక పథకాల్లో స్మార్ట్‌సిటీ ఒకటి. దీని కింద వివిధ రాష్ట్రాల పరిధిలో 99 నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. కానీ ఇప్పటివరకు సుమా రు రూ.9940

- మహారాష్ట్రకు రూ.1,378 కోట్లు
- ఏపీకి రూ.588 కోట్లే
- తమిళనాడుకు తక్కువే...

కోట్లు విడుదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు నగరాలను ఈ పథకం కింద ఎంపిక చేసిన కేంద్రం ఇప్పటివరకు రూ.588 కోట్లే విడుదల చేసింది. కానీ ఈ పథకం కింద సింహభాగం మహారాష్ట్రలోని ఎనిమిది నగరాలకు కలిపి అత్యధికంగా రూ.1,378 కోట్లు విడుదలయ్యాయి.

మధ్యప్రదేశ్‌లోని ఏడు నగరాలకు కలిపి రూ.984 కోట్లు, తమిళనాడులో అత్యధికంగా 11 నగరాలను ఎంపిక చేసినా నిధులు రూ.848 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. కర్ణాటకలోని ఏడు నగరాలకు రూ.836 కోట్లు,



రాజస్థాన్‌లో నాలుగు నగరాలకు రూ.784 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని 10 నగరాలకు రూ.547 కోట్లు, గుజరాత్‌లోని ఆరు నగరాలకు రూ.509 కోట్లు విడుదలయ్యాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాను 2016 మేలో ఎంపిక చేసిన కేంద్రం ఇప్పటి వరకు రూ.9 కోట్లు విడుదల చేసింది. మమతా బెనర్జీ ప్రభుత్వం ఈ స్మార్ట్ సిటీస్ మిషన్‌లో భాగస్వాములు కావడం లేదని తెలిపింది. అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, త్రిపురలకు రూ.200 కోట్లు, మణిపూర్, నాగాలాండ్, సిక్కింలకు రూ.100 కోట్లు విడుదల చేసింది.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా పి.మధు తిరిగి ఎన్నిక



విశాలాంధ్ర-భీమవరం :

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా పెనుమల్లి మధు తిరిగి ఎన్నికయ్యారు. 15 మంది కార్యదర్శివర్గ సభ్యులుగా, 45 మంది కమిటీ సభ్యులుగా, 10 మంది ఆహ్వానితులుగా, మరో ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులుగా సీపీఎం రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. సోమవారం రాత్రి కమిటీ వివరాలను పి.మధు మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సమరశీల పోరాటాలతో ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బూర్జువా శక్తులను ఎదుర్కొంటామని వెల్లడించారు. రాష్ట్రం ఎన్నో సమస్యలతో సతమతమవుతుందని, పాలకులు

- మిగతా 2 లో

ఆర్మీనే అవమానిస్తావా?

ఆరెస్సెస్ చీఫ్ భగవత్‌పై రాహుల్ ఆగ్రహం

- వివరాలు 9 లో

నిబంధనలు సడలింపు

'అగ్రి' మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపుపై జీవో జారీ

- వివరాలు 3 లో

విజయవాడలోనే తాత్కాలిక హైకోర్టు

- సిటీ సివిల్ కోర్టు భవనంలో ఏర్పాటు
- ప్రకటించిన ప్రభుత్వం
- 8 నెలలో భవన నిర్మాణాలు పూర్తి చేస్తామన్న మంత్రి నారాయణ

2 లో

ఇదీ లోకం!



అతను..పవిత్రమైన మా పార్టీ 'ఎంపీ' ప్రత్యేక హెూదా కోసం పాపం.. చాలా గట్టిగా ..ఎంతో తీవ్రంగా కృషిచేస్తూ ఉన్నారు!

వడ్డీ పేరుతో నడ్డి విరుపు



రైతు రుణాలపై వడ్డీయా !

- రాష్ట్రంలో జీడీసీసీ బ్యాంకుకు ప్రత్యేక రూలా
- రైతులపై పడనున్న రూ. 63కోట్ల భారం

విశాలాంధ్ర-అమరావతి :

రైతులు వ్యవసాయానికి తీసుకునే రుణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ రాయితీని కల్పిస్తున్నాయి. అయితే రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని ఏ కేంద్ర సహకార బ్యాంకు వ్యవహరించని విధంగా గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకులు, అధికారులు వ్యవసాయానికి లక్ష రుణం తీసుకున్న రైతుల నుంచి ముక్కు పిండి మరీ వడ్డీ వసూలు చేయాలని నిర్ణయించి ఆ మేరకు జిల్లాలోని సహకార సంఘాలను ఆదేశించారు. దీంతో సహకార సంఘాల పాలకవర్గాలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో 187 సహకార సంఘాల్లో 1.30లక్షల మంది రైతులు రూ.900 కోట్లను రుణంగా తీసుకున్నారు. లక్షకు మించి మూడు లక్షల వరకు రుణం తీసుకుంటే పావలా వడ్డీ అమలవుతుంది. కానీ లక్ష రూపాయలు రుణం తీసుకున్న రైతుల వద్ద కూడా వడ్డీ వసూలు చేయాలని నిర్ణయించటాన్ని రైతులు తప్పుబడుతున్నారు. రైతు రుణాలకు కేంద్రం మూడు శాతం, రాష్ట్రం నాలుగు శాతం రుణ రాయితీ చెల్లిస్తాయి. అయితే గత రెండేళ్ళుగా రుణ రాయితీ నిధులు విడుదల కాలేదన్న మిషతో రైతుల నుంచి నేరుగా వడ్డీ వసూలు చేసేందుకు జీడీసీసీ బ్యాంకు ప్రయత్నిస్తోంది. దాదాపు మూడేళ్ళుగా నాగార్జునసాగర్

- మిగతా 2 లో

మతం పేరిట నిజంపై దాడి



- వాస్తవాలు అబద్ధాలుగా ప్రచారం
- అమెరికాలో జాన్సన్ చట్ట సవరణ ప్రమాదకరం
- మతతత్వ శక్తుల చేతుల్లోకి పరిపాలన
- సైన్స్ లేకుండా అభివృద్ధి సాధ్యపడదు
- మీట్ ది ప్రెస్‌లో హేతువాది బాబు గోగినేని

2లో

ఇటలీలో ఫాసిస్టు వ్యతిరేక ర్యాలీ



రోమ్ : ఇటలీ నగరం మాసిరటలో ఫాసిస్టు వ్యతిరేక ర్యాలీ జరిగింది. మరో మూడు వారాల్లో దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈనేపథ్యంలో జరిగిన ఈ ర్యాలీకి ప్రాముఖ్యతుంది. దాదాపు 30వేల మందికిపైగా ఫాసిజాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న. ర్యాలీ జరగడానికి వారం ముందు మితవాదపార్టీకి చెందిన వ్యక్తి తుపాకితో 5గురిని గాయపర్చారు. దేశంలో నిరుద్యోగానికి కారణం ప్రభుత్వమేనని, వలసకారులుకాదని ప్రదర్శకులు నినాదాలు చేశారు. ఫాసిస్టు వ్యతిరేక గేయాలను ఆలపించారు. మిలన్, ఫ్లోరెన్స్, పియాసింజా నగరాల్లోను ఫాసిస్టు వ్యతిరేక ర్యాలీలు జరిగాయి. దక్షిణ కొరియాకు చెందిన మితవాద గ్రూపులు కొన్ని ఉత్తరకొరియా జాతీయ పతాకాలను కాల్చివేశారు. సియోల్‌లో జరుగుతున్న వింటర్ ఒలింపిక్స్‌లో ఉత్తరకొరియా పాల్గొనడాన్ని నిరసిస్తూ వీరు జాతీయ పతాకాలను తగులబెట్టారు.

బ్రెగ్జిట్‌పై స్పష్టత, వేగం అవసరం

ఐర్లాండ్ ప్రధానమంత్రి వరద్‌కర్ సూచన

డబ్లిన్ : సమయం మించిపోతున్నందున బ్రెగ్జిట్‌పై బ్రిటన్ స్పష్టతనివ్వడంతో పాటు వేగంగా పనిచేయవలసిన అవసరం ఉందని ఐర్లాండ్ ప్రధానమంత్రి లియోవరద్‌కర్ సూచించారు. స్థానిక టెలివిజన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బ్రెగ్జిట్‌పై రిఫరెండం జరిగి 20 మాసాలయ్యిందని, బ్రెగ్జిట్‌పై ప్రభుత్వం ఏమి చేస్తుందో బ్రిటన్ ప్రజలకు తెలియకుండా ఉందని అన్నారు. యూరోపియన్ యూనియన్‌తో బ్రెగ్జిట్ తరువాత ఎలాంటి సంబంధాలు కావాలని బ్రిటన్ కోరుకుంటున్నదో స్పష్టం చేయాలని ఆయన కోరారు. 2019 మార్చిలో ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగవలసివుంది. ఇందుకు మరో ఏడాదికిపైగా సమయం ఉంది. అందువల్ల త్వరపడి నిర్ణయాలు తీసుకోవాలి. బ్రెగ్జిట్‌పై చర్చలు జరుపుతున్న మైఖేల్ బెర్నియర్ గతవారం చర్చలతరువాత విసుగును వ్యక్తం చేశారని వరద్‌కర్ అన్నారు. బెర్నియర్ గతవారం బ్రెస్సెల్స్‌లో చర్చలు జరిగిన తరువాత విలేకరులతో మాట్లాడుతూ ఈ సమస్యపై పరిష్కారం ఖచ్చితంగా, స్పష్టంగా, నిర్దిష్టంగా ఉండాలని అన్నారు. రెండవదశ చర్చలు జరుగుతున్నప్పటికీ పురోగతి కనిపించడంలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర ప్రపంచం

సోషలిస్టు సమాజానికి అనుగుణంగా మతాలు

బీజింగ్ : సోషలిస్టు సమాజానికి అనుగుణంగా మతాలు తమ దృక్పథాన్ని రూపొందించుకోవాలని చైనా ఉపప్రధానమంత్రి వాంగ్‌యాంగ్ అన్నారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యులు కూడా జాతీయస్థాయి మత నాయకులతో జరిగిన సింపోజియంలో ఆయన మాట్లాడుతూ పైవిధంగా సూచించారు. నూతన సంవత్సరం వేడుకలకు ముందు మతనాయకులతో ఆయన సమావేశమయ్యారు. కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభ స్ఫూర్తితో మరింత అధ్యయనం జరిపి ఆయా మతాలవర్గాలు అనుసరించవలసిన అవసరం ఉందని అన్నారు. మత గ్రూపులకు క్రియాశీలమైన మార్గదర్శకాన్ని అందించినట్లయితే వారు సోషలిస్టు సమాజానికి అనుగుణంగా పనిచేయగలరని ఆయన అన్నారు. వివిధ జాతులు, మతాలు మధ్య ఐక్యతను పెంపొందించేందుకు, సామాజిక సఖ్యతకు మతగ్రూపులు సానుకూలమైన పాత్రను వహిస్తున్నాయని ఆయన వారిని అభివృద్ధించారు.

మత వ్యవహారాలపైన అలాగే విద్య, తదితర అంశాలపైన కూడా మరింత కృషి అవసరమని ఆయన చెప్పారు. మత వ్యవహారాలలో సమస్యలను పరిష్కరించుకొని, ఇబ్బందులను అధిగమించేందుకు ఆలోచించాలని చట్టానికి అనుగుణంగా పనిచేయాలని వాంగ్ చెప్పారు. మత గ్రూపులకు ఎల్లవేళలా అన్ని స్థాయిల్లోను ప్రభుత్వాలు మద్దతు తెలియజేస్తున్నాయని ఆయన చెప్పారు. వారి చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను పరిరక్షిస్తున్నామని అన్నారు. ఈనెల 16న జరిగే శీతాకాలం ఉత్సవాల సందర్భంగా వారికి ఆయన అభినందనలు తెలియజేశారు.

అణ్వస్త్రరహితంగా కొరియా ద్వీపకల్పం

అమెరికాతో కలిసి కృషి చేస్తామన్న చైనా



బీజింగ్ : కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్రరహితం చేసేందుకు అమెరికాతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగానే ఉన్నామని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల చైనా విదేశాంగశాఖ సహాయమంత్రి యాంగ్‌జిచి అమెరికాకు వెళ్లి ఆదేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశాంగమంత్రి రెక్స్‌టిల్లర్సన్‌తోను చర్చలు జరిపారు. ఈనెల 8,9 తేదీలలో ఆయన వాషింగ్టన్‌లో పర్యటించారు. కొరియా ద్వీపకల్పంలో అణ్వస్త్ర సమస్యపైన రెండుపక్షాలు పరస్పరం అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొరియా ద్వీపకల్పం అణ్వస్త్ర రహితంగా చేసేందుకు తాము కట్టుబడివున్నామని చైనా పేర్కొన్నది. ఆ ప్రాంతంలో శాంతి, సుస్థిరత అవసరమని సమస్య పరిష్కారానికి సంప్రదింపులు, చర్చలు ఎంతైనా ముఖ్యమని చైనా విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. పరస్పర గౌరవం, విశ్వాసం ద్వారా కొరియా ద్వీపకల్పంలో సమస్య పరిష్కారానికి సమన్వయంతో, సంప్రదింపుల ద్వారా, సంయుక్తంగా కృషి చేయాలని జిచి తెలిపారు. ఉత్తరకొరియాపైన మరింత కఠినమైన, తీవ్రమైన ఆర్థిక ఆంక్షలను ప్రకటించనున్నట్టు అమెరికా తాజాగా తెలియజేసింది. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ఈనెల 7వ తేదీన ఇందుకు సంబంధించిన ప్రకటన చేశారు. ఈనేపథ్యంలో చైనా, అమెరికా బాధ్యుల మధ్య జరిగిన చర్చలు ముఖ్యమైనవి. గతంలోను చైనా, కొరియా ద్వీపకల్పంలో ప్రశాంతత, సుస్థిరత నెలకొల్పేందుకు ఆ ప్రాంతాన్ని అణ్వస్త్ర రహితంగా రూపొందించాలని ప్రతిపాదించింది. ఉత్తరకొరియా అణ్వాయుధాల పరీక్షలను నిర్వహించిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి పలు ఆంక్షలను విధించింది.

ఉత్తరకొరియాతో మాట్లాడతాం : పెన్స్



వాషింగ్టన్ : ఒకవైపు తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు కొనసాగిస్తూ, మరిన్ని ఆంక్షలు విధిస్తామని బెదిరిస్తున్న అమెరికా ఉత్తరకొరియాతో చర్చలకు కూడా తాము సిద్ధమేనని చెప్తోంది. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ వాషింగ్టన్ పోస్టు విలేకరితో మాట్లాడుతూ దక్షిణకొరియాలో జరిగిన ఒలింపిక్స్‌లో పాల్గొని స్వదేశానికి తిరిగి వస్తున్న పెన్స్ మాట్లాడుతూ తమది ప్రపంచంలోనే అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థ అని, అయినప్పటికీ ఉత్తర కొరియాతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. మరోవైపు గరిష్టంగా ఆదేశంపై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు. ఆయన 5రోజులపాటు ఆసియా దేశాలలో పర్యటించి స్వదేశం తిరిగి వచ్చారు. దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్ ఇన్‌తోను ఆయన మాట్లాడారు. ఉత్తరకొరియాతో మాట్లాడేందుకు సంబంధించిన వ్యూహాన్ని మూన్ జాయ్ ఇన్ కూడా అంగీకరించారని ఆయనతో లోతైన చర్చలే జరిపానని పెన్స్ అన్నారు. ముందుగా దక్షిణకొరియా ఉత్తరకొరియా నేత కిమ్‌జాన్‌ఉన్‌తో సంప్రదింపులు జరపాలని పెన్స్, మూన్‌లు అంగీకరించారు. ఆ తరువాత అమెరికా ఉత్తరకొరియాతో చర్చలకు ముందుకు వస్తుందని పెన్స్ చెప్పారు. ఆసియా పర్యటన సందర్భంగా నిత్యం తమ అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడుతూనే ఉన్నానని, చర్చలకు సిద్ధంగా ఉన్నామనే అంశాన్ని కూడా ఆయనతో ధృవీకరించుకున్నాని చెప్పారు. దక్షిణకొరియాతో కలిసి వ్యూహాత్మకంగా ఉత్తరకొరియాతో చర్చించేందుకు నిజంగా అమెరికా సిద్ధపడితే సమస్య పరిష్కారానికి ట్రంప్ సానుకూలంగా ఉన్నట్టు భావించాలి. ఉత్తరకొరియాను అన్ని విధాలుగా శిక్షించవలసిందే అన్నట్టుగా గతంలో ట్రంప్ ప్రభుత్వం వ్యవహరించింది. ఉత్తరకొరియా అణ్వాయుధాల పరీక్షలను ఎలా నిలువరించాలని అన్న అంశంపై ట్రంప్, మూన్‌లు గతంలో చర్చించారు. నాలుగురోజుల క్రితం టోక్యోలో పెన్స్ మాట్లాడుతూ ఉత్తరకొరియాపైన అత్యంత కఠినమైన, తీవ్రమైన ఆంక్షలను మరోసారి విధించనున్నట్టు పెన్స్ చెప్పారు. ఉత్తరకొరియాతో మాట్లాడతామని అమెరికా చెప్పడం ఇది మొదటిసారి కాదు. గత డిసెంబర్‌లో అమెరికా విదేశాంగమంత్రి రెక్స్ టిల్లర్సన్ కూడా ఎలాంటి షరతులు లేకుండ ఉత్తరకొరియాతో మాట్లాడతామని ప్రకటించారు. ఆ తరువాత దాని ఊసే పట్టించుకోలేదు.

రెండు కొరియాల సమ్మిట్‌కు కసరత్తు



సియోల్ : రెండు కొరియాల దేశాధినేతల మధ్య శిఖరాగ్ర సమావేశం (సమ్మిట్) నిర్వహించేం దుకు తగిన వాతావరణాన్ని కల్పించాలని అందుకు రెండుపక్షాలు క్రియాశీలంగా పనిచేయాలని దక్షిణ కొరియా ప్రధానమంత్రి లినాక్-యాన్ పిలుపునిచ్చారు. తమ అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్‌ల మధ్య సమా వేశం జరగవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. ఉత్తరకొరియా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో జరిగిన విందు సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మిట్ ప్రతిపాదన చేశారు. సియోల్ ఒలింపిక్స్‌కు ఉత్తరకొరియా ఉన్నతస్థాయి బృందం వచ్చి పాల్గొన్నది. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ చెల్లెలు యోజాంగ్ కూడా సియోల్ ఒలింపి క్స్‌కు హాజరయ్యారు. ఉత్తరకొరియాలో పర్యటించవలసిందిగా పీపుల్స్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా గౌరవాధ్యక్షుడు కిమ్‌యాంగ్-నామ్ దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్‌ను కలుసుకొని ఆహ్వాన పత్రిన్ని అందించినట్టు యోన్‌హప్ వార్తా సంస్థ తెలిపింది. ఇరువురు నేతలు కలుసుకు నేందుకు అంతర్జాతీయ సహకారంతో కృషి జరగా లని మూన్ సమాధానం ఇచ్చినట్టుగా ఆ వార్తాసంస్థ పేర్కొంది. అలాగే కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్ర రహితం చేసేందుకు అమెరికాతో చర్చలకు సైతం ఉత్తరకొరియా సిద్ధపడాలని మూన్ కోరారు. ఒలిం పిక్స్ తరువాత రెండు కొరియాల మధ్య చర్చలు కొనసాగాలని లీనాక్‌యాన్ కోరారు. దక్షిణ కొరి యాలో జరుగుతున్న ఒలింపిక్స్‌కి హాజరైన ఉత్తర కొరియా బృందం మూడురోజులు అక్కడవుండి స్వదేశానికి చేరుకుంది. ఒలింపిక్స్ ప్రారంభం సందర్భంగా రెండు కొరియాల క్రీడా బృందాలు కలిసికట్టుగా కొరియా పునరేకీకరణ పతాకాన్ని చేతబూని మార్చ్ నిర్వహించారు.

సిరియా, టర్కీ మధ్య చర్చలు?

అంకారా : సిరియా, టర్కీల మధ్య చర్చలు తప్పనిసరిగా జరగాలని టర్కీ విదేశాంగమంత్రి మెవలట్ కౌసొగ్లు సూచించారు. సిరియా ప్రభుత్వానికి తాము ఎంతమాత్రం ముప్పుకాదని ఆయన అన్నారు. టర్కీ పార్లమెంటులో డిప్యూటీ, రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ నాయకుడు అయిన సెర్కన్‌టొపాల్ స్పుత్నిక్‌తో మాట్లాడుతూ అంకారా, డమాస్కస్ మధ్య వీలైనంత త్వరగా చర్చలు జరగాలని సూచించారు. ఇరుపక్షాల మధ్య నేరుగా చర్చలు జరిగితే మంచి ఫలితం ఉంటుందని అన్నారు. ఇరుగుపొరుగు దేశాల మధ్య శాంతి, స్నేహసంబంధాలు నెలకొల్పేందుకు చర్చలు ముందు షరతు అని ఆయన అన్నారు. పార్లమెంటరీ సమావేశాల్లో తాను ఈ అంశాన్ని చర్చలు ప్రతిపాదించినట్టుగా చెప్పారు. ఈ అంశం మంత్రిమండలి సమావేశంలో కూడా చర్చించాలని ఆయన కోరారు. ఇందుకు సంబంధించిన స్పందన ఇంకా తమకు రాలేదని తెలిపారు. అయితే చర్చలకు అవకాశం ఉందని గతంలో సిరియా, టర్కీ మధ్య సంబంధాలను పునరుద్ధరించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కూడా ఉందన్నారు. ఇందుకు సంబంధించి నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సిరియా ప్రభుత్వంతో సంప్రదింపులు కోసం పార్లమెంటరీ ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయాలని తాను చాలాసార్లు చెప్పానన్నారు. సంయుక్త కమిటీని ఏర్పాటుచేసి త్వరలోనే చర్చలు ప్రారంభించాలని కోరారు.

చీరతో స్కైడైవింగ్...!

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్ ధరించడం మరింత కష్టంగా మారిందని అన్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతో రెండుసార్లు డైవ్ చేసినట్లు చెప్పారు. పారాచూట్ ల్యాండ్ అయ్యేటప్పుడు కాస్త అదుపుతప్పిందని.. అయితే తనకేమీ గాయాలేమీ కాలేదని వెల్లడించారు. 'భారతీయ మహిళలు సాధారణంగా చీరల్లోనే కనిపిస్తారు. అలాగే ఇలాంటి సాహసాలను కూడా చీర కట్టుకుని చేయగలరని నిరూపించడానికి ఇలా చేశానని' శీతల్ తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన శీతల్ ఇద్దరు పిల్లలకు తల్లి. ఆమె పేరు మీద దేశీయంగా 18 స్కైడైవింగ్ రికార్డులు, అంతర్జాతీయంగా 6 రికార్డులు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 704 జంప్స్ చేసిన ఆమెను పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి. శీతల్ 2004 ఏప్రిల్‌లో రష్యాకు చెందిన ఎంఐ-8 హెలికాప్టర్ నుంచి ఉత్తర ధ్రువంలో మైనస్ 37డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద 2,400 అడుగుల ఎత్తు నుంచి ప్రాక్టీస్ లేకుండా స్కైడైవింగ్ చేసి అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించారు. ప్రపంచంలోనే అలా చేసిన తొలి మహిళగా రికార్డు దక్కించుకున్నారు. ఇలా ఆమె పేరిట చాలా అరుదైన రికార్డులు ఉన్నాయి. ఫిన్‌ల్యాండ్‌కు చెందిన ఇంజినీర్‌ను వివాహం చేసుకున్న శీతల్ అప్పుడు కూడా ఓ రికార్డు సృష్టించారు. తమ పెళ్లిని హాట్‌ఎయిర్ బెలూన్‌లో 750 అడుగుల ఎత్తులో చేసుకున్నారు.

పి.మధు తిరిగి ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలను గాలికొదిలేసి ఆకాశంలో చక్కర్లు కొడుతున్నారని, వారి ఆటలు సాగనివ్వమని ఆయన హెచ్చరించారు. నూతన కార్యదర్శివర్గ సభ్యులుగా ఎంపి.గఫూర్, వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య, సిహెచ్.నర్సింహరావు, మిడియం బాబూరావు, ఎం.వి.ఎస్.శర్మ, దడాల సుబ్బారావు, ఎం.కృష్ణమూర్తి, సిహెచ్.బాబూరావు, వి.ఉమామహేశ్వరరావు, కె.ప్రభాకర్‌రెడ్డి, డి.రమాదేవి, మంతెన సీతారాం ఎన్నికయ్యారు.

రాష్ట్ర కమిటీ సభ్యులుగా బి.తులసీదాస్, వై.సిద్ధయ్య, వి.వెంకటేశ్వర్లు, పి.జమలయ్య, మిరియం వెంకటేశ్వర్లు, జె.జయరాం, ఎ.వి.నాగేశ్వరరావు, కె.స్వరూపరాణి, కె.ధనలక్ష్మి, సుబ్రమణ్యం, అంద్ర మాల్యాద్రి, పి.మురళీకృష్ణ, జి.ఓబులు, కె.సుబ్బరావమ్మ, ఎం.రామకృష్ణ, బాబూజీ, కె.గెడ్డన్న, ఎం.బాల కాశి, పి.పెద్దిరెడ్డి, బి.ప్రభావతి, వై.అచ్యుతరావు, బి.కృష్ణమూర్తి, రెడ్డి శ్రీరామ్మూ ర్తి, బి.గంగారావు, కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, టి.అరుణ్, వి.బలరాం, జె.ఎస్.వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, డి.వి.కృష్ణ, కె.శ్రీదేవి, ఆర్.రఘు, పి.రామారావు, గద్దె చలమయ్య, పునాటి ఆంజనేయులు, సయ్యద్‌హ నీఫ్, సీహెచ్ రాజగోపాల్, ఎస్.యాదగిరి, వి.రాంభూపాల్, కె.అంజనేయులు, పి.నిర్మల, రమేష్ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఆహ్వానితులుగా జె.ప్రభాకర్, లక్ష్మణ్, జాల అంజయ్య, కె.ఉమామహేశ్వరరావు, బి.నారాయణ, కుంజా సీతారామయ్య, టి.సూర్యారామయ్య, గౌస్ దేశాయ్, డి.కాశీనాథ్, ఎం.ఇంతియాజ్, ప్రత్యేక ఆహ్వానితులుగా ఆర్.సత్యనారాయణరాజు, చౌదరి తేజేశ్వరరావు, పాటూరు రామయ్య, జక్కా వెంకయ్య, టి.నర్సింహమయ్య, కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా బి.ఆర్‌తులసీరావు, సభ్యులుగా టి.షద్రక్, చట్టా వెంకయ్య, వి.సావిత్రి, జి.రాజేశ్వరరావు ఉన్నారు.

సీపీఎం మహాసభల్లో తీర్మానాలు

కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు ఇచ్చి వడ్డీలేని పంట రుణాలు ఇవ్వాలని, ప్రకృతి వైపరీత్యాల్లో దెబ్బతిన్న పంటలకు పెట్టుబడి రాయితీని, బీమా పరిహారాన్ని షరతులు లేకుండా చెల్లించాలని సీపీఎం 25వ మహాసభ తీర్మానించి ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. భీమవరంలో జరుగుతున్న పార్టీ మహాసభల్లో మూడవ రోజు సోమవారం జరిగిన ప్రతినిధుల సమావేశంలో రైతు సంఘం నాయకులు పెద్దిరెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కౌలు రైతు సంఘం నాయకులు కె.శ్రీనివాస్ బలపరిచారు. రైతులకు పూర్తి సబ్సిడీ రుణాలివ్వాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం తేవాలని, పెరుగుతున్న కౌలు రేట్లను తగ్గించాలని, సమగ్ర విత్తన చట్టం తేవాలని, చెరకు పంటకు న్యాయ మైన మద్దతు ధర ఇవ్వాలని, సహకార రంగాన్ని కాపాడాలని, కరవుతో కొట్టుమిట్టాడుతున్న రైతులను ఆదుకోవాలని, రాష్ట్రంలో వెనుబడిన ప్రాంతాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి నిధులు ఇచ్చి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని, నిర్వాసితులకు నిధులు కేటాయించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతోపాటు ఇతర తీర్మానాలను సభ ఆమోదించింది.

మతం పేరిట నిజంపై దాడి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి :

విజ్ఞాన శాస్త్రమంటేనే నిజమని, దానిపైనే నేడు మతం, పురాతన, పురాణ గ్రంథాల పేరుతో దాడి జరుగుతోందని హేతువాది, ప్రోగ్రెసీవ్ ఫోరం జాతీయ ప్రతినిధి బాబు గోగినేని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసార మాధ్యమాల్లోనూ వాస్తవాన్ని అబద్ధంగా ప్రచారం చేయటం శోచనీయమన్నారు. దీనివల్ల దేశాభివృద్ధి కుంటుపడుతుందన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మతపర సంస్థలకు వచ్చే విరాళాలకు పన్ను మినహాయింపు ఇవ్వటంతోపాటు ఆ నిధులు రాజకీయాల్లోకి వెళ్లకూడదన్న ఆ దేశ జాన్సన్ చట్టాన్ని రద్దు చేయటం ఇపుడు ప్రపంచ దేశాలకు పెద్ద ప్రమాదమని ఆయన హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం బాబు గోగినేని మీట్ ది ప్రెస్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాన్సన్ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడం వల్ల క్రిస్టియన్ మతానికి ప్రపంచ దేశాల నుంచి వచ్చే కోట్లాది డాలర్లను కన్జర్వేటర్ పార్టీకి పెట్టుబడులుగా మారుతాయన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వాలు కార్పొరేట్‌లకే కొమ్ముకాస్తుండగా, ఇకపై మతానికి కూడా వత్తాసు పలికే ప్రమాదం ఉందన్నారు. ఇదే పరిణామం మన దేశంలోనూ వేళ్లూనుకుంటోందని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనేక పరిశోధనల ఫలితంగా నిరూపితమైన సిద్ధాంతాలనే మతతత్వవాదులు అబద్ధమని ప్రచారం చేస్తున్న నేపథ్యంలో, అమెరికా అధ్యక్షుడు తీసుకున్న నిర్ణయం మరింత ప్రమాదకరంగా మారిందన్నారు. జాన్సన్ చట్ట సవరణ అంశం మన దేశంలోనూ అమలైతే మతతత్వశక్తుల చేతుల్లోకి పరిపాలన వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలే డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం తప్పు అని ప్రచారం చేయటం శోచనీయమన్నారు.

డార్విన్, ఐన్‌స్టీన్‌కు మతంతో పోలికా... : సత్యాన్ని సత్యంగా చూడాలే తప్ప, డార్విన్, ఐన్‌స్టీన్‌ను మతపరంగా వాడుకోకూడదని బాబు చెప్పారు. మనిషి కోతి నుంచి పుట్టాడని డార్విన్ చెప్పలేదని, కాని అలా చెప్పాడంటూ ప్రచారం చేయటం శోచనీయమన్నారు. ఇపుడు ప్రపంచంలో డార్విన్‌పై జరుగుతున్న దాడికి అమెరికా సహకరిస్తోందని విమర్శించారు. రుజువులు ఉన్నప్పటికీ తప్పుగా ప్రచారం చేస్తే సైన్స్‌ను రక్షించేది ఎవరని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విద్యా వ్యవస్థనూ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సైన్స్ టీచర్లు కూడా పుస్తకాలలోని పాఠాలను మాత్రమే బోధిస్తున్నారుగానీ, పరిశోధనలు ఎక్కడా జరగటంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైన్స్ ఎంతగానో అభివృద్ధి చెందినా మూఢనమ్మకాలు తగ్గలేదని అన్నారు. శాస్త్రీయ దృక్పథంపై ఎవరికీ అవగాహన ఉండటంలేదన్నారు. ప్రపంచంలో నిత్యం అనేక కొత్త విషయాల ఆవిష్కరణ జరుగుతున్నా, వాటికి ఎక్కడా ప్రాధాన్యం లభించటంలలేదన్నారు. ప్రతి దానిని విశ్లేషించటంతోపాటు ప్రశ్నించేతత్వాన్ని విద్యార్థులకు కలిగిస్తే తప్పకుండా తక్కువ సమయంలో అధునాతన భారతదేశాన్ని చూసే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.

డార్విన్ లేకుండా ఆధునిక జీవశాస్త్రం లేదు : జీవపరిణామ సిద్ధాంతకర్త డార్విన్ లేకుండా ఆధునిక జీవశాస్త్రాన్ని చూడలేమని బాబు చెప్పారు. అయితే దీనికి కూడా వక్రభాష్యం చెప్పటం శోచనీయమన్నారు. దేశంలోని 134 కోట్ల మంది జనాభాలో 80 కోట్ల మంది 35 ఏళ్ల వయస్సున్న వారేనని, వారిలో సైన్ ప్రాధాన్యం, కొత్త ఆవిష్కరణపై అవగాహన పెంచితే త్వరితగతిన దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కాని సైన్స్‌ను విస్తరించడంలో అంతా వైఫల్యం చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహా విస్ఫోటనం ద్వారా విశ్వం ఏర్పడిందని, దీని గురించి సైన్స్ చెబుతుంటే, పురాణ గ్రంథాల్లో మాదిరిగానే జరుగుతోందంటూ కొందరు ప్రచారం చేయటం హాస్యాస్పదమన్నారు. సైన్స్‌ను ఒక సంస్కృతిగా అలవాటు చేయకుండా సంస్కృతి వర్సెస్ సైన్స్‌గా మార్చేశారన్నారు. సైన్స్ పరిశోధనల ఆధారంగానే మానవ జీవితకాలం 40 ఏళ్ల నుంచి 67 సంవత్సరాలకు పెరిగిందని, అమెరికాలో ఇది 85 ఏళ్లగా ఉందన్నారు. ఒకనాడు సైన్స్‌లోనే ప్రథమంగా ఉన్న భారత్‌లో నేడు అంతటి పరిస్థితి కనిపించటలేదని, అలాంటి పూర్వ వైభవం రావాలంటే సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ సైన్స్‌ను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, ఏపీయూడబ్ల్యుజే విజయవాడ అర్బన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్‌కే బాబు పాల్గొన్నారు.

విజయవాడలోనే తాత్కాలిక హైకోర్టు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి :

తాత్కాలిక హైకోర్టును విజయవాడలోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాత్కాలిక వసతిని కల్పించేందుకు హైకోర్టు నియమించిన న్యాయమూర్తుల కమిటీ మూడు రోజులపాటు కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు రాజధాని అమరావతి ప్రాంతంలోనూ పలు భవనాలను న్యాయమూర్తుల కమిటీ పరిశీలించింది. తొలుత గన్నవరంలోని వెటర్నరీ కాలేజీ భవనాలతోపాటు ఇబ్రహీంపట్నంలోని నిమ్రా ఇంజనీరింగ్ కాలేజీ భవనాలతోపాటు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దూర విద్యా కేంద్రాన్ని, అమరావతిలోని పలు ప్రాంతాలను బృందం పరిశీలించింది. అయితే హైకోర్టు కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆయా ప్రాంతాలు అంతగా అనువుగా లేనట్లుగా బృందం భావించింది. అదే సమయంలో విజయవాడలో నిర్మాణంలో ఉన్న సిటీ సివిల్ కోర్టు భవన సముదాయంపైనా న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు చర్చించారు. తాత్కాలిక హైకోర్టుకు ఆ భవనాలు అనుకూలంగా ఉంటాయనే నిర్ధారణకు బృందం వచ్చింది. విజయవాడ సిటీ సివిల్ కోర్టు భవన సముదాయంలోనే తాత్కాలిక హైకోర్టును ఏర్పాటు చేయనున్నట్లు పురపాలకశాఖ మంత్రి ఎస్ నారాయణ సోమవారం ప్రకటించారు. సిటీ సివిల్ కోర్టు భవన నిర్మాణం మరో ఎనిమిది నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. దీంతో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటుపై ఇప్పటి వరకూ ఉన్న మీమాంస తొలగిపోయింది. హైదరబాద్‌లోని హైకోర్టే తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌కు హైకోర్టుగా కొనసాగుతోంది. ఏపీకి ప్రత్యేకంగా హైకోర్టును ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన డిమాండు తెరపైకి రావటంతోనే రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఆందోళనలు ప్రారంభమయ్యాయి. కర్నూలు, గుంటూరులో హైకోర్టును ఏర్పాటు చేయాలంటూ ఆయా ప్రాంతాల న్యాయవాదులు డిమాండు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలోని సిటీ సివిల్ కోర్టు భవనంలోనే తాత్కాలిక హైకోర్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించటంతో ఆందోళనలకు తెరపడినట్లైంది.

పార్టీలకు అతీతంగా పోరు

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేసింది, ఇంకా చేయాల్సినవి ఏమైనా వున్నాయా అని పరిశీలించి సమగ్రమైన అవగాహనతో ముందుకు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. జేపి, ఉండవల్లి, పవన్ ఇదే ఆలోచనతో ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ నెల 8న వామపక్షాలు పిలుపునిచ్చిన రాష్ట్రబంద్‌లో చాలా మంది స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేశారని చెప్పారు. జయప్రకాష్‌నారాయణ్, ఉండవల్లిఅరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీ ప్రజల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని, ఇప్పటి వరకు ప్రచారాలు, అర్భాటాలు తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. విభజన హామీల సాధనకు చిత్తశుద్ధితో తమ వంతు ప్రయత్నం చేస్తామని, విభజన హామీలు, ప్రత్యేక హోదా తప్పకుండా ఇవ్వాలని డిమాండు చేశారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం దేనికి ఎంత నిధులు కేటాయించింది, ఏ మేరకు హామీలు నెరవేరాయనే అంశాలపై నిపుణులతో మరింత సమాచారం తీసుకోవాల్సిన అవసరం వుందని అన్నారు. రామకృష్ణ అనుకోకుండా ఇక్కడికి వచ్చి భేటీలో పాల్గొన్నారని చెప్పారు. రాజకీయాలకు సంబంధం లేకుండా ప్రజలకు మేలు జరగాలని అందరూ అకాంక్షిస్తున్నట్లు ఉండవల్లి చెప్పారు. అర్భాటం కోసం లేదా తాత్కాలిక ప్రయోజనాల కోసం ప్రకటనలివ్వడంపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రయోజనాలపై చాలా మందికి లేవని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా అలస్యం జరిగిపోయిందని నాలుగేళ్లు గడిచాయని ఇప్పటికైనా తేరుకోకపోతే మరింత నష్టం జరుగుతుందన్నారు.

ఇదీ స్వాతంత్ర్య పోరే

(మొదటిపేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 14 వేల చెరువులు, 2,500 సెలయేళ్లు, 10వేల చెక్ డ్యామ్‌లలో చేపట్టిన జలసంరక్షణ పనులను విజయవంతం చేయాలని కోరారు. రబీ పంట రుణాల లక్ష్యం 76 శాతం చేరుకున్నామంటూ, మిగిలిన రుణాలు కూడా వెంటనే అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కౌలు రైతులకు పంట రుణాల పంపిణీ శ్రీకాకుళం, కడపలో మరింత ముమ్మరం కావాలన్నారు. నీతి ఆయోగ్ వ్యవసాయ కమిటీ సభ్యుడు రమేష్ చంద్ర పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో మన రాష్ట్రంలో జరుగుతున్న ఇ-నామ్‌ను ప్రశంసించారని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ పేర్కొనగా, ఇ-నామ్‌లో దేశంలో మన రాష్ట్రం ముందుండాలని ముఖ్యమంత్రి అకాంక్షించారు. ప్రస్తుతం రోజుకు 100 ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తున్నామని, దీనిని 150 ఇళ్లకు పెంచాలని ఆదేశించారు. 2016-17 పనులు ప్రారంభం అయిన అన్ని ఇళ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో నగదు కొరత నివారణకు ఆర్బీఐకి లేఖ రాయనున్నట్లుగా తెలిపారు. ప్రధానమంత్రి-చంద్రన్న బీమాపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మార్చి31 లోపు కార్మికుల బిడ్డలందరి పేర్లు నేషనల్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్మికుల బిడ్డలకు రూ.1200 ఉపకార వేతనం అందేలా చూడాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నడ్డి విరుపు

(మొదటిపేజీ తరువాయి)

కుడికాల్వకు సరిగా నీరు విడుదల కాకపోవటం, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆ జిల్లా రైతాంగం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఇదే సమయంలో రైతు రుణాలకు వడ్డీ చెల్లించటమంటే తలకు మించిన భారమే. ఏడు శాతం వడ్డీ అంటే ఏడాదికి వంద రూపాయలకు ఏడు రూపాయలు వడ్డీ. ఈ వడ్డీ చెల్లించాలన్న నిబంధన వల్ల రైతులపై 63 కోట్ల మేర ఆర్థిక భారం పడుతుంది. జీడీసీసీ బ్యాంకు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నా కూడా ఆప్కాబ్, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని నియంత్రించేందుకు పట్టించుకోకపోవటం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాల్సిన వడ్డీ రాయితీని కరవుతో సరైన దిగుబడులు లేక నష్టపోయిన రైతాంగం నుండి వసూలు చేయాలన్న నిర్ణయంపై ఆ జిల్లా రైతాంగంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మిగిలిన బ్యాంకులకు ఒక రూలు, జీడీసీసీ బ్యాంకుకు మరొక రూలును అమలు చేయటం పట్ల సహకార సంఘాల పాలకవర్గాలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి. అయితే బ్యాంకు ఛైర్మన్, ఉన్నతాధికారులు వడ్డీ వసూలు చేయాల్సిందేనని హడలెత్తిస్తుండటంతో సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలంటూ గుంటూరు జిల్లా రైతాంగం కోరుతున్నారు.

దళితులను అవమానిస్తున్న చంద్రబాబు : మేరుగ నాగార్జున



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:రాష్ట్రంలోని దళితుల్ని సీఎం చంద్రబాబు ప్రభుత్వం అడుగడుగునా అవమానిస్తూ, దళిత తేజం కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటని వైసీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షులు మేరుగ నాగార్జున విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కడప జిల్లాలో నిర్వహించిన దళిత తేజం కార్యక్రమంలో దళిత మహిళలను కింద కూర్చోబెట్టి అగ్రవర్ణ టీడీపీ నేతలను కింద కూర్చోబెట్టడం సిగ్గుచేటని అన్నారు.ఈ సమావేశంలో వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు బూదాల శ్రీనివాసరావు, తోకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను మోసం చేసిన చంద్రబాబు : కొలనుకొండ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని రజక వర్గాలకు సీఎం చంద్రబాబునాయుడు తీవ్ర ద్రోహం చేశారని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ విమర్శించారు.ఈ మేరకు సోమవారం పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు రజకులకు చేస్తున్న అన్యాయానికి కేంద్రమంత్రి సమాధానమే సాక్ష్యమని పేర్కొన్నారు.2016 మార్చి 5న నిర్వహించిన అసెంబ్లీలో గవర్నరు తన ప్రసంగంలో రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామంటూ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని గుర్తుచేశారు.రజకుల ఐక్య ఉద్యమాలతో హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు.



ఫైబర్‌నెట్‌తో నాణ్యమైన సేవలు అందించాలి : సీఎస్

విశాలాంధ్ర-అమరావతి : ఫైబర్‌నెట్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో రాజీపడద్దని సీఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఏపీ ఫైబర్ నెట్ (భారత్ నెట్ ఫేజ్-2) అమలుపై భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్ వర్కు లిమిటెడ్ సీఎండీ సంజయ్‌సింగ్‌తో కలిసి సోమవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో సీఎస్ మాట్లాడారు. రాష్ట్రంలో త్వరితగతిన ఫైబర్ నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నిర్దేశిత గడువులోగా ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్, ఆశాఖ కార్యదర్శి విజయానంద్, బీఎస్ఎన్ఎల్ సీజీఎం ఏపీరావు, బీఎస్ఎన్ఎల్ జీయం రవీంద్రనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.అదేవిధంగా అమరావతిలో మానవ వనరుల అభివృద్ధి సంస్థకు అవసరమైన స్థలం కేటాయింపు పైనా ఆయన అధికారులతో సమీక్షించారు. ఇందుకు సంబంధించి వెంటనే సవివర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను తీసుకుని దానిని సీఆర్డీఏ ప్లానింగ్ విభాగంతో పరిశీలించి అవసరమైన స్థలం కేటాయించే అంశంపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హెచ్ఆర్డీ ఇనిస్టిట్యూట్ పరిపాలనా భవనం, రెసిడెన్షియల్ క్వార్టర్లు, శిక్షణ కేంద్రాలు, ఇతర వసతులకు సంబంధించి ఎంతమేరకు భూమి కావాల్సి ఉందనేది డీపీఆర్‌ను పరిశీలించిన తర్వాత స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, ఆర్థికశాఖ కార్యదర్శి హేమ మునివెంకటప్ప, పంచాయితీరాజ్‌శాఖ కమిషనర్ బి.రామాంజనేయులు, పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధిశాఖ సాంకేతిక సలహాదారు కొండలరావు, సిసిఎల్ఏ కార్యదర్శి బి.రామారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏపీలోని ప్రజల నుండి జన్మభూమి, ఇతర ఆర్థికేతర సంబంధితమైన ఫిర్యాదులన్నిటినీ త్వరితగతిన పరిష్కరించాలని దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం, ముఖ్యమంత్రి హామీలు అమలుపై ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులన్నిటినీ నిర్దిష్ట వ్యవధిలోగా పరిష్కరించాలని ముఖ్యంగా ఆర్థికేతర పరమైన ఫిర్యాదులన్నిటినీ వెంటనే పరిష్కరించాలని చెప్పారు.గృహనిర్మాణ శాఖకు సంబంధించి అత్యధికంగా 28లక్షల 98వేల 907 ఫిర్యాదులు రాగా వాటిని ప్రజాసాధికార సర్వే జాబితాతో పరిశీలించగా వాటిలో 9లక్షల 23వేల 530 అర్హమైనవిగా గుర్తించారని, వాటిలో 8లక్షల 38వేల 413 అత్యంత ముఖ్యమైనవి తేలాయని చెప్పారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, సర్వీసెస్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణద్వివేది, ప్రణాళికాశాఖ కార్యదర్శి సంజయ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా కంబర్



న్యూఢిల్లీ : ప్రముఖ కన్నడ కవి, రచయిత చంద్రశేఖర కంబర్ కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత అయిన కంబర్.. సాహిత్య అకాడమీ అధ్యక్ష ఎన్నికల్లో మరాఠీ రచయిత బాల్‌చంద్ర వి నెమాడే, ఒడిశా రచయిత ప్రతిభారాయ్‌లతో పోటీ పడ్డారు. కంబర్ ప్రస్తుతం అకాడమీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సోమవారం జరిగిన ఈ ఎన్నికల్లో కంబర్ విజయం సాధించారు.కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా కంబర్ ఎన్నికై ఈ పదవి చేపట్టిన మూడో కన్నడ వ్యక్తిగా నిలిచారు. గతంలో కర్ణాటకకు చెందిన వినాయక కృష్ణ గోకక్ (1983), యూఆర్ అనంతమూర్తి (1993) అకాడమీ అధ్యక్షులుగా వ్యవహరించారు.1937 జనవరి 2న జన్మించిన కంబర్ పలు కన్నడ సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు. హంపీలోని కన్నడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉపకులపతిగా కూడా ఉన్నారు. 1991లో సాహిత్య అకాడమీ అవార్డు, 2011లో జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

జల సంరక్షణలో భాగస్వాములుకండి

చంద్రబాబునాయుడు



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : నదుల అనుసంధానం ద్వారా బీడుభూములను సాగులోకి తీసుకురావచ్చునని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రాజధాని పరిధిలో తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద పాలవాగు డ్రెయిన్ పూడికపనులు ప్రారంభించి, నీరు-ప్రగతి కార్యక్రమంలో భాగంగా జలసంరక్షణ రెండోదశ కార్యక్రమాన్ని సోమవారం ఆరంభించారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసంరక్షణ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్రంలో గతసంవత్సరం 29శాతం వర్షపాతం లోటు ఉన్నప్పటికీ వ్యవసాయరంగంలో 14శాతం వృద్ధిరేటు సాధించామన్నారు. ఈ సంవత్సరం వ్యవసాయరంగంలో కేంద్రం వృద్ధిరేటు 2.8శాతం సాధించగా, తొలిఆరునెలల కాలంలో రాష్ట్రంలో 25.60శాతం వృద్ధిరేటు సాధించామన్నారు. రెండోదశ జలసంరక్షణ ఉద్యమంలో భాగంగా మంగళవారం నుంచి జూన్‌ఏడో తేదీవరకు 116రోజులు నీరు-ప్రగతి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా జంగిల్‌క్లియరెన్సు, చెరువుల్లో పూడికతీత, చెరువు గట్లు పటిష్టీకరణ, చెరువుల అనుసంధానం, గొలుసుకట్టు చెరువుల అభివృద్ధి, పంటసంజీవినీల తవ్వకాలు వంటివి జరుగుతాయన్నారు. పట్టిసీమప్రాజెక్ట్ ద్వారా గోదావరి, కృష్ణానదులను అనుసంధానం చేసి ఈఏడాదిలో వందటీఎంసీల నీటిని అందించమన్నారు. భవిష్యత్తులో నాగావళి, వంశధార, పెన్నా నదుల అనుసంధానం కార్యక్రమాలు చేపడతామన్నారు. భూగర్భజలాలు శాతం పెరిగే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలుత నీరు-ప్రగతి కార్యక్రమంలో ఏర్పాటుచేసిన ప్రదర్శనను సీఎం చంద్రబాబు తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్రజలవనరులశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనంద్‌బాబు, జిల్లాకలెక్టర్ కోన శశిధర్, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్, తాడికొండశాసనసభ్యులు శ్రావణ్‌కుమార్, జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి ఐపీ పెట్టిన మోడీ

పీసీసీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రధాని మోడీ ఐపీ పెట్టారని, ప్రత్యేక హోదా, విభజన హామీలను పూర్తిగా విస్మరించారని పీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ, టీడీపీ భాగస్వాములుగా వున్నాయని,ఈ రెండు ప్రభుత్వాలు రాష్ట్రానికి తీరని ద్రోహం చేశాయని ఎద్దేవా చేశారు.విభజన చట్టంలోని సెక్షన్ 46(2) ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన తొలి ఏడాదిలో(2014-15) సీమాంధ్రలో ఏర్పడే మొత్తం రెవెన్యూ లోటును కేంద్ర ప్రభుత్వమే భర్తీ చేయాలని, ఫిబ్రవరి 20న 2014న రాజ్యసభలో మన్మోహన్‌సింగ్ స్పష్టం చేశారని వివరించారు. కాగ్ నివేదిక ప్రకారం 2014-15లో సీమాంధ్ర రెవెన్యూలోటు రూ.16,078 కోట్లు వుండగా, ఇప్పటివరకూ కేంద్రం నుంచి రూ.3,979,50కోట్లు వచ్చిందన్నారు. ఇంకా రూ.12,100 కోట్లురావాల్సి వుందని తెలిపారు. దాదాపు నాలుగేళ్లపాటు టీడీపీ నేతలు నిద్రపోయి..ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల పేరిట హడావుడీ చేయడం విడ్డూరంగా వుందని ఎద్దేవా చేశారు.మోడీ మోసకారి తనం, చంద్రబాబు చేతకాని తనం, జగన్ లోపాయికారి తనంతో రాష్ట్రం భారీగా నష్టపోయిందని వాపోయారు.ఈ విలేకరుల సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

టీ నగర్ ఎస్‌బీఐలో ప్రదీప్‌కుమార్‌కు బినామీ లాకర్

- ఓపెన్ చేసిన ఏసీబీ అధికారులు
- 905 గ్రాముల ఆభరణాల గుర్తింపు
- విలువ రూ.22 లక్షలపైనే
- అక్రమాస్తుల దస్తావేజు జిరాక్స్ కాపీలు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ఆదాయానికి మించి అక్రమాస్తులను కూడబెట్టిన కేసులో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ)కి పట్టుబడిన విశాఖ పట్టణాభివృద్ధి సంస్థ (వుడా) అదనపు చీఫ్ ప్రణాళికాధికారి పీ ప్రదీప్‌కుమార్‌కు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని టీ నగర్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో బినామీ లాకర్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తన అక్క భర్త పేరుతో ఓపెన్ చేసిన లాకర్‌ను ఏసీబీ అధికారులు సోమవారం ఓపెన్ చేశారు. అందులో 905 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.22 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే ప్రదీప్‌కుమార్‌కు పలు చోట్ల నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమితోపాటు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు, ఫ్లాట్స్ ఉన్నాయి. వాటికి సంబంధించిన దస్తావేజు జిరాక్స్ కాపీలను ప్రదీప్ కుమార్ లాకర్‌లో దాచిపెట్టాడు. గత నెల 29న ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఆ దాడులలో సుమారు రూ.150 కోట్ల విలువైన అక్రమాస్తులను ఏసీబీ గుర్తించింది. బినామీ పేర్లతోనూ పలు చోట్ల ఆస్తులున్నాయని, వాటికి సంబంధించిన దాక్యుమెంట్‌లను రహస్య ప్రదేశంలో దాచినట్లు సమాచారం. అందులో భాగంగానే పలు ప్రాంతాలలో ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి.

'అగ్రి' మృతుల కుటుంబాలకు

పరిహారం చెల్లింపు నిబంధనలు సడలింపు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అగ్రిగోల్డ్ ఆర్థిక కుంభకోణాన్ని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన, గుండెపోటుతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లింపునకు రెండు కీలక నిబంధనలను ప్రభుత్వం సడలించింది. నష్టపరిహారం కోసం పోస్టుమార్టం రిపోర్టు, ఎఫ్ఐఆర్ కాపీలు లేకపోయినప్పటికీ మృతుల కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించేందుకు వీలుగా హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ సవరించిన ఉత్తర్వులను సోమవారం జారీ చేశారు. గత ఏడాది మే 12కు ముందు మృతి చెందిన వారికి ఈ రెండు నిబంధనల నుంచి సడలింపు ఇచ్చినప్పటికీ, మిగిలిన షరతులు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అగ్రిగోల్డ్ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన వారు, డిపాజిట్‌లు కట్టించిన ఏజెంట్లు సుమారు 180 మంది గుండెపోటుతోనూ, ఒత్తిళ్లకు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లింపునకు గతేడాదే ప్రభుత్వం రూ.5 కోట్లను విడుదల చేసింది. అయితే నష్టపరిహారం కోసం ఎఫ్ఐఆర్ కాపీతోపాటు పోస్టుమార్టం రిపోర్టు (శవ పంచనామా), డెత్ సర్టిఫికెట్, మృతి చెందిన వారితో లబ్దిదారునికి ఉన్న సంబంధం, చట్టపరమైన వారసత్వ సర్టిఫికెట్, లబ్దిదారులు మైనర్ అయితే పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, చట్టపరమైన వారసుల నుంచి మరణానికి కారణం తెలియజేస్తూ అఫిడవిట్‌ను సమర్పించాలని గత ఏడాది మే 12న ప్రభుత్వం జీఓఎంఎస్ నంబర్ 80ని విడుదల చేసింది. అయితే అందులో ఎఫ్ఐఆర్, శవ పంచనామా రిపోర్టులను సమర్పించటం సాధ్యపడదంటూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. నిధులు మంజూరు చేసినా పరిహారం చెల్లింపులో జాప్యం జరగటాన్ని నిరసిస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్‌లో సత్యాగ్రహం దీక్షలు జరిగాయి. దీనిపై స్పందించిన ప్రభుత్వం మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపులో కీలక నిబంధనలకు మినహాయింపు ఇచ్చింది. డిసెంబర్‌నాటికి 159 మంది బాధితులు ఆత్మహత్యలకు పాల్పడి, గుండెపోటుతో మృతి చెందినట్లు అసోసియేషన్ అగ్రిగోల్డ్ కేసును విచారణ చేస్తున్న సీఐడీ అదనపు డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావుకు నివేదించింది. ఇదిలావుండగా, బాధితులు, ఏజెంట్ల ఆత్మహత్యలు, ఒత్తిళ్లు, గుండెపోటు మరణాలపై పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు అందాయి. మృతులకు నష్టపరిహారం చెల్లింపు విషయంలో సీఐడీ అదనపు డీజీపీ పర్యవేక్షణలో విచారణ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదించాల్సి ఉంది. ఖాతాదారులు, ఏజెంట్లు ఒత్తిళ్ల వల్లే మృతి చెందారా, గుండెపోటుతో మృతి చెందారా అని నిర్ధారణ చేయాల్సి ఉంది. ఇదిలావుండగా, నష్టపరిహారం చెల్లింపునకు ఇతర బీమాలతో సంబంధంలేదని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది.

ఇద్దరు అదనపు ఎస్పీలు బదిలీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో ఇద్దరు అదనపు ఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న అదనపు ఎస్పీ వీఎస్ఆర్ మూర్తిని రాజమహేంద్రవరం అర్బన్ అదనపు ఎస్పీగా నియమించారు. అలాగే ఏఆర్ అదనపు ఎస్పీ ఎం రాజశేఖర్‌ను విజయవాడలోని సీఎం సెక్యూరిటీ వింగ్ (సీఎస్‌డబ్ల్యు) అదనపు ఎస్పీగా నియమించారు.

ప్రజాపునాదిని విస్తరించాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్‌కారత్



విశాలాంధ్ర-భీమవరం : వామపక్ష, ప్రజాతంత్ర సంఘ టనే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజాపునాదిని విస్తరిం చాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్‌కారత్ పిలుపు నిచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మూడు రోజులుగా జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 25వ మహాసభల్లో సోమవారం ఆయన ప్రతినిధులను ఉద్దేశించి దిశానిర్దేశం చేశారు. ప్రత్యామ్నాయ రాజకీయాలను, విధా నాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రజాపునాదిని విస్తరించడం ఒక్కటే మార్గమని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి కృషే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన బలపడటానికి దోహదం పడు తుందని ఆయన గుర్తు చేశారు. అనేక రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వామపక్ష ఉద్యమానికి ఘనమైన చరిత్ర ఉందని, ఆ వారసత్వం ప్రజల్లో స్ఫూర్తి నింపుతుందని ఆయన అన్నారు. ఆర్.ఎస్.ఎస్ కాషాయ భావాలకు ప్రజల్లో ఆదరణ లేదని, అయినా తమ ప్రాభవాన్ని పెంచుకోడానికి ఆర్.ఎస్.ఎస్ దాని అనుబంధ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ప్రజాతంత్ర ఉద్యమాల పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని కారత్ గుర్తు చేశారు. ఇది ప్రత్యామ్నాయ రాజకీయాలకు అనుకూల సమయమని అన్నారు. మూడేళ్లలో రాష్ట్రంలో చోటు చేసుకున్న వివిధ పోరాటా లను, ఉద్యమాలను ప్రస్తావించారు. వివిధ రంగా ల ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం శ్రేణులు చేస్తున్న పోరాటాలు ఉత్తేజకరంగా ఉన్నాయని అదే సమయంలో ప్రజలలో చైతన్యాన్ని పెంచడానికి కృషి చేయాల్సి ఉందని సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు ఈ తరహా కృషి చేయడానికి అనుకూలంగా ఉన్నాయని, దీనికి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పోరా టాల్లో కలిసి వస్తున్న ప్రజానీకానికి రాజకీయ విద్యను అందించడం ద్వారా వారిని చైతన్యవంతులను చేయాలని కారత్ సూచించారు. వివిధ స్థాయిల్లో పార్టీ కమిటీలలో యువతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.మధు, గఫూర్, హేమలత, వై.శ్రీనివాస రావు, వి.ఉమామహేశ్వరరావు, రమాదేవి, మొడియం బాబురావు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం

18న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం

- అన్ని పార్టీల ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆహ్వానం
- టీడీపీ, వైసీపీ ఎంపీలు ప్రధాని ఇంటి ఎదుట ధర్నా చేయాలి.
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన కోసం ఈ నెల 18న విజయవాడలో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు వెల్లడించారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ రౌండుటేబుల్ సమావేశానికి అన్ని పార్టీల ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు, ప్రజాసంఘాలు, వర్తక, వాణిజ్య, విద్యా, వ్యాపార సంఘాలకు ఆహ్వానాలు పంపుతున్నామని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అంశాలపై నాలుగేళ్ల నుంచి బీజేపీ ఆడుతున్న నాటకాలు చివరి అంకానికి చేరుకున్నాయని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం దొరలపాలనలతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ హరిబాబు ఇటీవల విడుదల చేసిన 27 పేజీలలో ప్రజలకు ఉపయోగపడిం దేమిటని ప్రశ్నిం చారు. మోడీ, చంద్రబాబు మోసపూరిత హామీలతో రాష్ట్రానికి హోదాగానీ, ప్యాకేజీ గానీ రాకుండా పోయాయని, 5 కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మంట కలిపారని మండిపడ్డారు. రాష్ట్రానికి రైల్వేజోన్ అంశం పది రోజుల్లో తేలుతుందని, కడప స్టీల్ ఫ్యాక్టరీ అంశంపైనా కదలిక వస్తుందని పాలక పార్టీ ఎంపీలు లీకులిస్తున్నారని పేర్కొన్నారు. హరిబాబుకు నిజాయితీ వుంటే కేంద్ర, రాష్ట్రాలలోని మంత్రి పదవుల్ని వదులుకుని ఏపీకి ప్రత్యేక హోదా కోసం ప్రజాక్షేత్రంలోకి రావాలని సూచించారు. టీడీపీ నిజమైన పోరాటం చేస్తే కేంద్రంలోని మంత్రి పదవులను వదులుకోవాలని డిమాండు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై మార్చి 5లోగా స్పష్టమైన ప్రకటన వచ్చేలా కేంద్రంపై అన్ని పార్టీల ఎంపీలు ఒత్తిడి తేవాలని కోరారు. లేకుంటే ఢిల్లీలోని ప్రధాని మోడీ ఇంటి ముందు టీడీపీ, వైసీపీ ఎంపీలు ధర్నా చేయాలని డిమాండు చేశారు.

96 మంది అగ్రిబాధితులకు ఎక్స్‌గ్రేషియా విడుదల చేస్తూ జీవో

అగ్రిగోల్డ్ బాధితులు 96 మందికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తూ జీఓ నంబరు 19 (తేదీ-12-2-2018)ని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిందని ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు చెప్పారు. విజయవాడ దాసరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు చెప్పినా.. మూడురోజుల క్రితం విడుదల కావాల్సిన ఈ జీవో విడుదలలో రాష్ట్ర హోంశాఖ అధికారులు అశ్రద్ధ చేశారని చెప్పారు. ఈ జీవో ఆధారంగా 96 మంది అగ్రిగోల్డ్ బాధితులకు సీఐడీ అధికారులు సమాచారం అందించ నున్నారని పేర్కొన్నారు. బాధితులకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేసే తేదీని ఒకటి లేదా రెండు రోజుల్లో ప్రకటిస్తారని చెప్పారు. అగ్రిగోల్డ్ కంపెనీ మోసాలకు బలై, మానసిక ఒత్తిడితోను, గుండెనొప్పితోను, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుని చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు జీవోలో పొందుపరిచారని వివరించారు. పోలీసుల విచారణలో అగ్రిగోల్డ్ బాధితుల కారణంగా చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా వర్తిస్తుందని స్పష్టం చేశారన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు రూ.4 వేల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండు చేస్తూ ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రచార సభలు, 19, 20, 21 తేదీల్లో రెవెన్యూ కార్యాలయాల ఎదుట అగ్రిగోల్డ్ బాధితులు రిలే దీక్షలు నిర్వహించనున్నారని చెప్పారు. బాధితులు ప్రతి ఒక్కరికీ చివరి రూపాయి వచ్చే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు రాంబాబు, మురళీకృష్ణ, సీపీఐ కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



కార్మిక సమస్యలు పట్టని పాలకులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఓబులేసు

విశాలాంధ్ర-చీరాల: కేంద్ర, రాష్ట్రాలలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కార్మిక సమస్యలను పట్టించుకోవడంలేదని, ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు కార్పొరేట్ల సేవలో తరిస్తున్నాయి తప్ప కార్మికుల ప్రయోజనాల గురించి ఏ మాత్రం ఆలోచించడంలేదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 47 కోట్ల మంది అసంఘటిత కార్మికుల కోసం ఒక్కపైసా కూడా కేటాయించకపోవడం కార్మికవర్గంపై ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు అద్దంపడుతోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభలు సోమవారం ప్రకాశం జిల్లా చీరాలలో జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఓబులేసు మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను కాలరాసేందుకు ప్రస్తుత పాలకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కార్మికవర్గం సంఘటితంగా పోరాడాలని అన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 18,000 చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. జీఓ 279 కార్మికులకు మరణశాసనం వంటిదని, దానిని రద్దుచేసేందుకు పోరాడాల్సిన అవసరం వుందని ఓబులేసు చెప్పారు.

రానున్నది పోరాటాల కాలమని చెప్పారు. పోరాట రూపాలు మార్చుకోవాలని సూచించారు. ఐక్య, సంఘటిత పోరాటాల నిర్మాణాలపై దృష్టి సారించకుంటే సమస్యలను పరిష్కరించుకోలేమని ఓబులేసు అన్నారు. యూనియన్ అధ్యక్షులు బి.తులసేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే చీరాల కేంద్రంగా సాగిన పోరాటంలో కార్మికులకు నూనె, చెప్పులు సాధించామన్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలు అవసరమన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆసుల రంగనాయకులు కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. యూనియన్ సలహాదారు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ రెండు సంవత్సలకు ఒకసారి జీతాలు తీసుకునే స్థితి నుంచి నేడు నెలనెలా జీతాలు తీసుకునే స్థితికి చేరుకోవడం యూనియన్ పోరాటాల ఫలితమేనన్నారు. యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బందెల రవికుమార్ సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. మహాసభ సందర్భంగా ఏఐటీయూసీ స్థానిక సీనియర్ నాయకులను సన్మానించారు.



భారీ ర్యాలీ :మహాసభ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ భవనం నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ర్యాలీ గోపాలకృష్ణయ్యపార్కు, గడియారం స్తంభం, కూరగాయల మార్కెట్, బాలికల ఉన్నత పాఠశాల, ముంతావారి సెంటర్, మున్సిపల్ కార్యాలయం మీదగా సాగి తిరిగి అంబేద్కర్ భవనం చేరుకుంది. మార్గమధ్యలో పూలే విగ్రహానికి ఓబులేసు, రవీంద్రనాథ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కొత్త కమిటీ ఎన్నిక : మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నది. యూనియన్ గౌరవ సలహాదారుగా నెక్కంటి సుబ్బారావు, గౌరవ అధ్యక్షులుగా బి.తులసేంద్ర, అధ్యక్షులుగా కిర్ల కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా ఆసుల రంగనాయకులు, ఎం.డీ.సర్దార్, మాల్యాద్రి, ముత్యాల వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస్, జె.రామచంద్రయ్య, కోటదాసు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.సుబ్బారాయుడు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా బందేల రవి(గుంటూరు), కమిటీ సభ్యులుగా చంద్రదాస్ (తూర్పుగోదావరి), కె.సత్యనారాయణ, బోస్(నెల్లూరు), మద్దిలేటి (కర్నూలు), వాసు (పశ్చిమ గోదావరి), బొబ్బిలి సత్యనారాయణ(కాకినాడ), వేలు(శ్రీకాకుళం), రమేష్ (విజయనగరం), గోపి (చిత్తూరు) లను ఎన్నుకున్నారు.

సంపాదకీయం

వెనుకటికి ఎవరో ఒకతను "పిచ్చి కుదిరింది. తలకు రోకలిచుట్టు" మన్నాడట. అలా వుంది ఆదివారం ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ చెప్పడం. ఇప్పటి వరకు విద్యావేత్తలను, మేధావులను, శాస్త్రవేత్తలను, రచయితలు, కవులు, కళాకారులను అవమానించిన, వేధింపులకు గురిచేసిన ఆరెస్సెస్, సంఘ్‌పరివార్ అనుబంధ శిబిరాలు, భారతీయ జనతాపార్టీ ఇప్పుడు భారత సైన్యాన్ని కూడా అవమానపరిచే దుస్సాహసానికి బరితెగించాయి. భారతీయ సైన్యం చేయగలిగిన దానికన్నా మించి వేగంగా యుద్ధంలో పోరాడేందుకు ఆరెస్సెస్ దాని కార్యకర్తలను సమాయత్త పరచగలదని భగవత్ ఆదివారం అనడమే ఇందుకు నిదర్శనంగా భావించాలి. అన్ని వ్యవస్థలను సంఘ్‌పరి వారీయులతో నింపిన ఆరెస్సెస్ కనుసన్నల్లో పాలన సాగిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం సైన్యాన్ని కూడా తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలని దుష్టచింతన చేస్తోన్నదని శంకించక తప్పదు. భారత సైన్యం శక్తిసామర్థ్యాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలను భగవత్ స్పృహలో లేక చేశారా లేక నిజంగా ఆయన అన్న మాటలను విశ్వసించే చేశారా అన్నది ప్రశ్న. ఏది ఏమైనా, భారతీయ సైన్యం ఆరెస్సెస్ వద్ద శిక్షణ పొందాలన్న భావన అందుల్లో ధ్వనించేదిగా వున్నందున అత్యంత ప్రమాదకరం.. నియంతృత్వ ధోరణి దిశగా సంకేతం. ఆదివారం బీహార్‌లో ఆరెస్సెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ యుద్ధంలో పోరాడటానికి సన్నద్ధం చేయడానికి భారత సైన్యానికైతే 6-7 నెలలు పడుతుందని, ఆరెస్సెస్‌కైతే మూడ్రోజులు చాలని, అది తమ సామర్థ్యమని చెప్పుకున్నారు. భగవత్ వ్యాఖ్యలు రాజ్యాంగ ఔచిత్యానికే వ్యతిరేకం. దేశ సంరక్షణ కోసం ప్రాణాలర్పించిన, అర్పించడానికి ఎల్లప్పుడు సిద్ధంగా వుండే మన వీరజవానులను అవమానించేవి మాత్రమే కాదు, ప్రతి భారతీయ పౌరుడిని అవమానించే విధంగా వున్నాయి. భారత జాతీయ పతాకాన్ని కూడా అవమానించినట్టే. ఎందుకంటే భారత వీర జవానులు జాతీయ పతాకానికి అభివాదం చేస్తారు గనుక. భారత సైన్యాన్ని కించపరిచే భగవత్ వ్యాఖ్యలపై తన ప్రభుత్వ వైఖరిని ప్రధాని నరేంద్ర మోడీ వివరించాలి. భగవత్ వ్యాఖ్యలు ప్రస్తుతం సైన్యానికి వున్న అధికారాలను, ఉండబోయే అధికారాలను ధిక్కరించేవిగా వున్నాయన్నది నిర్వివాదం. సోఫియాన్ కాల్పుల సంఘటనలపై మేజర్ ఆదిత్యపై ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను ఉపసంహరించాలన్న సైన్యం డిమాండును ఆమోదించకుండా సోమవారం సర్వోన్నత న్యాయస్థానం సైతం నిలిపివేసింది. మేజర్ ఆదిత్య పైన ఎట్టి బలవంతపు చర్య తీసుకోవద్దని మాత్రమే "సుప్రీం" రూలింగ్ ఇచ్చింది. ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోమని జమ్మూ-కాశ్మీర్ పోలీసులను సుప్రీం ఆదేశించలేదు. దేశం యుద్ధ పరిస్థితిని ఎదుర్కొన్నట్లయితే, రాజ్యాంగం అనుమతిస్తే స్వయం సేవకులు అగ్రభాగన నిలవడానికి సిద్ధంగా వుంటారని కూడా భగవత్ పేర్కొన్నారు. అంటే భగవత్ ఏమి కోరుకొంటున్నారు... రాజ్యాంగాన్ని సవరించాలనా? బీహార్‌లో పర్యటించడం ద్వారా ఆ రాష్ట్ర ప్రజలకు ఏమి బోధించదలిచారు? "ఆరెస్సెస్ శాఖలో" లాఠీలు తిప్పడం

ఇది భారత సైన్యాన్ని అవమానించడమే !

"సైనిక శిక్షణ"ను పోలి వున్నదని అది భావించినప్పటికీ, ఆరెస్సెస్ "సామాజిక-సాంస్కృతిక సంస్థ" అని అది గతంలో చెప్పుకొంది. కానీ ఆ తరువాత ఆరెస్సెస్ "పరివార్ సంస్థ" అని భగవత్ పేర్కొన్నారు. అయితే నష్టం జరిగిపోయింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో చావు తప్పి కన్ను లొట్ట పోయినట్లు బయపడిన తరువాత పార్టీ వెనుకపట్టు పట్టిందన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలపై బీజేపీ చిర్రుబుర్రులాడటం విచిత్రంగా వుంది. రాజస్థాన్ ఉప ఎన్నికల్లో బీజేపీ పరాజయంతో రెండవసారి మోడీ ప్రధాని అవుతారా లేదో అన్న సందేహాలతో ఆరెస్సెస్ బీజేపీకి గడ్డు పరిస్థితులను కలిపిస్తోంది. సైన్యాన్ని అవమానపరిచినట్లు వ్యాఖ్యలు చేసినట్లు నిందించబడిన సందీప్ దీక్షిత్, సంజయ్ నిరుపమ్ వంటి కాంగ్రెస్ నాయకులు మాట్లాడినట్లే భగవత్ కూడా మాట్లాడితే ఇక వారికి, వీరికి మధ్య తేడా ఏముంది.

సుశిక్షితులైన, సత్తాగల భారత సైన్యంతో తన ఖాకీదళాన్ని భగవత్ పోల్చడం సైన్యాన్ని అవమానించడంగాక వేరు కాదు. నోరుముయ్యమని భగవత్‌ను రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ అడగాలి. కానీ అలా జరగదు. ఎందుకంటే ఆరెస్సెస్ కనుసన్నల్లోనే మోడీ ప్రభుత్వం పనిచేస్తున్నది గనుక. భారతసైన్యం ఆరెస్సెస్ నిక్కరువాలాల లాంటిది కాదు. సైన్యానికన్నా ఆరెస్సెస్ మరింత శక్తి, సామర్థ్యాలు గలదని చెప్పడం ద్వారా భగవత్ సైన్యాన్ని కించపరిచారు. భగవత్ వ్యాఖ్యలు సైన్యానికి 'అవమానం' అందుకు ఆయన క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండు చేశారు. అందుకు ఆయన్ని సమర్థించాల్సిందే. అయితే, అదే సమయంలో భారత సైన్యానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని ఆపాలని దీక్షిత్, నిరుపమ్‌లకు ఆయన ఆదేశాలు జారీ చేయాలి. డొక్లామ్ సమస్యను రాజకీయం చేయడాన్ని కాంగ్రెస్ మానుకోవాలి. భగవత్ వంటి వారి ప్రకటనలతో భారత్ సైన్యానికి జరిగిన నష్ట నివారణకు ప్రధానమంత్రి, రక్షణ మంత్రులు దృష్టి సారించి సైన్యం ప్రతిష్టను పెంచే విధంగా చర్య తీసుకోవలసిన అవసరం వుంది. ఏది ఏమైనా జమ్మూ-కాశ్మీర్‌లో అధికారాన్ని నిలబెట్టుకోడానికి మెహబూబా ముఫ్తీ పార్టీ పీడీపీ ఎంఎల్‌ఏలతో అంటకాగాలని కోరుకుంటున్న బీజేపీ సైన్యం పక్షాన నిలబడటానికి ఇష్టపడుతున్నట్లు కనిపించడం లేదు. శత్రుసైన్యాన్ని ఎదుర్కోవాలంటే వారివద్ద వున్న ఆయుధాల కన్నా ఆధునికమైన ఆయుధాలు కలిగివుండాలి. మోహన్ భగవత్ వ్యాఖ్యలను బట్టి చూస్తే, సామాజిక-సాంస్కృతిక సంస్థగా చెప్పుకునే ఆరెస్సెస్ కార్యకర్తలు ఆధునిక ఆయుధాలు కలిగివున్నట్లు అర్థమవుతోంది. ఇది భారత లౌకిక రాజ్యాంగానికి దళిత, ముస్లిం మైనారిటీ వర్గాలకు అత్యంత ప్రమాదకరం. భారతసైన్యంపై భగవత్ వ్యాఖ్యలను "సుప్రీం కోర్టు" సూమోటోగా స్వీకరించి, క్షుణ్ణమైన విచారణ జరిపించి లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను పరిరక్షించవలసిన అవసరం ఎంతైనా వుంది. అందుకు దేశంలోని వామపక్ష, లౌకికవాదులు, మేధావులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

చురక

నేటి తరం రాజకీయ
నేతల్లో రాజనీతి
కాగడేసి గాలించిన
కనిపించదు దాని ఖ్యాతి

విమర్శల్లో విలువలేని
వింతకథల పురాణం
పరస్పరం తిట్లతోని
పరువు పోయే ప్రయాణం

– వేల్పుల నారాయణ

విశ్లేషణ

వామపక్షాలనైనా పవన్ ఆదర్శంగా తీసుకోలేరా?


వి. శంకరయ్య

ఏ వ్యవస్థలోగానీ ప్రజలు ఇక బతకలేమని భావించినపుడు విప్లవాలు తప్పవని మార్క్సిస్టు పండితులు చెబుతారు. అదేవిధంగా కేంద్ర నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రంలో వామపక్షాలు బంద్‌కు పిలుపు ఇవ్వగా తుదకు అధికార తెలుగుదేశం పార్టీ కూడా పరోక్షంగా పాల్గొనక తప్పింది కాదు. పరిస్థితులు పనకూడినప్పుడు ఏదైనా సాధ్యమే. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా అందరూ తిరగబడ్డారు. వామపక్షాలను అభిమానిస్తానని తరచూ చెప్పే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దారితప్పిన బాటసారిగా మిగిలిపోతున్నారు. ప్రస్తుతం ఒక గూటి పక్షులు ఒకేచోట చేరుతాయనే సామెత అమలు చేస్తున్నారు. జయప్రకాష్ నారాయణ, అరుణ్ కుమార్‌లను పవన్ కళ్యాణ్ కలుసుకోవడం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం ఇందుకు తార్కాణంగా వుంది. పైగా ఏపీ ప్రజలపక్షం కాకుండా న్యాయమూర్తి అవతార మెత్తడం తాజా పరిణామం. అలా కాకుండా రాష్ట్ర ప్రజల క్షేమం పవన్ కళ్యాణ్ కోరుకున్నట్లయితే ఒక పిలుపు ఇచ్చి సమావేశం ఏర్పాటు చేసివుంటే రాష్ట్రంలోని అన్ని పార్టీలు గ్రూపులు వ్యక్తులు పాల్గొని వుండేవారు. ఒక సమైఖ్య వేదికకు పునాది పడివుండేది. పవన్ కళ్యాణ్ మరోదారి ఎన్నుకున్నారు. అందుకే పాతికేళ్లకు జయప్రకాష్ నారాయణ చతికిలబడితే పవన్ కళ్యాణ్ నాలుగేళ్లకే పునరాలోచనలో పడ్డారు. పైగా తరచూ తనకు రాజకీయాలు అవసరం లేదని ప్రజాసేవే ముఖ్యమని చెబుతుంటారు.

పవన్ కళ్యాణ్‌లో ఆదర్శవాదం పాలు ఎక్కువ. ఆగ్రహావేశాలు వున్నాయి. ఇవి రెండు రాజకీయ నేతలకు బద్ధ శత్రువులు. సభల సందర్భంగా అభిమానులు సినిమా గ్లామర్‌తో కేరింతలు కొడుతూ వుండగా పవన్ కళ్యాణ్ లేనిపోని ఆవేశం తెచ్చుకొని పూనకం వచ్చినట్లు ప్రవర్తిస్తారు. తన ప్రసంగం ద్వారా సభికులను ఆవేశపరచవలసి వుండగా తనే ఆవేశపడి ఆపసోపాలు పడతారు. సర్కస్‌లో బఫూన్ నవ్వడు. కానీ ప్రేక్షకులు పగలపడి నవ్వేటట్లు చేస్తాడు. రాజకీయ నేతలు కూడా ఇలాగే వుండాలి. అప్పుడే తన ప్రసంగాలతో సభికులను స్పందింపజేసే అవకాశం వుంటుంది. ఇటీవల కాలంలో ఎన్టీఆర్ కన్నా ప్రజల్ని స్పందించగలిగిన నేత మరొకరు లేరు. ప్రజాభిప్రాయాన్ని మలుచుకోవడంలో ఆయనకు ఆయనేసాటి. కానీ పవన్ కళ్యాణ్ ప్రజలు రెచ్చిపోక ముందే తను ఆగ్రహం తెచ్చుకుంటారు. అందులో కూడా స్పష్టత సమన్వయం లేనందున సినిమా అభిమానుల కేరింతలే మిగులుతున్నాయి. వాస్తవం చెప్పాలంటే ఇదే ధోరణి జనసేన పార్టీ నిర్వహణలో కూడా ప్రతిఫలిస్తోంది.

తిరుపతి సభలో బీజేపీతో తెగతెంపులు చేసుకున్నట్లు ప్రకటించారు. అనంతపురం సభలో ఆత్మగౌరవం నినాదం తెచ్చారు. ప్రత్యేకహోదా కోసం రాజీలేని పోరాటం చేస్తానన్నారు. తర్వాత ఏమైంది? పార్లమెంట్ సభ్యులు సరిగా పనిచేయడం లేదని వారు వ్యాపారాల్లోనే నిమగ్నమై వున్నారని తొలిరోజుల్లో విమర్శలు గుప్పించారు. అసలు వదలి కొసరుపై పడ్డారని ఆ రోజుల్లోనే విమర్శలొచ్చాయి. ఈ రోజు ఏమైంది? గల్లా జయదేవ్ రాజకీయ వేత్తకన్నా పారిశ్రామికవేత్తగా సుపరిచితులు. కానీ చిరకాలంగా రాజకీయాల్లో వున్న ఫక్తు రాజకీయ నాయకులకన్నా మిన్నగా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎందుకిలా జరిగింది? ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ప్రాంతీయ పార్టీనేతగా అనుమతి ఇచ్చిన తదుపరి గల్లా జయదేవ్ గళం విప్పారు. తొలి నుండి కూడా ముఖ్యమంత్రి తాళం చెవి తన దగ్గర పెట్టుకున్నందున పార్లమెంట్ సభ్యులు నోళ్లువిప్పలేకపోయారనే విషయ పరిజ్ఞానం పవన్‌కు తెలియదని భావించలేం. మరి ఇన్నాళ్లు పవన్ ఎందుకు దాగుడు మూతలాడినట్లు? ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యంపై విమర్శలు చేస్తే ప్రజలు నమ్ముతారా? మూడున్నరేళ్లు మిన్నకుండి ఇప్పుడు నిద్రమేలుకున్న టీడీపీ నేతలు కేంద్రాన్ని విమర్శించినట్లే పవన్ కళ్యాణ్ విమర్శలు కూడా అదే విధంగా మిగిలిపోయే అవకాశముంది. రాజధాని శంఖుస్థాపన సందర్భంగా పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు ప్రధాని ఇచ్చివెళితే ఇదే గల్లా జయదేవ్ నిరసన తెలిపారు. ఈ నిరసనపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్న అంశం పవన్ కళ్యాణ్‌కు తెలియకపోలేదు. పోనీ ముఖ్యమంత్రిని నేరుగా అటాక్ చేయలేక ఎంపీలను విమర్శించారనేందుకు ఆస్కారం లేదు. ఆనాడే పవన్ వైఖరిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎందుకంటే తదుపరి ముఖ్యమంత్రిని కలుసుకోవడమే కాకుండా ఏకాంత చర్చలు కూడా జరిపారు. ఇటీవల మరో ఆణిముత్యం పవన్‌నోట వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం యెడల విశ్వాసం సడలుతోందని ప్రకటించారు. అంటే ఇంకా తెలుగుదేశం ప్రభుత్వం యెడల మరులుపోలేదని భావించాలి. బీజేపీతో తెగతెంపులు చేసుకున్నట్లు గతంలో ప్రకటించిన పవన్ తాజాగా కేంద్రం చెప్పే గణాంకాలపై కూడా ఏదో నమ్మకముండబట్టే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలు ఇస్తే నిజం తేలుస్తానంటున్నారు. ఒక విధంగా బీజేపీపై కూడా మరులుపోయినట్లు లేదు. కేంద్రం కొన్ని గణాంకాలు ఇస్తోంది. రాష్ట్రం అందుకు విరుద్ధంగా లెక్కలు ఇస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ తమను మోసం చేస్తున్నాయని రాష్ట్ర ప్రజలు ఆగ్రహావేశాలతో వున్న సమయంలో పవన్ కళ్యాణ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంచాయితీ పెట్టడంతో ప్రజల ఆందోళనను పక్కదారి పట్టిస్తాడనే అనుమానాలు లేకపోలేదు. లేదా వీరిద్దరిలో ఎవరినో ఒకరిని ప్రజల ఆగ్రహం నుండి బయటపడేసేందుకు ప్రస్తుతం నూతన అవతారమెత్తినట్లు భావించేందుకు ఆస్కారం లేకపోలేదు. నిజంగానే పవన్ ప్రజల పక్షం వహించదలచివుంటే తిరుపతి అనంతపురం బహిరంగసభల్లో ప్రత్యేకహోదాపై మడమ తిప్పని పోరాటం చేస్తానని చెప్పి తప్పుకునేవారు కాదు. లేదా ప్రత్యేక హోదా సాధించలేని ముఖ్యమంత్రి అసమర్థ వైఖరినైనా ఎండగట్టేవారు. ప్రస్తుతం పవన్ ఎన్నుకున్నదారి చిత్రవిచిత్రంగా వుంది. త్వరలోనే ఎన్నికలు రానున్నాయి. ఇంతకు ముందే ఎన్నికల్లో జనసేన పోటీ చేస్తుందని ప్రకటించి వున్నారు. రేపు పవన్ కళ్యాణ్ టీడీపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. లేక 2009లో రాజశేఖర్ రెడ్డి గెలుపునకు ప్రజారాజ్యం పార్టీ పరోక్షంగా



సహకరించినట్లు 2019లో తెలుగుదేశం గెలుపుకు కలిసి పోటీ చేసినా, స్వతంత్రంగా పోటీ చేసినా అపప్రద మూటగట్టుకోవచ్చు. లేదా ప్రస్తుతం కేంద్రం చెప్పే లెక్కలు సరైనవని తేలితే బీజేపీతో తిరిగి చెలిమి చేయవచ్చు. ఎందుకంటే ఈ మూడున్నరేళ్ల కాలంలో పవన్ కళ్యాణ్ మాటలకు చేతలకు సంబంధం కనిపించడం లేదు. ఒకరాజకీయపార్టీ నేతగా ఎందరో మేధావులతో చర్చలు జరుపుతున్నామని చెప్పే పవన్ ప్రస్తుతం అరచేతిని చూచేందుకు అద్దం వెతుకుతున్నారంటే ఏమని భావించాలి? రాష్ట్రం వివిధ సమస్యలతో తగలబడిపోతోంది. కనీసం పౌరహక్కులు హరింఎబడుతున్నాయి. దళితులపై దాడులు ఉధృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మూడున్నరేళ్లు మిన్నకుండి ఇప్పుడు కేవలం కేంద్రం నుండి వచ్చే నిధులపైననే రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరు. అయితే ఇది సమస్య కాదు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం బీజేపీల గెలుపునకు కృషి చేసిన పవన్ కళ్యాణ్ నేటి పరిస్థితుల్లో ప్రజల అసంతృప్తికి జవాబు చెప్పుకోవాల్సి వుంటుంది.

2014 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా మోడీ ఏపీలో పలు బహిరంగ సభల్లో పాల్గొన్న సందర్భంలో ప్రత్యేకహోదాతోపాటు హామీలు గుప్పించారు. ఆ సభావేదికలపై పవన్ కూడా వున్నారు. బీజేపీ, టీడీపీ అభ్యర్థులను గెలిపించమని కోరారు. నాలుగేళ్లు అయినా కేంద్రం నుండి ఏపీ ప్రజలకు చిప్పే మిగిలింది. పవన్ మాత్రం రెండు మూడు బహిరంగ సభలు పెట్టి తీరిక వున్నప్పుడు రెండు రోజులు పర్యటించి తిరిగి హైదరాబాద్‌కు చెక్కేస్తున్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లుండి సాచివేత వైఖరితోపాటు పైగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు సక్రమంగా అమలు జరగకపోగా ఆగ్రహంతో వున్న ప్రజలకు ఈనాడు పవన్ ఏమని సమాధానం చెబుతారు. కాకుంటే సమస్యలను జటిలం చేయడం తన ఉద్దేశం కాదని ఆదర్శవాదం చెబుతారు. రాష్ట్రంలో నిర్మింపబడే ప్రాజెక్టుల్లో లక్షలాది మంది నిర్వాసితులగోడు వర్ణనాతీతం. కనీసం తనను కలిసిన కొంతమందికైనా జరిగిన న్యాయమేమిటి? 2019 ఎన్నికలు పక్కనబెట్టినా రేవు జేఏసీ తరవున ప్రజల్లోకి వెళ్లినప్పుడు ఈ శేష ప్రశ్నలకు పవన్ జవాబు చెప్పాల్సి వుంది. తాజా పరిణామమేమంటే పవన్ గతంలో తను డిమాండు చేసినట్లు ప్రత్యేక హోదా కోసం పోరాటం చేయనున్నట్లు ప్రకటించలేదు. విభజన సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆనాడు ఈ హామీలకు మద్దతు పలికి అధికారంలోని వచ్చిన బీజేపీని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు ప్రకటించలేదు. కేవలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంచాయితీ చేసేందుకే సిద్ధమైనారు. తన పంచాయితీ తర్వాత కార్యాచరణ ప్రకటిస్తానని చెబుతున్నారు. ఈ సందర్భంలో పవన్ కళ్యాణ్ రెండు అంశాలను పరిశీలించవల్సి వుంది. 2014లో కేంద్ర రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పడిన తదుపరి చట్టబద్ధంగా రాష్ట్రంలోని వెనుకబడిన 7 జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించబడింది. తొలిరోజుల్లోనే 24 వేల కోట్ల రూపాయలు 5 సంవత్సరాలకు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపింది. కేంద్రం కేవలం 1050 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఈ మూడుళ్ల రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కేంద్రాన్ని కోరిన జాడ లేదు. ఒకవేళ ఈ బడ్జెట్‌లో కేంద్రం 20 వేల కోట్ల రూపాయలు ఇస్తే ఒక్క సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయగలదా? అంతేకాదు రాజధాని నిర్మాణానికి 42 వేల కోట్ల రూపాయలు అవసరమని కేంద్రాన్ని కోరినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ టీడీపీ నేతలు కోరినట్లే కేంద్రం 40 వేల కోట్లు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసే స్థితిలో ఉందా? వాస్తవం చెప్పాలంటే ఇంత భారీస్థాయిలో కేంద్రం నిధులు ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వమూ ఖర్చు చేయలేదు. ఇద్దరూ నాటకాలాడుతున్నారు. ఇదంతా కూడా క్రమపద్ధతిలో తొలినుండి నిధులు పొంది ఖర్చు చేయాల్సి ఉండేది. కారణం ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లు నిద్రపోయింది. కేంద్రం మొండిచేయి చూపింది. ఈ స్థితిలో పవన్‌కళ్యాణ్ పంచాయితీ చేసి ఏమి సాధిస్తారో ఆయనకు సలహాలిస్తున్న మేధావులైన వారు రాష్ట్ర ప్రజలకు వివరిస్తే సంతోషిస్తారు.

ఆమాటకొస్తే పవన్‌కళ్యాణ్ ఫక్తు కన్‌ఫ్యూజన్ మాస్టర్. అనంతపురం బహిరంగ సభలో ఆత్మగౌరవం నినాదం తెచ్చారు. ప్రస్తుతం అదేమైందో తెలియదు. అంతేకాదు వామపక్షాలు తనకు ఆదర్శమన్నారు. తరిమెల నాగిరెడ్డిని పొగడ్తలతో ముంచెత్తారు. విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశంలో వామపక్షాలతో కలిసి సమస్యలపై పోరాడతానని బహిరంగ ప్రకటన చేశారు. తదుపరి ఏమైంది? ఆ ఊసే ఎత్తలేదు. వామపక్షాల సంగతి దేవుడెరుగు. రోజూ తుపాకి తూటా దెబ్బకు నేలకూలే పక్షుల్లాగా అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా ఒక బాధితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వారికి బాసటగా నిలుస్తానని ప్రతిజ్ఞ చేసిన పవన్‌కళ్యాణ్ చేసిందేమీలేదు. ఇలా చెప్పుకుపోతే తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో ఎంతోమంది బాధితులుగా మిగిలి పవన్‌ను ఆశ్రయిస్తే ఈ రోజుకి వారికి కలిగిన సాయం కించిత్తులేదు. ఆమధ్య అనంతపురం జిల్లా పర్యటించారు. దత్తత తీసుకుంటానని ప్రకటించారు. నేడు రాయలసీమలోని అన్ని జిల్లాలో గతంలో జరిగిన శ్రీబాగ్ ఒడంబడికను యువత బయటకు తీసుకువస్తున్నారు. రాజధాని సర్కార్ జిల్లాలో నెలకొల్పినా, హైకోర్టునైనా రాయలసీమలో నెలకొల్పాలని ఉద్యమాలు సాగిస్తున్నారు. ప్రాంతీయ అసమానతలు నెలకొనకుండా చూడాలని ఆందోళనలు సాగుతున్నాయి. రాయలసీమ గురించి పదేపదే ప్రస్తావించే పవన్ ఈ అంశంపై ఇంతవరకు నోరు విప్పలేదు. ఆదర్శవాదిగా నైనా కరువువాత పడిన అనంతపురం జిల్లాలో ఆడబడుచులు అమ్ముడుపోతున్న దురాగతాన్నైనా నిలువరించే ప్రయత్నం చేయలేదు. ఈ అంశంపై ఇటీవల బీబీసీ ప్రసారం చేసిన ఒక కథనం హృదయవిదారకంగా ఉంది. ఈ కథనం సమాచార మాధ్యమాల్లో చూసినవారు కంటతడిపెట్టక మానరు. కనీస వైద్య, విద్య సౌకర్యాలు లేకుండా కుమిలిపోతున్న ప్రజలు లక్షలాదిగా ఉండగా ఇవేవి పట్టని ముఖ్యమంత్రి అమరావతిలో ఒలింపిక్ క్రీడలను నిర్వహిస్తానని చేసిన ప్రకటన దివాళా తీసినట్లు చెబుతున్న రాష్ట్రానికి అవసరమా? ముఖ్యమంత్రి ప్రచారార్భాటం సీమజిల్లా ప్రజలకు తుపాకీ తూటాలాగా తగులుతోంది. కానీ ప్రశ్నించడమే లక్ష్యంగా పెట్టుకున్న పవన్ కళ్యాణ్ నోట మాట రాలేదు. ఫలితంగా ప్రజల నుండి ఎదురయ్యే ప్రశ్నలకే పవన్ కళ్యాణ్ జవాబు చెప్పవలసి ఉంటుంది.

వాస్తవంగా పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయదలచి ఉంటే ఒక పిలుపు ఇచ్చి సమావేశం ఏర్పాటు చేసి ఉంటే రాష్ట్రంలోని రాజకీయ నేతలు గ్రూపులు, వ్యక్తులు హాజరై తమ సంఘీభావం తెలిపేవారు. అట్టి సమావేశానికి రాలేని రాజకీయ పార్టీల రెండు పడవల ప్రయాణం ప్రజల ముందు బహిర్గత మయ్యేది. ఒక విధంగా పవన్ కళ్యాణ్ రెండు పడవలపై ప్రయాణిస్తున్నారా అని ఆయన చేపట్టిన విధానం ద్వారా అనుమానించాల్సి వస్తోంది. రెండు వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు తుదకు టీడీపీ కూడా పరోక్షంగా సహకరించాల్సిన అవసరం ఏర్పడింది. సమస్య తీవ్రత అటువంటిది. వామపక్షాలు నిర్వహించిన ఈ కర్తవ్యం పవన్ కళ్యాణ్ ఎందుకు చేయలేకపోయారు? తను ప్రజల్లోకి వస్తే ఏదో అయిపోతుందని చెబుతారు. ఎన్టీఆర్ కన్నా గ్లామర్ ఉన్నవారు మరొకరులేదు. అనుసరించే పద్ధతి ఎంత ఉన్నతమైనదైతే ఎంత గ్లామర్ ఉన్నా ఏమీకాదు. ప్రజలే ఏమీ జరగకుండా చూసుకుంటారు. ఒకవైపు రాష్ట్రంలో ప్రజలు అట్టుడికినట్లు ఆగ్రహంతో ఉన్నారు. గురువారం నాడు జరిగిన బంద్ ఇందుకు తార్కాణం. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం జయప్రకాష్ నారాయణ్ లాంటి వారినే కలవడానికి ఎందుకు సిద్ధమైనారు? వారికున్నంత ప్రజాబలం వామపక్షాలకు లేదని పవన్ భావిస్తున్నారా? తాను వామపక్షాలను అభిమానిస్తానని చెబుతున్న పవన్ కళ్యాణ్ ఒక్క పిలుపుతో బంద్ విజయవంతం చేసిన వామపక్ష నేతలను ఎందుకు కలుసుకోలేకపోయారు? తుదకు వామపక్షాల పిలుపునకు వైసీపీ కూడా మద్దతు పలికింది. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ వ్యవహార సరళి పలు శేషప్రశ్నలను తెరమీదకు తెస్తోంది. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీల కార్యకలాపాలకు, సేవా సంస్థల నిర్వహణ మధ్యగల సరళరేఖను గుర్తించగలిగితే దారీతెన్నూ లేకుండా నడిసంద్రంలో హోరుగాలిలో పడవ ప్రయాణంలా ఉన్న జనసేన పార్టీకి జవంజీవం కల్పించిన వారవుతారు.

వ్యాస రచయిత : విశ్రాంత పాత్రికేయుడు
సెల్ : 98483 94013

వి-మెయిల్

బాలల సంరక్షణ కమిటీలా?.. జన్మభూమి కమిటీలా?

బాలల న్యాయచట్టం 2015 ప్రకారం ప్రభుత్వం గత వారం 13 జిల్లాలకు బాలల సంరక్షణ కమి టీలను ప్రకటించింది. ఈ కమిటీలు స్వచ్ఛంద సేవా రంగంలో ముఖ్యంగా బాలలతో ఏడేళ్లపాటు పనిచేసిన అనుభవం ఉన్నవారిని, నేరారోపణ లేనివారికి, పిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించని వారికి ఉద్దేశించినవి. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధంలేని వారిని ఈ కమిటీలలో నియమించాలని జీఓ చెపుతోంది. కాని ప్రకటించిన కమిటీలలో పార్టీకి చెందిన వారిని, బాలలతో పనిచేసిన అనుభవం లేని వారిని నియమించి బాలల సంరక్షణను గాలికి వదిలేశారు. కొన్ని జిల్లాల్లో తీవ్ర నేరారోపణ ఉన్నవారికి ఈ కమిటీలో స్థానం కల్పించడం ఘోరం. ఈ కమిటీలు జిల్లా స్థాయిలో అనాధలు, నిరాదరణకు గురైన బాలలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు, నేరారోపణకు గురైన బాలలు తదితర అంశాలపై పనిచేయవలసి ఉంటుంది. కానీ ఏదో ఒక నామినేటేడ్ పదవిని 'కారు' వెనకాల తగిలించు కోవడానికి అలవాటుపడిన (అ)రాజకీయం ఈ బాలల కమిటీలను సైతం వదిలిపెట్టలేదు.

– బి.సాహితి, చైల్డ్ ఫోరమ్
విశాఖపట్నం

బిచ్చగాడి ఆత్మగౌరవం..!

బి.బాబు బహదూర్

బందరు మూడు స్తంబాల సెంటర్‌లో బెజవాడ నాన్‌స్టాప్ బస్సు ఆగింది. కండక్టర్ వచ్చాడు. టిక్కెట్... టిక్కెట్ అంటూ బ్యాక్‌సీట్‌ల వైపు వెళ్లాడు. ఈ లోపు టీతాగి దమ్ము కొట్టటానికి ఏడూళ్ల సూరిగాడు బస్సు దిగాడు. పక్కనే బడ్డీ కొట్టుకు వెళ్లాడు. టీగ్లాస్ తీసుకుని సిగరెట్టు వెలిగించాడు. ఇంతలో ఓ కుర్రోడు కుంటుకుంటూ బస్సు దగ్గరకు వచ్చాడు. డోర్ మీద దరువు వేస్తున్నాడు. పాపం పక్షవాతం కాబోలు. ఓ చెయ్యి పని చేయటం లేదు. నోటి నుంచి సొంగ కారుతోంది. అతడిని చూసే సరికి సూరిగాడి మనసు చివుక్కుమంది. ఎవ్వరూ అతడిని పట్టించుకోవటం లేదు. నెమ్మదిగా బిచ్చగాడి దగ్గరకు వెళ్లాడు. సూరిగాడిని గమనించి ఆశగా చెయ్యి చాపాడు. సూరిగాడు రూపాయి బిళ్ల ఇవ్వ బోయాడు. అంతే ఆ కుర్రోడు చెయ్యి దించేశాడు. సూరి గాడి వైపు "ఓరి పిచ్చోడా" అన్నట్టు చూశాడు. సూరిగాడికి అర్థం కాలేదు.

"పర్వాలేదు తీసుకో" అన్నాడు సూరిగాడు. భిక్షగాడు వెర్రిగా నవ్వి, మళ్లీ బస్సు డోరుపై దరువు మొదలెట్టాడు. సూరిగాడికి చిర్రెత్తింది.

"ఏరా రూపాయి చాలదా"? సూరిగాడు అడిగాడు.

"ఏహేనన్ను అడుక్కోనీ" అన్నట్టు భిక్షగాడు సీరియస్‌గా చూశాడు.

"ఒరేయ్ నీకు ఎంత కావాల్రా" ఇక సూరిగాడు తట్టుకోలేక పోయాడు. చొక్కా జేబులో నుంచి పది నోటు తీసి భిక్షగాడు చూపించాడు. సూరిగాడికి దిమ్మ తిరిగింది.

"ఓర్నీయవ్వ నీ రేటు పది రూపాయాలా, ఇంకా నయం వంద అడగలేదు? సూరిగాడు ఆశ్చర్యంగా అడిగాడు.

"ఊరకే దానం చేస్తున్నావా" భిక్షగాడు పెదవి విప్పాడు.

"కాదురా జాలి పడి" సూరిగాడు అన్నాడు.

"నీ జాలి నాకొద్దు. కాలు, చెయ్యి పని చేయక పోయినా ఇక్కడకొచ్చి అడుక్కుంటే... చింద రూపాయి ఇస్తారా" భిక్షగాడు చీదరించుకున్నాడు.

"ఒరే నాది చింద రూపాయా? పొద్దస్తమాను చెమటోడిస్తే ఐదొందలు కూలి వస్తోంది. అందులో పదులెక్కన ధానాధర్మం చేస్తే నాకేం మిగులుద్ది" సూరిగాడు కసిరాడు.

"అదే నేనంటున్నా.. ఒక్కో రూపాయి ఏరుకుంటే కనీసం వంద రూపాయలు కూడా రావు, నాకు ధర్మం చేస్తే నీకు పుణ్యం వస్తుంది. ఓ రూపాయి బిళ్ల నా మొహాన కొట్టి పుణ్యాత్ముడై పోదామనుకుంటే చెల్లద బ్బాయ్, ఇస్తే పదివ్వు. లేకపోతే తప్పుకో... వేరేవాళ్లని అడుక్కోవాలి" భిక్షగాడు అనేసరికి సూరిగాడు బిత్తర పోయాడు. ఇంతలో కండక్టర్ టిక్కెట్లు ఇచ్చేశాడు. డ్రైవరు బస్సు స్టార్ చేశాడు. సూరిగాడు బస్సెక్కాడు. భిక్షగాడు సూరిగాడినే సీరియస్‌గా చూస్తూ పక్కకు తప్పుకున్నాడు. సూరిగాడి మనసు మనసులో లేదు. భిక్షగాడి మాటలు సూరిగాడి మదిని తొలిచేస్తున్నాయి.

ఏడూళ్ల సూరిగాడు

"భిక్షగాడికి ఇంత బలుపా? అహంకారమా"? సూరిగాడి పక్కసీటులోని పెద్దాయన అన్నాడు.

"కాదు ఆత్మగౌరవం.. వాడికీ తిక్క ఉంది. దానికీ లెక్కుంది. తాను ఏ పని చేయలేడు. తన అసహాయ స్థితికి సమాజం జాలి పడాల్సిందే. ఆదుకోవాల్సిందే. కనీసం




రెండు పూటలా ఆకలి తీరే రీతిలో సాయం చేయాల్సిందే. నాలాగే ఒక్కొక్క రూపాయి ఇస్తే... వాడి కడుపు నిండదు" సూరిగాడు అన్నాడు.

"నిజమే అతడిది ఆత్మగౌరవమే. మీలా ఎప్పుడూ ఆలోచించలేదు" పెద్దాయన నొచ్చుకున్నాడు.

"పర్వాలేదు... అందరూ ఇలా ఆలోచిస్తే మానవత్వం బతికిబట్ట కడుతుంది. వాదించానేగానీ అతడు అడిగిన పది ఇవ్వలేకపోయా.. బాధగా ఉంది" సూరిగాడు అన్నాడు.

"మన ఆంధ్రుల కంటే అడుక్కునే అతడే బెస్ట్ అనిపిస్తోంది. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టారు. పార్లమెంటు సాక్షిగా బోల్డన్ని హామీలు ఇచ్చారు. ఐదేళ్ల పాటు ప్రత్యేకహోదా ఇస్తామన్నారు. రాజధాని శంకుస్థాపనకు వచ్చి ప్రధాని పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు ఇచ్చాడు. అప్పుడే జనం తిరగబడలేదు. అదేమంటే కేంద్రంతో గొడవలొద్దు అంటూ నాలుగేళ్లు టీడీపీ ఎంపీలు దద్దమ్మల్లా కూర్చున్నారు. ప్రత్యేక హోదా లేదు... ప్యాకేజీ ఇస్తామంటే గొర్రెల్లా తలూపారు. లక్షల కోట్లు వస్తే కమీషన్లు జుర్రుకుందామని సంబరపడ్డారు. చివరికి కేంద్రం కాడి పడేస్తే... ఇప్పుడేమో ధర్నాలు, ర్యాలీలు చేస్తున్నారు. భిక్షగాళ్లమా? ఢిల్లీ చుట్టూ తిరిగి ముష్టెత్తుకోవాలా? అని గొడవ పడుతున్నారు", పెద్దాయన నవ్వాడు.

"మన రాజకీయ పార్టీలంటేనే చిరాకెత్తుతోంది. టీడీపీ, వైసీపీ, జనసేన దొంగనాటకాలన్నింటినీ జనం గమనిస్తూనే ఉన్నారు. పోయిన పరువు కోసం టీడీపీ, ప్రత్యేక హోదా పేరుతో వైసీపీ, ఇక జనసేన వీధి పోరాటాలు చేయదట. ప్రభుత్వంపై పోరాటం చేయదట. నాలుగేళ్లుగా సీపీఐ నాయకత్వంలో ప్రత్యేక హోదా పోరాటం జరుగుతోంటే...కనీసం స్పందించలేదు. లెఫ్ట్ పార్టీల బంద్ పిలుపుతో జనం కదలి రావటంతో విధిలేక మద్దతు ఇచ్చి, జేయేసీ ఏర్పాటు చేద్దామంటున్నాడు. ముందు ఎంపీలు, కేంద్ర మంత్రులు రాజీనామా చేస్తే టీడీపీకి కొంచెమైనా పరువు నిలుస్తుంది. ప్రత్యేక హోదా విషయంలో అన్ని రాజకీయ పార్టీలూ ఒకే వేదిక మీదకు రావాలి. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోకపోతే... ఆంధ్రుల ఆత్మగౌరవం అనే పదానికే అర్థం ఉండదు", సూరిగాడు అనగానే "బాగా చెప్పారు" పెద్దాయన షేక్‌హ్యాండ్ ఇచ్చాడు.



విరిసిన తులిప్ !

ఇదేమిటో గుర్తుపట్టారా? తులిప్ అండి! తులిప్‌లను ఎప్పడూ మొగ్గరూపంలోనే చూసి ఉంటారు. ఆ పుష్పం చూడడానికి కూడా మొగ్గరూపంలోనే అందంగా ఉంటుంది. కాదనలేం, కానీ విరిసిన తులిప్‌ను ఎప్పుడైనా చూశారా! లేదంటే ఇప్పుడు చూడండి. పూర్తిగా విరిసిన తులిప్ ఇది. న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఉన్న చిల్డ్రన్స్ పార్క్‌లో న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఈ తులిప్ మొక్కలను పెంచుతోంది. ఇక్కడే కాదు లోధి గార్డెన్స్, చాణక్యపురి నెహ్రూ పార్క్‌ల్లో కూడా ఈ మొక్కలు కనువిందు చేస్తున్నాయి.



మీ ఇంట్లోని గాలి స్వచ్ఛంగా లేనట్టనిపిస్తోందా? దుర్వాసనలు ఎక్కువగా వస్తున్నాయా? అయితే, మీ ఇంట్లోని గాలి స్వచ్ఛతను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉంది. ఇంట్లోని గాలి స్వచ్ఛంగా ఉంటేనే ఇంట్లోని సభ్యులు ఆరోగ్యంగా ఉంటారు. లేదంటే వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. మీరు పీల్చే గాలి నాణ్యతను మెరుగుపరచాలంటే కొన్ని పద్ధతులను పాటించాలి. గాలి నాణ్యతను మెరుగుపరిచే విధానాలపై మీకు అవగాహన ఉండాలి. గాలి నాణ్యత దెబ్బతిన్న విషయం మీకు తెలిసుండకపోవచ్చు. కెమికల్ ప్రోడక్ట్స్ వలన, అలాగే పర్యావరణంలోని దుమ్మూ ధూళి వలన గాలి నాణ్యత దెబ్బతింటుంది.

ఇంట్లో గాలి స్వచ్ఛతను మెరుగుపర్చుకోండి!

అసలే వచ్చేది ఎండాకాలం గాలి కోసం అల్లాడిపోతుంటాం. స్వచ్ఛమైన గాలి కోసం తెగ ఇబ్బంది పడిపోతుంటాం! ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే గాలి స్వచ్ఛతపై దృష్టి పెట్టాలి. ఇంట్లో స్వచ్ఛమైన గాలి కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

నిజానికి, శ్వాసకోశ సమస్యలు, అలాగే కొన్ని రకాల అలర్జీలు గాలి నాణ్యత దెబ్బతినడం వలన సంభవిస్తాయి. అత్యంత బాధాకర విషయం ఏంటంటే గాలి నాణ్యతకు గల ప్రాముఖ్యాన్ని అనేకమంది విస్మరిస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన విషయం, గాలి నాణ్యతను మెరుగుపరిచే అంశాల గురించి తెలుసుకోండి. వీటిని పాటించి, గాలి నాణ్యతను మెరుగుపరుచుకుని తద్వారా మీ ఆరోగ్యాన్ని సంరక్షించుకోండి.



పర్యావరణానికి అనుకూలమైన క్లీనింగ్ ఉత్పత్తులనే వాడండి

రసాయనాల (కెమికల్స్)తో నిండిన ఎన్నో రకాల క్లీనింగ్ ఉత్పత్తులకు అలవాటు పడి సహజంగా లభించే ప్రత్యామ్నాయాలను మరచిపోయాము. ఇంట్లోని గాలి నాణ్యత దెబ్బతీయకుండా సహజసిద్ధమైన పదార్థాలను క్లీనింగ్‌కి వినియోగించడం ద్వారా గాలి నాణ్యతను కాపాడుకోవచ్చు. చాలా దేశాలలో ఇప్పటికే పర్యావరణానికి అనుకూలమైన క్లీనింగ్ పద్ధతులనే పాటిస్తున్నారు. కెమికల్ క్లీనింగ్ ప్రోడక్ట్స్‌కి బదులుగా పర్యావరణానికి అనుకూలమైన క్లీనింగ్ పద్ధతులని ఆచరణలో పెట్టేందుకు మీరు ప్రయత్నించండి!

సాధ్యమైనంత వరకూ కెమికల్ స్ప్రేస్‌ని వాడటం మానండి.

వీటిలోనున్న హానికర అలాగే సింథెటిక్ టాక్సిన్స్ అనేవి పర్యావరణాన్ని పాడుచేస్తాయి.

వైట్ వినిగార్, నిమ్మ లేదా బేకింగ్ సోడాతో ఇంటిని శుభ్రపరుచుకోండి.



ఇంట్లోని చెత్తను తొలగించండి

ఇంట్లోని అవసరమైన వస్తువులనే ఉంచండి. వాడని వస్తువులను తొలగించుకోండి. అలాగే, పాడైపోయినవి వెంటనే తొలగించండి. ఎక్కువగా సామానులు పోగైతే వాటితో పాటే అంతే మొత్తంలో దుమ్మూ ధూళి పేరుకుపోతాయి. అందువలన, వస్తువులను ఎక్కువగా పేర్చుకోకండి. మీకు ఇంటిని డెకరేట్ చేయటం ఇష్టమైనా కూడా సింపుల్‌గా డెకరేట్ చేసుకోవడం మంచిది.

రగ్స్, స్టఫ్డ్ యానిమల్స్, తోలు వస్తువులను శుభ్రపరుచుకోండి.

వాటిని ఇంట్లో ఉంచాలనుకుంటే తరచూ వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచుకుంటూ ఉండండి.

మీకు పెంపుడు జంతువులూ ఉన్నట్టయితే వాటి హైజీన్‌కి కూడా ప్రాముఖ్యతనివ్వండి.

వాటి బొమ్మలను, బెడ్‌ను శుభ్రపరచండి.



తేమని అదుపులో ఉంచండి

గోడలలో అలాగే రూఫ్‌లో పేరుకున్న తేమ కేవలం దుర్వాసనలు కలిగించడమే కాదు, ఇవి మీకు శ్వాసకోశ సమస్యలను అలాగే చర్మసమస్యలను కలిగిస్తాయి. ఒకవేళ మీ ఇంట్లో వెంటిలేషన్ సరిగ్గా లేకపోతే వెంటనే తగిన పరిష్కారం వెతికి గాలి నాణ్యత దెబ్బతినకుండా చూసుకోవాలి.

ఇంట్లోని తేమ ఎక్కువగా ఏ గదిలో పేరుకుపోతుందో కనుగొని ఆ గదిలోని కిటికీలను, తలుపులను తెరవాలి.

ఆకుపచ్చని బూజును తొలగించేందుకు నిమ్మని వాడండి.

తేమ ఇంకా అలాగే నిలిచి ఉంటే, ప్రొఫెషనల్స్ సహకారాన్ని పొంది మరమ్మతులు చేయించండి.

ఇండోర్ ప్లాంట్స్‌ను పెంచండి

ఇండోర్ ప్లాంట్స్ ఇంటి అందాన్ని మరింత పెంచడంతో పాటు ఇంట్లోని గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. ఇవి, సహజసిద్ధంగా గాలి నాణ్యతను పెంపొందిస్తాయి. గాలిలోని కాలుష్యాన్ని తొలగించే సామర్థ్యం వీటికి ఉంది. అలాగే, ఇంటికి చక్కటి లుక్ కూడా వస్తుంది.

ఇంట్లో పెంచదగిన ఇండోర్ ప్లాంట్స్

బ్యాంబూ ఫెర్న్స్, ఐవీ, ఆర్కిడ్స్, పీస్ లిల్లి 3, లోటస్, వైపర్స్ బోస్టింగ్ హెంప్, లేస్ లీఫ్, జెర్బేరా జెంసోనీ, చైనీస్ ఎవర్‌గ్రీన్స్, అజాలీ



వెంటిలేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వండి

ప్రతి గదిలోని గాలి నాణ్యత మెరుగవటానికి వెంటిలేషన్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజూ ప్రతి గదిలోని కిటికీలను అలాగే తలుపులను కనీసం ఇరవై నుంచి ముప్పై నిమిషాల వరకు తెరచి ఉంచాలి. ముఖ్యంగా, మీ ఇంట్లో ఎక్కువ వస్తువులు పేరుకుపోయి ఉన్నప్పుడు వెంటిలేషన్‌కి మీరు అధిక ప్రాధాన్యతనివ్వాలి.

ట్రాఫిక్ అలాగే పోలెన్ తక్కువగా ఉన్నప్పుడు ఇంట్లోని కిటికీలను, తలుపులను తెరచి ఉంచడం మంచిది.

అన్ని తలుపులు అలాగే కిటికీలు తెరవాలి.

బాత్రూం అలాగే వంటగదికి కూడా ఈ సూచన వర్తిస్తుంది.

ప్రతి రోజూ ఈ పద్ధతిని పాటించండి. తద్వారా, ఇంట్లోని గాలి నాణ్యత మెరుగవుతుంది.

ఈ సూచనలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ఇంట్లోని గాలి నాణ్యతను మెరుగుపరుచుకోండి. తద్వారా, ఇల్లు మరింత ప్రశాంతమైన ఆరోగ్యకరమైన ప్రదేశంగా మారుతుంది.

– ప్రసాదరెడ్డి



ధూమపానాన్ని మానివేయండి

సిగరెట్లను తాగకండి. ఇంట్లోని సిగరెట్లు తాగితే గాలి నాణ్యతను దెబ్బతీసిన వారవుతారు. మీ కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందికి గురవుతారు. సిగరెట్ పొగ గాలిలో కలిసిపోతుంది. అందులోని టాక్సిన్స్ ఎక్కువగా ఉండటం వలన ఇంట్లోని సభ్యులందరికి శ్వాసకు సంబంధించిన సమస్యలు తలెత్తవచ్చు. అందులోని కెమికల్ కాంపౌండ్స్ గదిలో నిలిచిపోతాయి. నిజానికి, గదిలో నుంచి వస్తున్న దుర్వాసనతో మీరీ విషయాన్ని పసిగట్టవచ్చు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం.

సాధ్యమైనంత వరకూ ధూమపానం చేయకుండా ఉండండి.

స్మోకింగ్‌ను మానేసేందుకు అవసరమైన మార్గాలపై దృష్టి సారించండి.

ఒకవేళ ధూమపానం మానలేకపోతే, బయటకు వెళ్లి తాగండి.



మెత్తని చపాతీలకు..



రోటీలు, చపాతీలు దేశంలో చాలామందికి ముఖ్య ఆహారం. చపాతీలైతే కేవలం నిమిషాల్లో తయారవుతాయి. కానీ కొంతమంది సమస్య ఏంటంటే, ఎన్నిరకాలుగా ప్రయత్నించినా, వారు తయారుచేసే చపాతీలు మెత్తగా రావు.

వంటచేసేటప్పుడు, ఆ పదార్థాలను తయారుచేసే సరియైన విధానం తెలిసి వుండటం ముఖ్యం. అలాగే, చపాతీలు చేసేటప్పుడు కూడా కొన్ని పాటించాల్సిన పద్ధతులున్నాయి. మెత్తని చపాతీ కావాలంటే గోధుమపిండిని వేడినీటితో మర్దనచేసి పక్కన అలా ఉంచండి (కనీసం 30నిమిషాలు). పిండిని వత్తేటప్పుడు అదనంగా పిండిని వేయకండి. ఇలాంటివే మెత్తని చపాతీలు రావటంలో సాయపడతాయి. అయితే ఈ రోజు మనం చపాతీలు మెత్తగా ఎలా వండాలో నేర్చుకుందాం. ఈ కింది చిట్కాలు పాటించి మృదువైన చపాతీలు ఆస్వాదించండి.

కావాల్సిన వస్తువులు :

- గోధుమపిండి -3 కప్పులు
- వేడి నీరు
- ఉప్పు మీ రుచికి తగ్గట్టుగా నూనె

చేయాల్సిన పద్ధతి :

- ఒక గిన్నెలో గోధుమపిండి తీసుకుని కొంచెం ఉప్పు వేసుకోండి. కప్పు వేడినీటితో కలిపి అరగంట సేపు ఆ మిశ్రమాన్ని నానబెట్టండి.
- అరగంట తర్వాత, ఆ మిశ్రమాన్ని కలుపుతూ మర్దన చేస్తూ పిండిముద్దగా చేయండి. ఆ పిండిముద్దను శుభ్రమైన, చదునైన స్థలంపై వేసి పది నిమిషాలపాటు మర్దన చేస్తూ ఉండండి.
- నీరు తగినంత కలుపుతూ ఉండండి. ఎక్కువగా వేయకండి. గిన్నెలో పిండి మిగలకుండా కలపండి. పదినిముషాల పాటు అలా ఉంచేయండి.
- ఇక చిన్న చిన్న గుండ్రని ముద్దలు తీసుకుని, వాటిని క్రమంగా వత్తి, మెత్తని చపాతీలు తయారుచేసుకోండి.

గమనిక : పిండిని కలిపేటప్పుడు మరీ ఎక్కువ పిండిని వేయకండి. పిండిని వత్తేటప్పుడు ఇరుపక్కలా అదనంగా పిండిని వేస్తూ ఉండటం వల్ల చపాతీలు కొన్నిసార్లు గట్టిగా వస్తాయి.

- పెనాన్ని వేడిచేసి ఈ వత్తిన పిండిని దానిమీద వేయండి. చపాతీ పెనంపై ఉన్నప్పుడు ఎక్కువ నూనెను వేయకండి. రెండుపక్కలా సన్నని మంటపై వేయించండి. ఇక మీ వేడి వేడి, మెత్తని చపాతీలను కూరతో కలిపి వడ్డించుకోండి.

ముఖంపై మచ్చలు ఇబ్బంది పెడుతున్నాయా ?

కొందరు స్త్రీలకు ముఖంపై చారికల్లాంటి మచ్చలు ఇబ్బంది పెడతాయి. వీటిని నివారించడానికి ఈ కింది చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- ముఖాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా కడుక్కోవాలి.
- ఎక్కువగా నీరు తాగడంవల్ల ముఖం తాజాగా తయారయ్యి మచ్చలు పోతాయి.
- కొంచెం ఉల్లి రసంలో చెంచా తేనె కలిపి ముఖానికి రాసుకుంటే ముఖంపై మచ్చలు నివారించవచ్చు.
- మచ్చలపై నిమ్మతొక్కలతో మసాజ్ చేసుకోవాలి.
- వారానికి రెండు సార్లు బాదం పప్పును నీటిలో నానబెట్టి నానిన తరువాత దంచి ఒక చెంచా నిమ్మరసంలో కలిపి మెత్తగా పేస్ట్ లా చేసుకుని ముఖానికి పట్టిస్తే గుణం కనబడుతుంది.
- కొంచెం ఉల్లి రసంలో దూదిని ముంచి నల్ల మచ్చలు ఉన్నచోట రాసుకుంటే ఫలితం ఉంటుంది.






జరిగిన కథ

నీవే-నా వలపుల రాణిని - నా మదనకామరాజువు నీవే
రాజుగ రాణిగ మనదే - మారుని రాజ్యం!
వెన్నెల పండుగలో
పాడెదనా ప్రేమగీతిక నీ చెవిలో - వికసించును నీ నవ్వులు నా యెదలో
మన ప్రణయం మన కాహారం పంచభక్ష్య పరమాన్నం!
అటులైతే మన కింకేం కావాలి?
- ప్రపంచం తలక్రిందులు కానీ
భూచక్రం యెటులైన పోనీ!
ఆ పాటకు జవాబుగా నేను : "కమలాక్షి నిన్నే కోరి యున్నది కరుణింప మంచి సమయము స్వామీ!" అని వర్ణం పాడితే - శాస్త్రి "ఇదేమిటీ సానిపాట!" అని ముఖం తిప్పేశాడు - నాన్నలాగే శాస్త్రికూడా!
.....ఈ మధ్య సినీమాలో విన్న సంగీతమే జ్ఞాపకం వస్తుంది.

(నిన్నటి సంచిక తరువాయి)

సంగీతం వింటూంటే మత్తుమందు చల్లితే మైకం కమ్మినట్టు నిద్దరే వచ్చేసింది. సంగీతం యింపుగా వున్నా - యేదో అవ్యక్తభావలీల తప్ప నవరసాల్లో యే రసం కూడా మనస్సుకి స్ఫురించలేదు - చిత్తానికి యే యితివృత్తమూ తోచలేదు. మన సంగీతానికి గొప్ప సాంప్రదాయం వున్నా - ఒకవైపే వొరిగిపోయిన తాటిచెట్టులాగు కేవలం ఆధ్యాత్మికంగా పెరిగిపోయింది....శాస్త్రితో కలిసి నేను త్యాగరాజు కృతులు పాడి సంతోషిస్తాను. అతను లేనప్పుడు అతన్ని తలుచుకుని గీత గోవిందం పాడి ఆనందిస్తాను. కాని దైనందినపు కష్ట సుఖాలతోకాని పనిపాటలతోకాని నా జీవిత ఆశయాలతోకాని, నేపాడే సంగీతానికి యే మాత్రమూ సంబంధం లేకుండా వుంది. నంగీతం పాడి సంతోషించడమే కాని నరనరాల అనుభవించి ఆనందించడంలేదు. ఎంచేతో మరీ? ఈ పారిశ్రామిక యుగం వచ్చాక మన సంఘం - మన రాజకీయం - మన జాతీయ జీవనం - మన దినచర్య - అంతా తలక్రిందులై పోయింది. సంగీతం మాత్రం కాలమానం అనుసరించకుండా - యే మార్పు పొందకుండా అలా నిల్చిపోయింది. భక్తుల చిత్తంలోనూ, భాగవతుల చేతుల్లోనూ వుండిపోవడం చేత కాబోలు - మరీ వ్యక్తిగతంగా పరిగణించి నాబోటి సామాన్య ప్రజలకి దూరం అయిపోయింది. హార్మోనియం, గ్రామఫోను, సినీమా, రేడియో వచ్చాక కూడా - మన హావభావాలని కాని, మన ఆదర్శాలని కాని, మన జాతీయతని కాని, మన స్వతంత్ర కాంక్షని కాని కళారూపంగా మన సంగీతం నిర్వచించ లేకపోయింది సరికదా, చివరికీ సత్యాగ్రహ సమరపు ఉత్సాహాన్ని ప్రతిధ్వనించే వృత్తాన్ని ఒకదాన్నైనా సృష్టించలేకపోయింది! మన పాటకజనం గేయాలు, పదాలు, గానాలు, ద్విపదలు, పాటలు - వీట్లలో నుంచి సారం, పటుత్వం గ్రహించి - ఆ సాంప్రదాయం మీదనే మన సంగీత కళని నిర్మించి వుంటే యెలా అభివృద్ధి పొంది వుండునోమరి? ...సంగీతం అంటే సహజంగా పడి చచ్చిపోతాం మనం! అటువంటిది - సంగీతం లక్ష్యమే మర్చిపోయి - మన భాగవతుల స్వరకల్పన కసరత్తులు - తీగలు మీటించే చమత్కారాలు - హిందూస్తానీ మట్టుల మెరుగులు - అపూర్వరాగాలకి ప్రాముఖ్యత ఇవ్వడం - పాతరాగాలకి కొత్తపేర్లు పెట్టడం - యిలా ఉత్తవిద్వాంసులు పాండిత్యం కిందకీ, లాక్షణికుల పరిశోధనల కిందకీ, నగిషీ చెక్కి జిలుగు పెట్టే పనివాడితనం కిందకీ దిగిపోతుందా? మన సంగీతమంతా సాంప్రదాయసిద్ధమైన ప్రయోగాలతో కట్టుబడిపోవడంచేత రసాస్వాదన ఏ కొద్దిమంది "రసికుల" గుత్తధనంగానో మారుతోందా? పాట కచ్చేరికీ,-సభలకీ, కాలక్షేపాలకీ డబ్బున్నవాళ్ళు వేలాది వెలతున్నా - కూలినాలి చేసుకునే సామాన్య ప్రజ వాటికి అనిపిస్తూంది నాకు! మన లలితకళలు అభివృద్ధి పొందాలంటే సామన్య ప్రజేవాట్లని పోషించాలి - అంటే వాళ్ళ ఆర్థికస్థితి బాగుండాలి. అంటే పూర్ణస్వరాజ్యం రావాలన్నమాట. ఇదంతా విప్లవం అంటాడు శాస్త్రి. రాజపోషణ వుంటేనే కళావికాసం వుంటుంది. ప్రభుత్వపోషణ వుంటే కళ స్తంభించిపోతుంది.



పామర ప్రజాపోషణ క్రింద కళ అసలే నశించిపోతుందంటాడు! మా యిద్దరి దృక్పథాలు యెంత వేరుగా వున్నాయి!!

.....సాహిత్యం కంటే స్వరమే ప్రధానం - అంచేతే సంగీతం సర్వమానవ భాష అంటారు. అది నిజమే కనక అవుతే -నాకు పాశ్చాత్య సంగీతం అర్థం కాకపోవడమేమి? ...హిందూ దేశంలో పుట్టి హిందూదేశంలో పెరిగిన శాస్త్రికి మహాబలేశ్వరపు చెక్కడాలు భువనేశ్వరపు ఆలయాలు, అజంతా చిత్రాలు, రామారావుగారి బొమ్మలు - అర్థం కాకపోవడమేమి? .... నేను యూరపులో పాశ్చాత్య సంగీతంవిని ఆ నియమాలు తెలుసుకొని ఆ సంప్రదాయాలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. బాఖ్



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

మెజార్టు - బేథోవెన్ - బ్రామ్సు - వాగ్నరు - ఎల్గార్ - ఈ సంగీత విద్వాంసుల పేర్లు ఎప్పుడూ ఇంగ్లీషు పుస్తకాల్లో చదువుతూనే వుంటాం. వీళ్ళ కళని బోధపర్చుకోవాలి. అంతేకాదు. పాశ్చాత్య దేశపు, సంగీతం విద్వాంసులు కొంతమంది వాళ్ళదేశాల జాతీయతని, జాతీయభావాలని, జాతీయ ఆశయాలని, జాతీయ సంస్కృతిని శాశ్వతంగా సంగీతకళలలో నిరూపించారని ఆ దేశాల చరిత్రలోను, వాఙ్మయంలోను చదువుతాం - ఇటలీలో వెర్డీ, టోస్కనీనీ - పోలెండ్‌లో షోపిన్ - హంగరీలో లిస్టు - రష్యాలో మౌసార్గస్కీ గ్లింకా, ఛైకోవ్‌స్కీ - చెకోస్లావేకియాలో స్మెతానా - ద్వొరాక్ - ఇంగ్లండులో ఇథెల్‌స్మిత్, వాన్ విలియమ్సు, రట్లాండుబౌటన్ - వీళ్ళభావాలు, విశిష్టత నేను ముఖ్యంగా తెలుసుకోవాలి...

...పాపాయికి పదేళ్ళువచ్చాక అప్పుడు దానికి సంగీతం నేర్పించడం మొదలెడుతాను. నాకింకా నాలుగుబర్ల గుణింతం వచ్చిందోలేదో అప్పుడే నాన్న నాచేత సంగీతం మొదలెట్టించారు. నాన్న తెల్లవారుఝామున మూడు గంటలకే నన్ను నిద్రలోనుంచి లేపేసి చన్నీళ్ళతో మొఖం కడుక్కోమనేవారు. అమ్మ కుంపటి రాజేసి వేడి నీళ్ళు యిస్తానంటే - చలివణుకులో కంఠానికి మంచి వొడుపు వొస్తుంది - వేడి నీళ్ళు ఇవ్వడం వాటం కాదనేవారు నాన్న! గడియారం దగ్గర పెట్టుకొని నేను సాధకం చేస్తూన్నంతసేపూ తనలా కూచునేవారు - ఆయన జపం చేసుకుంటూ. మళ్ళీ ఆరు గంటలకి ఆయన మడి స్నానానికి లేచేవరకు! నాకేమిటీ యీ కఠినశిక్ష అని యేడ్చుకునేదాన్ని! సాయంకాలం నాలుగు గంటలకి బడినుంచి రాగానే సంగీతం గురువుగారు ప్రత్యక్షం. నా కంటికి ఆయన యముడిలా కానొచ్చేవాడు. ఫిడేలు పెట్టెని చూస్తే నల్లగా దెయ్యంలా, కమాను యమపాశంలా వుండేది. అపస్వరం నా నోట వస్తే గురువుగారు కమానుతో చరువు చరిచేవారు. పాఠం నేర్చుకుంటూన్న రెండు గంటలూ నరకకూపం - యమయాతన అనుభవించేదాన్ని! రాత్రి పడుకోబోయేటప్పుడు తెల్లవారుఝామున చలిలో లేవాలే భగవంతుడా - అని ఏడుస్తూ నిద్దరోయేదాన్ని. "నాన్న నన్ను చితకకొట్టేసినాసరే మరి సంగీతం నేర్చుకోవడం మానేద్దాం" అని రెండుమూడుసార్లు నిశ్చయం చేసుకున్నాను కూడాను. సంగీతంలో నాకేమాత్రం అభిరుచి తక్కువగా వున్నా, నస్త్రి చెప్పే దాన్నే. సంగీత పాఠాలన్నా, సాధకం చెయ్యడం అన్నా అంత కంటకంగా వుండేది. పాపం - నా పదోయేటకే చచ్చిపోయారు నాన్న. అమ్మమాత్రం - ఎందరేమన్నా - చదువూ, సంగీతం కొనవరకూ చెప్పించింది!... పాపాయి కల్లాకాదు. ఇంట్లో అది కాగితాలు చించుతూన్నప్పుడూ, పెన్సిలుతోనూ సుద్దముక్కతోనూ గీతలు పెడుతూన్నప్పుడు, బొమ్మలతో ఆడుకొంటూన్నప్పుడూ మెల్లిగా సంగీతం వాయిస్తూంటాను. కిండరుగార్టెనులో నృత్యం చెప్పినప్పుడూ, కసర్తతు జేసినప్పుడూ వెనక వాయిద్యం లయ వుంటునే వుంటుంది. దానికి పదేళ్ళొచ్చేవరకూ సంగీతం చెప్పించకుండా - మంచి సంగీతం దాని చెవిని పడేటట్టు గ్రామఫోనూ రేడియో పెడుతూంటాను. అప్పటికి తెలిసిపోతుంది దానికి సంగీతంలో సరదా వున్నదీ లేనిదీ. పిళ్ళారి గీతాలు చెప్పించి నాలుగు నెలలపాటు సంగీతం ఆపుచేస్తాను. దానికి నిజంగా ప్రవేశమే గనుక వుంటే అదే నన్నడుగుతుంది: "సంగీతం నేర్చుకుంటానే అమ్మా!" అని. "బడిపాఠాలకి అడ్డు వస్తుందేమో అని సంగీతం గురువుగారిని మానిపించేశానే" అంటాను. "అదేమిటీ! సంగీతం కంటే బడిపాఠాలే ముఖ్యం అని యెవరు చెప్పారే? సంగీతం నేర్చుకోకపోతే నేను వుండలేనే!" అని అదే అనాలి. సంగీతంలో అభిరుచి వుండాలి. నేర్చుకుందాం అన్న సరదా వుండాలి. సాధకం చెయ్యడానికి ధ్యానం, పట్టుదల వుండాలి. రెండు గంటల సేపు కూచుని పాడడానికి తగిన ఆరోగ్యం వుండాలి. అన్నింటికంటే ముఖ్యం - సహజమైన ప్రవేశం వుండాలి. సరిగమలు పాడినా, సరళీ స్వరాలు పాడినా - పిళ్ళారి గీతాలు పాడినా - వర్ణాలు పాడినా కృతులు పాడినా - తిల్లానం పాడినా - రాగం ఆలాపన చేసినా - సంతోషం ఉత్సాహం వుండాలి. ఇవన్నీ వుంటేనే సరస్వతీ ప్రసన్నం!

ఝూన్సీ...రైలు ఆగింది. ప్రయాణీకులు కొందరు బండి దిగి ఫలహారపు దుఖాణానికి వెలుతున్నారు...ఒకతను పూరీ బంగళాదుంపకూర కొనుక్కుని ఆ సమర్థంలో నుంచి బైటపడి వస్తుండగా పాపం అతని చేతుల్లోంచి ఆ వస్తువులని గెద్ద ఒకటి తన్నుకుపోయింది. అతను యెంతో చికాకుపడ్డాడు. ఆ దృశ్యం గయోపాఖ్యానంలో పద్యం జ్ఞప్తికి తెచ్చింది. "జలనిధులింకుగాక కులశైలము లేదును గ్రుంగుగాక."

అది శపథంకాదు, జీవశక్తులఘోష - పరిణామశక్తుల ప్రవచనం!

అర్బుద...అవ్యయ అచింత్య అమేయ పదార్థాల పూర్వము పృథ్వి ఒక దేశకాల అవిరతిక నిరంతరం. అపస్సాక అవ్యక్తశక్తి తాండవం. తేజస్సాక మహోగ్రతాపకాంతి. వాయువొక విశ్వకిరణ తరంగం. ఆకాశం ఒక తారాగ్రహ ద్రవ్య మేఘం... మహాశంఖ మహానిధిపదార్థాలు గతించాయి. విశ్వరంగం ఒక చతుర్థానిస్మృత ప్రదేశం. గగనధాన్య గ్రహగోళాల చెంగాడా నక్షత్రకోటి రాశికోటి సూర్యకోటి ప్రచండవేగ భ్రమణం - ధూనుకేతు బృహత్తారల సంఘాత నిర్ధూమధామం....అమృత కోటికల్పాలు గడిచాయి. ఇరవైయేడు నక్షత్రాలు - ద్వాదశ రాసులు నవగ్రహాలు అస్తమించాయి.

- ఇంకా వుంది.

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో నేవిక్ పోస్టులు



ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో నేవిక్ (డొమెస్టిక్ బ్రాంచ్) పోస్టులను టెన్త్ ఎంట్రీ- 02/2018 బ్యాచ్ ద్వారా భర్తీచేసేందుకు అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

పోస్టు పేరు : నేవిక్ (కుక్, స్టీవార్డ్).
వేతనం : రూ.21,700+ ఇతర అలవెన్సులు.
అర్హతలు : కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే కుక్ అభ్యర్థులకు భారతీయ వంటకాల (శాకాహార, మాంసాహార) తయారీలో నైపుణ్యం, రేషన్ అకౌంటింగ్; స్టీవార్డ్ అభ్యర్థులకు మెనూ తయారీ, సర్వింగ్ (వడ్డించడం), హౌస్ కీపింగ్, వైన్ అండ్ స్టోర్స్ నిర్వహణలో ప్రావీణ్యం తప్పనిసరి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులతోపాటు ఏదైనా క్రీడా విభాగంలో జాతీయ/ అంతర్రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ/ ద్వితీయ/తృతీయ స్థానంలో నిలిచిన అభ్యర్థులకు పదో తరగతి మార్కుల్లో అయిదు శాతం సడలింపు ఉంటుంది.
శారీరక ప్రమాణాలు (మెడికల్ స్టాండర్డ్స్) : ఎత్తు-157 సెం.మీ.; ఛాతీ-తగినంత ఉండి గాలి పీల్చినపుడు కనీసం 5 సెం.మీ. వ్యాకోచించగల గాలి; బరువు-ఎత్తు, వయసుకు అనుగుణంగా ఉండాలి (పదిశాతం ఎక్కువ/ తక్కువ ఉన్నా పరిగణిస్తారు); దృష్టి సామర్థ్యం-6/36 (బెటర్ ఐ), 6/36 (వర్స్ ఐ) ఉండాలి. టాటూ (పచ్చబొట్లు) ఉండకూడదు.
వయోపరిమితి : 2018, అక్టోబర్ 1 నాటికి 18-22 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
ఎంపిక విధానం : రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ), మెడికల్ ఎగ్జామినేషన్.
రాతపరీక్ష విధానం : ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, మ్యాథమెటిక్స్, జనరల్ సైన్సెస్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ (కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్), రీజనింగ్ (వెర్బల్, నాన్ వెర్బల్) అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. ఇందులో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ (పీఎఫ్‌టీ) : ఇందులో 1.6 కి.మీ. దూరాన్ని 7 నిమిషాల్లోపు పరిగెత్తగలగాలి, 20 స్కాట్ అప్స్ (ఉఠక్ బైఠక్), 10 పుష్ అప్స్ తీయగలగాలి. పీఎఫ్‌టీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు రాతపరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా తయారుచేసి మెడికల్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. రాతపరీక్ష, పీఎఫ్‌టీ, మెడికల్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్ జాబితా ప్రకారం నేవిక్ (డొమెస్టిక్ బ్రాంచ్) 02/2018 బ్యాచ్‌కు ఎంపిక చేస్తారు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం : ఫిబ్రవరి 10, 2018.
దరఖాస్తు చివరి తేదీ : ఫిబ్రవరి 16, 2018.
పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: www.joinindiancoastguard.gov.in

ఓఎన్‌జీసీ మంగళూరు పెట్రోకెమికల్స్ లిమిటెడ్‌లో 17 ఖాళీలు

మంగళూరులోని ఓఎన్‌జీసీ పెట్రోకెమి కల్స్ లిమిటెడ్ (ఓఎంపీ ఎల్).. 17 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: గ్రాడ్యుయేట్ అప్రెంటీస్-12 (కెమికల్ ఇంజనీరింగ్-4+ఈఈఈ-4+ఈసీఈ-1+ఈఐఈ-1ం ఎంఈ-2); టెక్నీషియన్ అప్రెంటీస్-5 (కెమికల్ ఇంజ నీరింగ్-2+ఈఈఈ-2+ఈఐఈ-1).
స్టైపెండ్: గ్రాడ్యుయేట్ అప్రెంటీస్-4,984బీ టెక్నీషియన్ అప్రెంటీస్-రూ.3,542.
అర్హతలు : సంబంధిత విభాగాలను అనుసరించి గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌కి ఇంజనీరింగ్ డిగ్రీ, టెక్నీషియన్ అప్రెంటీస్‌కి ఇంజనీరింగ్ డిప్లొమా 2015/2016/2017లో ఉత్తీర్ణులై ఉండాలి. అన్‌రిజర్వుడ్‌కు కనీసం 55 శాతం, ఓబీసీ-కనీసం 45 శాతం, ఎస్సీ/ ఎస్టీకి కనీసం 40 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
ఎంపిక : రాతపరీక్ష.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ : మార్చి 1, 2018.
వెబ్‌సైట్ : www.ompl.co.in




ఎయిమ్స్ భోపాల్‌లో 700 పోస్టులు



మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. 700 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్ 1)- 100; నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2)-600.
వేతనశ్రేణి : రూ.9,300-రూ.34,800.
అర్హతలు : సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌కు నాలుగేళ్ల బీఎస్సీ (నర్సింగ్)/ బీఎస్సీ (పోస్ట్ సర్టిఫికెట్)/ బీఎస్సీ (పోస్ట్ బేసిక్)/ తత్సమాన విద్యతోపాటు ఏదైనా స్టేట్/ ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్/ నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రిజిస్ట్రేషన్. అలాగే ఏదైనా 200 బెడ్‌ల హాస్పిటల్/ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో స్టాఫ్ నర్స్ గ్రేడ్ 2 హోదాలో కనీసం మూడేళ్ల ఉద్యోగానుభవం; నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్/ బీఎస్సీ (నర్సింగ్)/ బీఎస్సీ (పోస్ట్ సర్టిఫికెట్)/పోస్ట్ బేసిక్ బీఎస్సీ (నర్సింగ్)/ డిప్లొమా (జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ). ఏదైనా స్టేట్/ ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్స్/ నర్స్ అండ్ మిడ్‌వైఫ్‌గా రిజిస్ట్రేషన్. అలాగే ఏదైనా 50 పడకల ఆస్పత్రిలో కనీసం రెండేళ్ల ఉద్యోగానుభవం.
వయసు : సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌కు 21-35 ఏళ్ల లోపు; నర్సింగ్ ఆఫీసర్‌కు 21-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), స్కిల్ టెస్ట్/ ప్రొఫిషియెన్సీ టెస్ట్.
సీబీటీ పరీక్ష కేంద్రాలు : భోపాల్, భువనేశ్వర్, చెన్నై, గువాహటి, గ్వాలియర్, ఇండోర్, జబల్పూర్, జోధ్‌పూర్, కోల్‌కతా, మొహాలీ, పుణె.
దరఖాస్తు రుసుం : రూ.1,000; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'ది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్), అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఫస్ట్ ఫ్లోర్ ఆఫ్ మెడికల్ కాలేజ్ బిల్డింగ్, సాకేత్ నగర్, భోపాల్-462020 (మధ్యప్రదేశ్)' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి 6, 2018.
హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : మార్చి 20, 2018.
వెబ్‌సైట్ : www.aiimsbhopal.edu.in

ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 1898 ఉద్యోగాలు



ఈస్ట్ సెంట్రల్ రైల్వే (ఈసీఆర్)లోని 1,898 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ ప్రకటన విడుదల చేసింది.

పోస్టు : అప్రెంటీస్.
డివిజన్లు/ యూనిట్ల వారీ ఖాళీలు : ధనపూర్-626బీ ధన్‌బాద్-142; మొగల్‌సరాయ్-844; సమస్తిపూర్-70; ప్లాంట్ డిపో (మొగల్‌సరాయ్)-116; మెకానికల్ వర్క్‌షాప్ (సమస్తిపూర్)-100.
ట్రేడ్ విభాగాల వారీ ఖాళీలు : ఫిట్టర్-826, వెల్డర్ (జీఅండ్‌ఈ)-117, మెకానిక్ (డీజిల్)-150, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్-84, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్-20, కార్పెంటర్-18, ఎలక్ట్రానిక్ మెకానిక్-280, పెయింటర్ (జనరల్)-16, ఎలక్ట్రీషియన్-192, వైర్‌మ్యాన్-98, టర్నర్-41, మెషినిస్ట్-30, ఎంఎంటీఎం-2, లేబొరేటరీ అసిస్టెంట్ (సీపీ)-4, మెకానిక్ (ఎంవీ)-8, గ్రిండర్/ మెషినిస్ట్-12.
అర్హతలు : కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ (ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ).
వయసు : 2018, జనవరి 30 నాటికి 16-24 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : మార్కుల (పదోతరగతి+ఐటీఐ) మెరిట్ ఆధారంగా.
దరఖాస్తు రుసుం: రూ.100; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ : ఫిబ్రవరి 28, 2018.
వెబ్‌సైట్ : www.rrcecr.gov.in

ఎన్‌ఎండీసీలో 36 ఉద్యోగాలు



హైదరాబాద్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) లిమిటెడ్‌లో 36 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది.

పోస్టు-ఖాళీలు : మేల్ వార్డ్ అటెండెంట్ గ్రేడ్ (2) ట్రైనీ-3; ఫీమేల్ వార్డ్ అటెండెంట్ గ్రేడ్ (2) ట్రైనీ-; ఎండబ్ల్యూఏ/ఎఫ్‌డబ్ల్యూఏ కమ్ డ్రెస్సర్ గ్రేడ్ (3) ట్రైనీ-1; అసిస్టెంట్ రేడియోగ్రాఫర్ గ్రేడ్ (3) ట్రైనీ-1; అసిస్టెంట్ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ గ్రేడ్ (3) ట్రైనీ-2; నర్స్ గ్రేడ్ (3) ట్రైనీ-8; మెయింటెనెన్స్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్) ట్రైనీ-13; ఎలక్ట్రీషియన్ గ్రేడ్ (3) ట్రైనీ-5, బ్లాస్టర్ గ్రేడ్ (2) ట్రైనీ-1.
స్టైపెండ్ : శిక్షణలో మొదటి 12 నెలలు.. గ్రేడ్ (3) పోస్టుల్లో నర్స్ ట్రైనీకి రూ.13,000, మిగిలిన వాటికి రూ.12,000; గ్రేడ్ (2) పోస్టులకు రూ.11,000. శిక్షణలో తర్వాత ప్రతి నెలకు రూ.500 అదనంగా ఆరు నెలలపాటు ఇస్తారు.
అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి మిడిల్/ ఎనిమిదో తరగతి/ పదోతరగతి/ ఐటీఐ/ డిగ్రీ/ ఇంజనీరింగ్ డిప్లొమా. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం, సంబంధిత రంగం ప్రత్యేకాంశాలపై నైపుణ్యం తదితర అర్హతలుండాలి.
వయసు : 18-30 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్/ జాబ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్.
దరఖాస్తు రుసుం : రూ.150; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ : ఫిబ్రవరి 26, 2018.
వెబ్‌సైట్: www.nmdc.co.in

ఐడీబీఐలో 760 ఉద్యోగాలు

ఐడీబీఐ బ్యాంకు.. 760 ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులు మూడేళ్లు కాంట్రాక్టు వ్యవధిలో పనిచేయాల్సి ఉంటుంది. దీన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంటే అభ్యర్థి పనితీరు, ప్రవర్తన ఆధారంగా అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్ ఏ) హోదాలో నియమిస్తారు.

పోస్టు : ఎగ్జిక్యూటివ్.
మొత్తం ఖాళీలు : 760 (ఎస్సీ-122+ఎస్టీ-56+ఓబీసీ-202+ అన్‌రిజర్వుడ్-380).
వేతనం : కాంట్రాక్టు వ్యవధిలో మొదటి ఏడాది రూ.17,000; రెండో ఏడాది రూ.18,500; మూడో ఏడాది రూ.20,000. కాంట్రాక్టు వ్యవధి విజయవంతంగా పూర్తిచేస్తే అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్ ఏ) హోదా వేతన శ్రేణి అందుతుంది.
అర్హతలు : కనీసం 60 శాతం (ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ కేటగిరీలకు 55 శాతం) మార్కులు/ తత్సమాన గ్రేడ్‌తో ఏదైనా డిగ్రీ/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత.
వయసు : 2018, జనవరి 1 నాటికి 20-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీలకు నిబంధనల మేర గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
ఎంపిక : రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ప్రి-రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్.
రాతపరీక్ష విధానం : దీన్ని ఆన్‌లైన్ విధానంలో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ రీజనింగ్, టెస్ట్ ఆఫ్ వర్కింగ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్, టెస్ట్ ఆఫ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 50 చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 1 మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కు కోత విధిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థుల మెరిట్ జాబితా నుంచి డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు. అనంతరం ప్రి-రిక్రూట్‌మెంట్ మెడికల్ టెస్ట్ నిర్వహించి తుది ఎంపిక నిర్వహిస్తారు.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు : హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.
దరఖాస్తు రుసుం : ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ-రూ.150 (ఇంటిమేషన్ చార్జీ మాత్రమే); మిగిలిన అభ్యర్థులకు రూ.700 (అప్లికేషన్ ఫీ+ఇంటిమేషన్ చార్జీ).
దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ : ఫిబ్రవరి 28, 2018.
వెబ్‌సైట్ : www.idbi.com

ఇండియన్ బ్యాంక్‌లో 21 పోస్టులు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం.. 21 స్పోర్ట్స్ కోటా ఖాళీల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది.

పోస్టులు : ఆఫీసర్ (జేఎంజీ స్కేల్ 1), క్లర్క్.
క్రీడా విభాగాల వారీ ఖాళీలు : బాస్కెట్ బాల్-6, క్రికెట్-7, వాలీబాల్-5, హాకీ-3.
వేతనశ్రేణి : ఆఫీసర్-రూ.23,700-రూ.42, 020; క్లర్క్-రూ.11,765-రూ.31,540.
అర్హతలు : ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్య ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే ఆఫీసర్ పోస్టులకు సంబంధిత క్రీడా విభాగంలో దేశం తరఫున ప్రాతినిథ్యం వహించి ఉండాలి. క్రికెట్ విభాగానికైతే రంజీ ట్రోఫీ/ దులీప్ ట్రోఫీలో ప్రాతినిథ్యం వహించినా పరిగణిస్తారు. క్లర్క్ పోస్టులకు సంబంధిత క్రీడా విభాగంలో రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి సీనియర్/ జూనియర్ పోటీల్లో ప్రాతినిథ్యం/ కంబైన్డ్ యూనివర్సిటీ బృందాల్లో సభ్యుడుగా/ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ఏదైనా యూనివర్సిటీ తరఫున లేదా ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో ఏదైనా డిస్ట్రిక్ట్ తరఫున పాల్గొని తొలి మూడు స్థానాల్లో ఏదో ఒకటి పొంది ఉండాలి.
వయసు : 2018, జనవరి 1 నాటికి 18-26 ఏళ్ల లోపు ఉండాలి.
ఎంపిక : స్క్రీనింగ్ (వయసు, క్రీడా విజయాలు), ట్రయల్స్ (ఫిజికల్ ఫిట్‌నెస్, స్పీడ్ ఎండ్యూరెన్స్, గేమ్ స్కిల్), అచీవ్‌మెంట్స్, ఇంటర్వ్యూ (ఆఫీసర్ పోస్టులకు మాత్రమే).
దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.
దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : మార్చి 3, 2018.
వెబ్‌సైట్: www.indianbank.in

ఎయిమ్స్ రాయ్‌పూర్‌లో 72 ఖాళీలు



ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఉన్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్).. 72 బోధన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : అసిస్టెంట్ ప్రొఫెసర్-27; అసోసియేట్ ప్రొఫెసర్-45.
బోధన విభాగాల వారీ ఖాళీలు : అనస్థీసియాలజీ-3; బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ-5; కార్డియోథెరసిస్ సర్జరీ-5; కార్డియాలజీ-1; డెర్మటాలజీ-2; ఎండ్రోక్రినాలజీ అండ్ మెటబాలిజమ్-2; గ్యాస్ట్రోఎంట్రాలజీ-2; జనరల్ మెడిసిన్-5; జనరల్ సర్జరీ-3; హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్-1; మెడికల్ ఆంకాలజీ/హెమటాలజీ-4; నియోనటాలజీ-3; నెఫ్రాలజీ-1; న్యూరాలజీ-2; న్యూరోసర్జరీ-4; న్యూక్లియర్ మెడిసిన్-3; పల్మనరీ మెడిసిన్-1; రేడియో దయాగ్నసిస్-6; రేడియోథెరపీ-1; సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ-6; సర్జికల్ ఆంకాలజీ-6; యూరాలజీ-6.
వేతనం : అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.1,00,000; అసోసియేట్ ప్రొఫెసర్-రూ.1,88,000.
అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను బట్టి డీఎం/ ఎంసీహెచ్/ ఎండీ/ ఎంఎస్/ మాస్టర్స్ డిగ్రీ/ తత్సమాన విద్యతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు : దరఖాస్తు గడువు ముగిసే నాటికి 50 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
ఎంపిక : ఇంటర్వ్యూ.
దరఖాస్తు రుసుం : రూ.1,000; ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ/ మహిళ కేటగిరీలకు ఫీజు లేదు.
దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.
దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 26, 2018.
వెబ్‌సైట్ : www.aiimsraipur.edu.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
294.71 ▲	84.80 ▲	100 ▲	28,810	300 ▲	420,600	
34,300.47	10,539.75	28,850	ప్రొద్దుటూరు 28,810	39,100	ప్రొద్దుటూరు 40,656	64.31
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టాటా స్టీల్	712.50	4.22
బీహెచ్ఇఎల్	97.60	3.17
ఎస్ బ్యాంక్	334.95	2.89
ఇండస్ఇండ్ బ్యాంక్	1,701.80	2.12
హీరో మోటార్‌కార్ప్	3,658.45	2.07

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్‌బీఐ	288.50	-2.67
ఇన్ఫోసిస్	1,103.80	-0.72
ఐటీసీ	269.85	-0.53
ఎం&ఎం	770.00	-0.43
ఐసీఐసీఐ బ్యాంక్	333.90	-0.23

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.05	64.06
యూరో	79.82	79.77
పౌండ్	90.47	89.94
ఆస్ట్రేలియా డాలర్	50.77	50.77
సింగపూర్ డాలర్	48.55	48.64

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,810	30,812
చెన్నై	28,770	30,770
బెంగళూరు	28,200	30,160
ముంబై	29,400	31,443
విజయవాడ	28,850	31,080
విశాఖపట్నం	28,810	31,429
ప్రొద్దుటూరు	28,810	30,250
ముడి చమురు		62.79

ఊపందుకోనున్న నియామకాలు!

- 10-15% పెరిగే అవకాశం
- ఇండియా స్కిల్స్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : నిరుద్యోగులకు శుభవార్త. గత ఏడాది కాలంగా స్తబ్దుగా ఉన్న ఉద్యోగ నియామకాల ప్రక్రియ వచ్చే ఏడాది ఊపందుకోనుంది. కార్పొరేట్ నియమకాల్లో వచ్చే ఏడాది దాదాపు 10-15 శాతం మేర వృద్ధి నమోదయే అవకాశం ఉందని 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్-2018' వెల్లడించింది. హెచ్‌ఆర్ టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ పీపుల్స్ స్ట్రాంగ్, నైపుణ్యత అంచనా సంస్థ వీల్‌బాక్స్, పియర్‌సాన్, సీఐఐ, ఏఐసీటీఈ, యూఎన్‌డీపీ, ఏఐయూ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే ఆదారంగా ఈ నివేదక వెల్లడైంది. వచ్చే ఏడాది నియామకాల్లో అనుకూలత కనిపిస్తోందని.. వృద్ధి కూడా 10-15 శాతానికి మధ్య ఉంటుందని ఈ నివేదిక పేర్కొంది. దాదాపు 120 మేటి కార్పొరేట్ సంస్థలు, 5.1 లక్షల మంది విద్యార్థుల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను తయారు చేశారు. దేశం ప్రస్తుతం డిజిటల్‌తో పాటు పలు రంగాలలో పరివర్తన దశలో ముందుకు సాగుతోందని.. ఈ దశలో సప్లైతో పాటు డిమాండ్ వైపున కూడా అత్యధికంగా కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉన్నట్టుగా ఈ నివేదిక తెలిపింది. ఢిల్లీ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అత్యధికంగా ఉద్యోగ అవకాశాలకు ఆస్కారం ఉన్నట్టుగా నివేదిక తెలిపింది. ఉద్యోగిత రిత్యా బెంగళూరు నగరం ప్రథమ స్థానంలో కొనసాగొచ్చని సర్వే తెలిపింది. ఆ తరువాత స్థానాల్లో చెన్నై, ఇండోర్, లక్నో, ముంబయి, నాగపూర్, న్యూఢిల్లీ, పుణె, తిరుచురాపల్లి నగరాల్లో ఎక్కువ కొలువులకు ఆస్కారం ఉందని సర్వే తెలిపింది. 18-25 సంవత్సరాల లోపు వారికి 46 శాతం, 26-29 శాతం వారికి 26 శాతం మేర ఉద్యోగ వనరులు అందుబాటులో ఉండనున్నట్టుగా సర్వే వివరించింది.

- రూ.53,625 కోట్ల రుణాలు రద్దు

బ్యాంకుల ఘనకార్యం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు దాదాపు రూ.53,625 కోట్ల మేర రుణాలను రాని బాకీల కిందకు జమచేస్తూ రద్దు చేశాయి. సెప్టెంబరు నాటికి ఈ మొత్తం నమోదు అయినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.81,683 కోట్లు మొండి బకాయిలను రద్దు చేశారు. వీటిలో అత్యధికంగా భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) రూ.20,339 కోట్ల మేర రుణాలను రాని బాకీలుగా రద్దు చేసింది. 2012-13లో పీఎస్‌బీ రద్దు చేసిన రుణాల మొత్తం రూ.27,231 కోట్లుగా నమోదైంది. గత ఐదేళ్లలో దాదాపు మూడు రెట్లు అధికంగా మొండి బాకీలను ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు బాకీల పద్దుల చేర్చాయి. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ 2016-17లో రూ.9205 కోట్లను, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 7346 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.5,545 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.4348 కోట్ల మేర రుణాలను రాని బాకీలుగా రద్దు చేశాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లో బ్యాంకులు రద్దు చేసిన రుణాల మొత్తం రూ.53,625 కోట్లకు పెరిగింది. ఆర్‌బీఐ వద్ద అందుబాటులో ఉన్న నివేదికల మేరకు గత సెప్టెంబరు ముగింపు నాటికి మొత్తం 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దాదాపు 9 బ్యాంకుల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 15 శాతాన్ని దాటేశాయి. మరోవైపు ఆర్‌బీఐ అంచనాల ప్రకారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తుల విలువ 15 శాతానికి పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. బ్యాంకులు ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న క్రమంలో పీఎస్‌యూ బ్యాంకులకు రానున్న రెండేళ్లలో రూ 2.11 లక్షల కోట్ల మూలధనం సమీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

రెండింతలుకానున్న ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు

అసోచామ్ అధ్యయనంలో వెల్లడి



ఢిల్లీ: భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ 2020 నాటికి రెండంకెల సంఖ్యకు చేరనుందని, టెలిమ్యాటిక్స్ మార్కెట్ కూడా వేగంగా వృద్ధి చేందేలా సంకేతాలు కనిపిస్తున్నాయని అసోచామ్ తన నివేదికలో వెల్లడించింది. భారత్‌లో మొత్తం ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఒక శాతం కన్నా తక్కువగా ఉన్నాయని అసోచామ్ అధ్యయనంలో వెల్లడైంది. ప్రస్తుతం కర్బన ఉద్గారాల విషయంలో ఉన్నటువంటి కఠినమైన నిబంధనలు, వాహనాల బ్యాటరీలపై ధరలు తగ్గించడం, ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన కల్పించడం వల్ల ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయని అసోచామ్ తన అధ్యనంలో వెల్లడించింది. దేశంలో ఎలక్ట్రిక్ వాహన రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలంటే దానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని అసోచామ్ తన అధ్యయనంలో పేర్కొంది. పెరుగుతున్న అవసరాలు దృష్ట్యా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఛార్జింగ్ స్టేషన్లలో ఒకే రకమైన రేటు విధానాన్ని అవలంబించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇంటివద్దనే ఛార్జింగ్ పెట్టుకునే వెసులుబాటు కల్పించేలా వాహనాలను అభివృద్ధి చేయగలిగితే 2030 నాటికి మార్కెట్‌లో 70 శాతం వాటాను సొంతం చేసుకునే అవకాశాలున్నాయని అధ్యయనంలో వెల్లడించింది. బ్యాటరీ రీసైక్లింగ్ మార్కెట్‌కు సంబంధించి ఇప్పటివరకు భారత్‌లో ఎలాంటి విధానాలు లేవని, ఎలక్ట్రిక్ వాహనాల విపణి వృద్ధికి పెట్టుబడులు ఆకర్షించేలా ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందని అసోచామ్ సూచించింది.

విజ్ఞానం

డిఎన్ఏ పరీక్షతో 193 జన్యు వ్యాధుల గుర్తింపు



సాధారణ డిఎన్ఏ పరీక్షతో శాస్త్రజ్ఞులు నవజాత శిశువుల జీన్స్‌లో అనీమియా, ఎపిలెప్సిలతోపాటు జీవక్రియలోపాలున్న 193 రకాల జన్యువ్యాధులను గుర్తించగలిగారు. 'సెమా4 నటాలిస్' అనే పరీక్షతో నిర్వహించే స్ర్కీనింగ్ పరీక్షను ఇంటిలో కూడా చేసుకోవచ్చు. నవజాత శిశువుల లాలాజలాన్ని ఉపయోగించి తల్లిదండ్రులు ఈ పరీక్ష చేయడంతో బిడ్డ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. కొన్నిసార్లు విటమిన్స్ తక్కువై పిల్లలకు ప్రాణాంతకమవచ్చు. ఈ పరీక్షద్వారా సమయానికి ఏ మందులు వాడాలో ముందే జాగ్రత్తగా ఉండటంతో ఎదురయ్యే విషమ పరిస్థితిని అధిగమించే అవకాశం ఉంటుందని అమెరికా కంపెనీ అయిన సెమా4 సిఇఓ. ఎరిక్ వెల్లడించారు. సెమా4 నలాటిస్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలుచేయవచ్చు. పరీక్షలోనే ఫార్మాకొజెనెటిక్ అనాలిసిస్ కూడా ఉంటుంది. దీని ద్వారా సుమారు 38 రకాల మందులకు బిడ్డ ప్రతిస్పందన కూడా తెలుస్తుంది. ఈ విధానంతో సరిపడని మందులను, యాంటిబయాటిక్స్‌ను వాడటం నివారించవచ్చునని తెలుస్తోంది.

భవిష్యత్తులో మంచు యుగం




2050నాటికి సూర్యుని తీవ్రత 7శాతం తగ్గవచ్చునని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. 20ఏళ్ల సూర్యతాపం, డాటా ఆధారంగా రానున్నకాలంలో సూర్యతాపం 7శాతం తగ్గే సూచనలుఉన్నట్లు వెల్లడించారు. సాన్‌డీగాలోని యూనివర్సిటీ ఆఫ్‌కాలిఫోర్నియా అధ్యాపకులు చేపట్టిన ప్రయోగంలో సూర్యని 11ఏళ్ల సైకిల్‌పై పరిశోధనలు చేశారు. 11ఏళ్ల సోలార్ సైకిల్‌లో సూర్యప్రతాపం గరిష్టంగా ,కనిష్టంగా ఉన్న కాలాన్ని పరిశీలించి సూర్య ఉపరితలంపై అయస్కాంతత్వం తగ్గుతుందనీ, మచ్చలు ఏర్పడే అవకాశం ఉందనీ, అల్ట్రావయలెట్ కిరణాల రేడియేషన్ కూడా తగ్గుతుందనీ తెలిపారు. దీన్నిబట్టి చూస్తే సూర్యుని ఉపరితల వేడి కొంత తగ్గుతుందని తెలుస్తోంది. 17వ దశకంలో వాతావరణం మరింత తగ్గుముఖం పట్టడంతో థేమ్స్ నది పూర్తిగా గడ్డకట్టిపోయే పరిస్థితి ఎదురైది. దీన్ని గ్రాండ్ మినిమమ్‌గా చూడవచ్చు. 1968లో బాల్టిక్ సముద్రం కూడా పూర్తిగా ఘనీభవించింద. దీని మని ఐటి ఏజ్‌గా పిలుస్తారు. ఈ బృందానికి సారధ్యం వహిస్తున్న డాన్ లుబిన్ దీనికంటే మరింత దారుణమైన పరిస్థితిని 2050లో చూస్తామని తెలిపారు. 2020నుండి 2070 వరకు 0.25శాతం చల్లబడవచ్చునని అంచనావేసారు.

స్వల్పంగా పెరిగిన బంగారం, వెండి ధరలు



ముంబై: బంగారం ధరలు రూ.50లు పెరిగి 10గ్రామలు రూ.31,250 వద్ద నిలిచింది. వెండి ధర రూ.150లు పెరిగి కేజీ వెండి రూ.39,200కు చేరిందని బులియన్ వర్తకులు వెల్లడించారు. అంతర్జాతీయంగా బంగారానికి డిమాండ్‌పెరగడంతో ధరలు పెరిగినట్లుతెలుస్తోంది. అంతర్జాతీయం సానుకూలత, మదుపరులు వడ్డీరేట్లు పెరుగుతాయామోనన్న ఆందోళనతో బంగారంపై పెట్టుబడులకు ఉత్సాహం చూపినట్లుతెలుస్తోంది. అంతర్జాతీయంగా బంగారం ధరలు0.48శాతం పెరిగి ఔన్స్ 1322 దాలర్లకు చేరింది. వెండి ధరలు 0.58శాతం పెరిగి ఔన్స్ 16.43 దాలర్లకు చేరింది.

15పైసలు పుంజుకున్న రూపాయి



ముంబై: డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకపు విలువ సోమవారం పుంజుకుంది. ఇతర ఆసియా దేశాల కరెన్సీలన్నీ లాభాల్లోనే నమోదయ్యాయి. 15పైసలు పుంజు కుని 64.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ ఇతర దేశాల కరెన్సీలతో చూసుకుంటే నష్టాల్లో ముగిసింది. శుక్రవారం రూపాయి 14పైసలు నష్టపోయి సుమారు రెండు నెలల కనిష్టానికి దిగజారింది. ఈ ఏడాది ఇప్పటివరకు రూపాయి 0.69శాతం నష్టపోయింది. విదేశీ మదుపరులు 1.48 బిలియన్లు, ఈక్విటీ, డెట్‌లో 2.06 బిలియన్లు కొనుగోళ్లు చేసారు. కన్సూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ), ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (ఐఐపి) గణాంకాలు వెలువడనున్నాయి. దక్షిణ కొరియా కాస్పి 0.698శాతం, జపాన్ యెన్ 0.221శాతం, థాయ్ బాత్ 0.129శాతం, సింగపూర్ డాలర్ 0.446శాతం,చైనా రెన్మింబి 0.427 శాతం, ఇండోనేషియా రూపయ్య 0.139 శాతం, తైవాన్ డాలర్ 0.131శాతం, హాంగ్‌కాంగ్ డాలర్ 0.017శాతం మలేషియా రింగ్గిట్ 0.005శాతం కోలుకున్నాయి. ఇతర కరెన్సీలతో డాలర్ 90.225 వద్ద ట్రేడ్‌అయింది.

మార్కెట్ నష్టాలకు బ్రేక్

294పాయింట్ల లాభంతో సెన్సెక్స్

లాభాల్లో రియాల్టీ, ఫార్మా, మెటల్స్



ముంబై : మార్కెట్లు రికార్డు సృష్టించి, మళ్లీ నష్టాల్లోకి దిగజారి ఈ విధంగా గతకొన్ని రోజులగా లాభాలు,నష్టాలతో ఊగిసలాడిన మార్కెట్లు సోమవారం కాస్త బ్రేక్ పడినట్లయింది. మదుపర్ల కొనుగోళ్లతో వారం ప్రారంభం లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ దాదాపు 294పాయింట్లు లాభపడి అత్యధికంగా 34,300.47 పాయింట్లువద్ద ముగిసింది. నిఫ్టా 84.80 పాయింట్ల ఆధిక్యతతో 10,539.75 వద్ద ముగిసింది. బిఎస్ఇ మిడ్‌కాప్, స్మాల్‌కాప 1.31శాతం పెరిగింది. బిఎస్ఇలోని సెక్టరల్ సూచీలన్నీ ఐటి,టెక్ మినహాయించి విద్యుత్తు, రియాల్టీ, యుటిలిటీస్, క్యాపిటల్ గూడ్స్ 1.44శాతం లాభాల్లోనే ముగిశాయి. టాటాస్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, యస్‌బ్యాంకు, పవర్‌గ్రిడ్, అత్యధిక లాభాలను నమోదుచేయగా, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, ఎమ్‌అండ్ ఎమ్, ఐటిసి నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లోనే నమోదయ్యాయి. సోమవారం ఇన్‌ఫ్లేషన్ డాటా, డొమెస్టిక్ ఫండ్ ప్రకటించనున్నాయి. ప్రధాన లబ్దిదారులుగా ఓఎన్‌జిసి, టాటాస్టీల్, సన్‌ఫార్మా, భారతి ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్సు, హీరో మోటా కార్ప్, యాక్సిస్ బ్యాంకు ఉన్నాయి. ఎల్ అండ్ టి ఆబుదాబి ఆధారిత అల్ థర్బా పెట్రోలియం ఆపరేషన్స్ కంపెనీ నుండి ఆర్డర్లు రావడంతో 1శాతం పెరిగింది. ఎస్‌బీఐ క్వార్టర్లీ ఫలితాలు నిరాశగా ఉండడంతో 2.85శాతం నష్టాల్లో ముగిసింది. ఇతర ఆసియా మార్కెట్ల విషయానికొస్తే దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు నిలకడగా కొనుగోలుచేసినట్లు బ్రోకర్లు అభిప్రాయ పడుతున్నారు. దేశీయ మదుపరులు రూ.588.42 కోట్లు షేర్లను కొనుగోలు చేయగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.1351.70 కోట్ల విలువగల షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. ఎస్ అండ్ పి బిఎస్ఇ స్మాల్ కాప్ ఇండెక్స్ 1.6శాతం పెరిగింది. మిడ్‌కాప్‌లో అమరరాజా బ్యాటరీస్, వొకరాంజీ, ఎమ్‌ఆర్‌ఎఫ్,టాటా గ్లోబల్, ఐజిఎల్ ప్రధానలబ్దిదారులుగా ఉన్నారు. ముడి చమురు ధరలు ఆరు రోజుల అనంతరం పెరిగాయి.

అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియా దేశాలకు చెంది హాంగ్ కాంగ్ హాంగ్‌సెంగ్ 0.64శాతం పెరిగింది. షాంఘై కాంపో జిట్ ఇండెక్స్ 0.39శాతం పెరిగింది. అమెరికా డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావ రేజ్ 1.38శాతంతో ముగిసింది జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు 0.8శాతం పెరగగా గత వారం 7.3శాతం నష్టపోయాయి. దక్షిణకొరియా, చైనా 0.8శాతం లాభపడ్డాయి. జపాన్ నిక్కీ సోమవారం సెలవు ప్రకటించింది. దేశీయ ఈక్విటీ, కమాడిటీ, ఫారెక్స్ మార్కెట్ మంగళవారం శివరాత్ర సందర్భంగా సెలవు ప్రకటించాయి.

భారత్‌లోకి యాపిల్ ఐమ్యాక్ ప్రో



శాన్‌ఫ్రాన్సిస్‌కో: అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ యాపిల్ కొత్త మ్యాక్‌ను భారత మార్కెట్ లోకి అందుబాటులోకి తీసుకొస్తోంది. ఐమ్యాక్ ప్రో పేరుతో విడుదల చేసిన ఈ మ్యాక్‌ను యాపిల్ గత ఏడాది డబ్ల్యూ డబ్ల్యూడీసీలో తొలిసారి ప్రదర్శించింది. అమెరికా సహా మరికొన్ని దేశాల్లో గత డిసెంబరులోనే అమ్మకాలు ప్రారంభిం చింది. త్వరలో దీన్ని భారత్‌లో అందు బాటులోకి తెస్తున్నట్లు తెలుస్తోంది. యాపిల్ సంస్థకు చెందిన అధికారిక రిటైల్ స్టోర్లకు ఐమ్యాక్ ప్రో స్టాక్ అందుతున్నట్లు సమాచారం. ఈ వారం చివర్లో అమ్మకాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఐ మ్యాక్ ప్రోలో 8-కోర్ వేరియంట్ మాత్రమే భారత్‌లో అందుబాటులోకి రానుంది. దీని ధర రూ.4,15,000. ఇందులో 8-కోర్ 3.2గిగాహెడ్జ్ ప్రాసెసర్, 27 అంగుళాల 5కే తెర, 32జీబీ డీడీఆర్4 ర్యామ్, 8జీబీ విర్యామ్‌తో పాటు రేడియాన్ ప్రో వెగా 56గ్రాఫిక్స్ కార్డులు ఉన్నాయి.

ఎస్‌బీఐకి మొండి బకాయిల దెబ్బ

పతనమవుతున్న బ్యాంకు షేర్లు

State Bank of India
THE BANKER TO EVERY INDIAN

ఢిల్లీ: దేశీయ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను మొండి బకాయిలు దెబ్బతీస్తున్నాయి. ఈ బ్యాంకుకు భారీ స్థాయిలో మొండి బకాయిలు ఉన్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెప్పడంతో గత శుక్రవారం వెలువడిన మూడో త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ. 1886.57 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. దీంతో ఈ ప్రభావం ఆ సంస్థ షేర్లపైనా పడింది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఎస్‌బీఐ షేర్లు పతనమవుతున్నాయి. ఆరంభ ట్రేడింగ్‌లో భారీగా 6 శాతం వరకు పడిపోయిన షేరు విలువ.. ప్రస్తుతం కాస్త మెరుగుపడింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఎస్‌బీఐ షేరు విలువ 2.11శాతం పడిపోయి రూ. 290.10గా ఉంది. అటు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ ఎన్ఎస్ఈ లోనూ 2.14శాతం పడిపోయి షేరు ధర రూ.290.05గా కొనసాగుతోంది. ఎస్‌బీఐ మూడో త్రైమాసికం ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ త్రైమాసికంలో స్థూల నిరర్థక ఆస్తులు 10.35శాతానికి పెరిగాయి. 2016 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఇవి 7.23శాతంగానే ఉండటం గమనార్హం.

డిసెంబరు ఫలితాల్లో ఓఎన్‌జిసి 3శాతం పెంపు

డిసెంబరు త్రైమాసిక ఫలితాల్లో ఓఎన్‌జిసి బిఎస్ఇ ట్రేడింగ్ 3శాతంతో రూ.195లకు చేరింది. డిసెంబరు 2017కు ముగిసిన త్రైమాసిక ఫలితాల్లో గ్యాస్ వాల్యూమ్ మరియు చమురు రియలైజేషన్, పనితీరు సామర్థ్యం పెరిగి నట్లు తెలుస్తోంది. క్యూ3లో 15శాతం పెరిగి 44 బిలియన్ల నుండి రూ.50 బిలియన్లకు చేరింది. 2015 తరువాతం ఓఎన్‌జిసి 3శాతం లాభాలనునమోదు చయడం ఇదే...ఓఎన్‌జిసి నికరలాభం 2017 3వ త్రైమాసికంలో 15.2 శాతం పెరిగి రూ.50.15 బిలియన్లకు చేరుకోగా గత ఏడాది ఇదే కాలానికి రూ.43.52 బిలియన్లుగా నమోదైంది. కంపెనీ రెవెన్యూ 14.9శాతం పెరగి రూ.230 బిలియన్లకు చేరింది.

ప్రపంచ సంపన్న నగరాల్లో ముంబైకి 12వ ర్యాంకు

- మొత్తం సంపద 950 బిలియన్ డాలర్లు
- అగ్రస్థానంలో న్యూయార్క్ ఆ తర్వాత లండన్



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక రాజధాని ముంబై ప్రపంచంలోని అత్యంత సంపన్నవంతమైన 15 నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాలోని మహా నగరాల్లో ఒకటైన న్యూయార్క్ మొత్తం 3 ట్రిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలువగా.. ముంబై 950 బిలియన్ డాలర్ల సంపదతో 12వ స్థానాన్ని దక్కించుకున్నదని, ఆ తర్వాత టొరంటో (944 బిలియన్ డాలర్ల సంపదతో 13వ స్థానం), ఫ్రాంక్‌ఫర్ట్ (912 బిలియన్ డాలర్లతో 14వ స్థానం), పారిస్ (860 బిలియన్ డాలర్లతో 15వ స్థానం) ఉన్నాయని న్యూ వరల్డ్ వెల్త్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ జాబితాలో న్యూయార్క్ తర్వాత లండన్ 2.7 ట్రిలియన్ డాలర్ల సంపదతో ద్వితీయ స్థానాన్ని, జపాన్ రాజధాని టోక్యో 2.5 ట్రిలియన్ డాలర్ల సంపదతో తృతీయ స్థానాన్ని ఆక్రమించగా, ఆ తర్వాతి స్థానాల్లో శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియా (2.3 ట్రిలియన్ డాలర్లు), చైనా వాణిజ్య రాజధాని షాంఘై (2 ట్రలియన్ డాలర్లు), లాస్ ఏంజెల్స్ (1.4 ట్రిలియన్ డాలర్లు), హాంకాంగ్ (1.3 ట్రిలియన్ డాలర్లు), సిడ్నీ (1 ట్రిలియన్ డాలర్లు), సింగపూర్ (1 ట్రలియన్ డాలర్లు), చికాకో (988 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. ఆయా నగరాల్లోని ప్రజల వద్ద ఉన్న వ్యక్తిగత సంపదను ఆధారంగా చేసుకుని న్యూ వరల్డ్ వెల్త్ ఈ నివేదికను రూపొందించింది. బిలియనీర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న టాప్-10 నగరాల్లో కూడా ముంబైకి చోటు లభించిందని, 100 కోట్ల డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ నికర ఆస్తులను కలిగిన బిలియనీర్లు ముంబైలో 28 మంది ఉన్నారని న్యూ వరల్డ్ వెల్త్ పేర్కొన్నది. సంపద వృద్ధి పరంగా రానున్న 10 ఏండ్లలో ముంబై ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతున్న నగరంగా ఆవిర్భవిస్తుందని భావిస్తున్నట్లు తెలిపింది.

ఇక ట్విటర్‌లో జీఎస్టీ సందేహాల నివృత్తి

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు చేసినప్పటినుంచి పన్ను చెల్లింపుదారులు, చిన్న వ్యాపారులకు రిటర్నులు ఎలా దాఖలు చేయాలనే విషయంలో అనేక సందేహాలు ఇప్పటికీ ఉన్నాయి. సామాజిక మాధ్యమమైన ట్విటర్ ద్వారా జీఎస్టీకి సంబంధిచిన సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ఆర్థిక శాఖ నూతన పద్ధతిని ఆవిష్కరించింది. దీనికి గాను ఆర్థిక శాఖలోకి ఎనిమిది మంది అసిస్టెంట్ కమిషనర్లను నియమించినట్లు ఆర్థిక శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జీఎస్టీకి సంబంధించి ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్నా ట్విటర్ లేదా ఈమెయిల్ ద్వారా ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన వారి సందేహాలను నివృత్తి చేయడమే వీరి ప్రధాన బాధ్యత. వీరిలో రాజ్ కరణ్ అగర్వాల్, రజినీ శర్మ, రౌనక్ జమీల్ అన్సారీ, శాంతను, బుల్లో మము, హీరాలాల్, మనీష్ చౌదరి, అనిష్కా అగర్వాల్ ఈ జాబితాలో ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వస్తు సేవల పన్నుకు సంబంధించి ఎన్నో సందేహాలను అడుగుతున్న నేపథ్యంలో ఎనిమిది మంది అసిస్టెంట్ కమిషనర్లతో నూతన పద్ధతిని ఆవిష్కరించినట్లు ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) 2017, జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే.

ప్యాసింజర్ వాహనాల విక్రయాలు పెరిగాయ్

గ్రేటర్ నోయిడా: ఈ ఏడాది జనవరిలో దేశీయ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు 7.57శాతం వృద్ధి నమోదు చేశాయి. గతేడాది జనవరిలో 2,65,389 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించగా.. ఈసారి ఆ సంఖ్య 2,85,477 యూనిట్లకు పెరిగింది. ఈ మేరకు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్(సియామ్) వెల్లడించింది. అయితే గత నెలలో కార్ల అమ్మకాలు మాత్రం కాస్త తగ్గాయి. గతేడాది జనవరిలో 1,86,596 యూనిట్ల కార్లను విక్రయించగా.. ఈసారి ఆ సంఖ్య 1,84, 264 యూనిట్లకు తగ్గినట్లు సియామ్ పేర్కొంది. ఇక ద్విచక్ర వాహనాల అమ్మకాలు 28.64 శాతం పెరిగి 10,54,062 యూనిట్లు విక్రయమయ్యాయి. కమర్షియల్ వాహనాల అమ్మకాలు కూడా 39.73శాతం పెరిగాయి. ఈ ఏడాది జనవరిలో 85,660 యూనిట్ల కమర్షియల్ వాహనాలను విక్రయించారు.

అడవులపై ప్రభావం చూపుతున్న వాతావరణ మార్పులు



వాతావరణ మార్పుల మూలంగా పరిసరాలలో కాలుష్యం ఎక్కువైపోతోంది. అడవులు దేశానికి సహజ వనరులు ఒక దేశం యొక్క ఆదాయం అడవుల మీద ఆధారపడి ఉందని చెబుతారు. ఆ అడవులు వాతావరణ మార్పులకు లోనయ్యి వాటిలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వర్షాలకు దోహదం చేసే చిత్తడి నేలలు ఉన్న అటవీ ప్రాంతాలు దెబ్బతింటున్నాయి. వీటిలో ముఖ్యంగా అమెజాన్ అడవులు, పశ్చిమబెంగాల్‌లోని సుందర్బన్స్ అడవులు, కేరళలోని సైలంట్ వ్యాలీ, పెరూలో హురంగో అడవులు తదితర అనేక అటవీ ప్రాంతాలు తరిగిపోతున్నాయి.

ఒక మాదిరిగా ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ అమెజాన్ రెయిన్ ఫారెస్ట్‌లో (వర్షసహిత అడవులు) గల చెట్లలో మూడవ వంతు విధ్వంసమయ్యే ప్రమాదముందని బ్రిటన్ వాతావరణ నిపుణులు జరిపిన పరిశోధనలో వెల్లడయింది. ఎందుకంటే చెట్లు కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. చెట్లు లేనప్పుడు కార్బన్ డై ఆక్సైడ్ అంతా వాతావరణంలోకి చేరుతుంది. అమెజాన్ అడవుల్లో ఉష్ణోగ్రతలు 3 సెల్సియస్ డిగ్రీలు కనుక పెరిగినట్లయితే 75శాతం, 4 సెల్సియస్ డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగితే 85శాతం అడవి అంతరించిపోతుంది. రెండు సెల్సియస్ డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగినట్లయితే రానున్న శతాబ్ది కాలంలో 40శాతం మేర అమెజాన్ అడవులు అంతరించిపోతాయని బ్రిటన్ శాస్త్రవేత్తలు నేచర్ జియోసైన్స్ పత్రికలో తమ అంచనాలను రాశారు. వీరు తమ అంచనాలను కోపెన్‌హెగెన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో సైతం సమర్పించారు.





విధ్వంసమయ్యే అటవీ ప్రాంతాలను తిరిగి పునరుద్ధరించే అవకాశం ఉండదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాలు ఎక్కువగా అంతరించిపోతే భూమండలంపై ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వారు తెలియజేశారు. ఒకవేళ సైబీరియా లాంటి దేశాలలో చెట్లను పెంచినప్పటికీ అమెజాన్ అటవీ ప్రాంతంలో జరిగిన నష్టాన్ని పూడ్చలేమని వారు తెలిపారు. 2015 నాటికి అమెజాన్ అడవులలో పరిస్థితి చాలా వేగంగా మారిపోతుందని వారు అంచనా వేశారు. అడవులలో కార్బన్ డై ఆక్సైడ్ నిల్వలు తగ్గి పోయి ప్రకృతిలో సమతుల్యం దెబ్బతిన్నట్లయితే వర్షాలు తగ్గిపోతాయి. దీంతో ఆహారధాన్యాలే కాక అన్ని రకాల వస్తువులు, సేవలు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండవు.

భారతదేశంలోని వెస్టన్ ఘాట్స్, ఈశాన్య ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల అడవులకు ముప్పు కలుగుతుంది. ఫలితంగా జీవవైవిధ్యం దెబ్బతింటుంది. పక్షులు, జంతువులు అనేకం అంతరించి పోతాయి. కేరళలోని సైలంట్‌వ్యాలీ అడవులు విశిష్టమైనవి. వీటిని కాపాడుకునేందుకు 1970, 1980 దశకాలలో పోరాటాలుచేశారు కూడా. అలాగే, దక్షిణ ప్రాంతంలో నీలగిరి కొండలు, ఈస్టన్, వెస్టన్ ఘాట్స్ మైదాన ప్రాంతాలు, మలబార్ కోస్తా తీర ప్రాంతం తదితర అనేక ప్రాంతాలలో అడవులకు వాతావరణ మార్పులు ముప్పు కలిగిస్తున్నాయి. సైలంట్ వ్యాలీకి కలుగుతున్న ముప్పునకు వ్యతిరేకంగాపోరాటం చేసినప్పుడు 1984లో అనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కల్పించుకుని సైలంట్ వ్యాలీలో జాతీయ పార్కును ఏర్పాటుచేశారు. 50 మిలియన్ సంవత్సరాలుగా ఉందని భావిస్తున్న సైలంట్‌వ్యాలీని కాపాడు కోవడం ఎంతైనా అవసరమని వాతావరణ శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. పెరూలోని హురంగో అటవీప్రాంతం చాలా చిన్న ప్రాం తం. దేశంలోని ఇకా నగరానికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతం ప్రకృతిఅందానికి ప్రతిరూపం గాఉంటుంది. 2వేల సంవత్స రాలుగా నజ్కా సంస్కృతి ఈ ప్రాంతంలో విలసిల్లుతుందని, ఇక్కడి చెట్లు స్థానిక ప్రజలకు ఆహారాన్ని, వెదురును అందజేస్తూ వారి జీవనానికి తోడ్పడుతు న్నాయి. ఖనిజసంపద వెలికితీయ డానికి భారీ ప్రాజెక్టుల కోసం అడవులలో నివసిస్తున్న గిరిజను లను ఖాళీచేయించి చెట్లు కొట్టివేస్తున్నారు. దీనివల్ల అడవులు నిర్మూలన అవుతాయి. ఫలితంగా కర్బనపువాయువులు ఎక్కువగా వాతావరణంలోకి విడుదలై పేరుకుపోయి వేడెక్కడానికి దోహదం చేస్తాయి. గిరిజనులు తమ జీవనాధారం కోల్పోతారు. ఫలితంగా బతుకు జీవనం కోసం వలసలు వెళ్ళిపోతారు.

కదిలే ఎడారి



ఎడారి కదులుతుందా! అంటే మీకేమైనా మతితప్పిందా ఎడారి కదలటం ఏమిటి అనుకుంటున్నారా! ఇళ్ళు కదులుతాయి. అంటే మొబైల్ ఇళ్ళు, అలాగే తేలియాడే ఇళ్ళు వీటి గురించి విన్నాం. చదివాం. కానీ ఎడారి కదలదు అని చెబుతాం. కానీ కదిలే ఎడారి ఒకటి ఉంది అని అంటున్నారు. కొంత ఆశ్చర్యమే అయినా ఇది మాత్రం నిజం అంటున్నారు నిపుణులు. అయితే ఈ ఎడారి ఎక్కడ ఉందా అని ఆరాతీస్తే, ఫ్రాన్స్‌లో అట్లాంటిక్ మహాసముద్రపు ఆర్కచూన్ తీరంలో ఉంది. దీనిపేరు "గ్రేట్‌డ్యూన్ ఆఫ్ పైలా". ఇది ఒక చిత్రమైన ఎడారి. కదిలే ఎడారి. ఎడారి అంటే సహారా, థార్ ఎడారుల్లాగా పెద్దగా ఉంటుందని అనుకోకండి. ఇది ఓ చిన్న ఎడారి. 500మీటర్ల వెడల్పు, 3కి.మీ పొడవుతో ఉండే పెద్ద ఇసుకదిబ్బను తలపిస్తుంది. అందుకే ఎడారి అని పిలుస్తారు. ఇక ఈ ఎడారి నిదానంగా పక్కకు కదులుతోందట. దీని కదలికలు ఒక్కోసారి సంవత్సరానికి 10మీటర్ల వరకు ఉంటున్నాయి. ఈ ఎడారి సముద్ర మట్టానికి 107మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఐరోపాలోనే ఇది అత్యంత ఎత్తయిన ఇసుకదిబ్బ అని చెబుతున్నారు. దీనికి 'డ్యూన్ ఆఫ్ పైలట్' అనే మరో పేరు ఉంది. ఈ ప్రాంతాన్ని చూడ్డానికి ఏటా ఎంతోమంది సందర్శకులు వస్తున్నారు. 57సంవత్సరాలలో ఏడాదికి దాదాపు 5మీటర్లు కదులుతూ మొత్తం 280 మీటర్లు ముందుకు వచ్చింది. ఇలా ముందుకు రావడంలో అక్కడున్న కొన్ని ఇళ్ళు, చెట్లు ఇసుకతో కప్పబడిపోయాయి. అయితే ఇసుక దిబ్బకు ఒక వైపు పైన్ చెట్లు అడవి ఉంది. అటువైపు కూడా ఇది జరిగిపోతుంది. అలా అలా ఆ చెట్లవైపు ఏటా 8000 చ.మీ వరకు విస్తరించి ఉంది.

అసలు ఈ ఎడారిలో కదలికలు ఎలా వస్తున్నాయి అని ఆరాతీస్తే దీని కారణం వేగంగా వీచే సముద్ర గాలులే అని తెలిసింది. ఆ గాలుల ప్రభావంతో ఎడారిలో చలనం, ఆకారం మారుతూ వస్తోందని అంటారు. దీంతో సముద్రం వైపు ఈ ఇసుక ఎడారి వాలులు చూస్తే చాలా గమ్మత్తుగా ఉంటాయి. సందర్శకులు ఆ వాలుపైకి ఎక్కుతూ తమ సరదా తీర్చుకుంటారు. సందర్శకులు ఎటువంటి ప్రయాస లేకుండా ఎత్తయిన ఇసుక దిబ్బ ఎక్కడానికి మెట్లదారిని కూడా అక్కడి ప్రభుత్వం వారు ఏర్పాటు చేశారు. మొదటిసారిగా 1987లో ఈ ఇసుక దిబ్బ కదలడం మొదలుపెట్టింది. మరల 1991సంవత్సరంలో ఇసుకదిబ్బ ఓ రహదారి మొత్తాన్ని కప్పేసింది. అలాఅలా ఇది కదులుతూ వస్తోంది. ఇదండీ! ఎడారి కదలికలోని విశేషం.

చరణ్ స్టెప్పులు అదరగొట్టాడు



రామ్‌చరణ్ 'రంగస్థలం' సినిమాలోని ప్రత్యేక గీతంలో స్టెప్పులు అదరగొట్టారని జానీ మాస్టర్ అన్నారు. చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. సమంత కథానాయిక. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. పూజాహెగ్డే సినిమాలోని ప్రత్యేకగీతంలో ఆడిపాడారు. ఈ పాట చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. 'జిల్ జిల్ జిగేల్' అని సాగే ఈ పాటకు జానీ మాస్టర్ నృత్య రీతులను సమకూర్చారు. ఈ సందర్భంగా జానీ ట్వీట్ చేశారు. చరణ్‌తో కలిసి దిగిన ఫొటోను అభిమానులతో పంచుకున్నారు. 'ఎప్పటిలాగే మెగా పవర్‌స్టార్ పాటకు అద్భుతంగా డ్యాన్స్ చేశారు. ఆయన అంకితభావం చూసి ఆశ్చర్యపోయా. 'రంగస్థలం' సినిమా కోసం పనిచేసే అవకాశం ఇచ్చిన మైత్రీ మూవీ మేకర్స్‌కు, ప్రత్యేకించి రామ్‌చరణ్, సుకుమార్, రత్నవేలు, పూజాహెగ్డే, దర్శకత్వ బృందానికి కృతజ్ఞతలు' అని జానీ ట్వీట్ చేశారు. దేవిశ్రీ ప్రసాద్ 'రంగస్థలం' చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. జగపతిబాబు, అనసూయ, ఆదిపినిశెట్టి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ పూర్తైంది. మార్చి 30న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

గుర్రం కోసం సల్మాన్ భారీ ఆఫర్



సల్మాన్ ఖాన్ బాలీవుడ్‌లో అగ్ర కథానాయకుడిగా ఎదిగారు. బీ-టౌన్‌లో ఆయన్ను కాదనేవారు లేరనడంలో ఆశ్చర్యం లేదు. అయితే ఆయన కోరింది ఇవ్వడానికి ఓ వ్యక్తి నిరాకరించారు. సల్మాన్‌కు గుర్రాలంటే చాలా ఇష్టం. ఈ మధ్య ఆయన అత్యంత మేలు రకమైన 'సఖిబ్' జాతికి చెందిన గుర్రాన్ని కొనాలనుకున్నారు. ఈ జాతి గుర్రాన్ని మనదేశంలో అహ్మదాబాద్‌కు చెందిన సిరజ్ ఖాన్ అనే వ్యక్తి పెంచుతున్నారు. సల్మాన్ రూ.2 కోట్లు ఆఫర్ చేసి, ఆ గుర్రాన్ని తనకు అమ్మమని కోరారట. అయితే ఆ యజమాని సల్లూభాయ్‌కు అమ్మడానికి ఒప్పుకోలేదని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పుడు ఇది హాట్‌టాపిక్‌గా మారింది. సల్మాన్ దగ్గర ఇప్పటికే చాలా గుర్రాలున్నాయి. వాటిని ఆయన తన ఫాంహౌస్‌లో ఉంచారు. 'సఖిబ్' జాతి గుర్రాలు చాలా అరుదుగా ఉంటాయి. వీటికి డిమాండ్ చాలా ఎక్కువ. ఇలాంటి జాతి గుర్రాలు కేవలం అమెరికా, కెనడాల్లో మాత్రమే దొరుకుతాయట. ఈ గుర్రం గంటకు 43 కిలోమీటర్ల వేగంతో పరుగెడుతుంది. ఈ గుర్రాన్ని సిరజ్ రాజస్థాన్ సంతలో కొన్నారు. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్ కూడా ఈ గుర్రాన్ని సొంతం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. సిరజ్‌కు ఆయన రూ.1.11 కోట్లు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. సల్మాన్ 'టైగర్ జిందా హై'తో ఇటీవల హిట్ అందుకున్నారు. కత్రినా కైఫ్ కథానాయికగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద దేశవ్యాప్తంగా రూ.350 కోట్లు వసూలు చేసినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. సల్మాన్ ప్రస్తుతం తన తర్వాతి చిత్రం చిత్రీకరణ కోసం సిద్ధమౌతున్నారు.

ప్రేమకథలకు అభిమానిని కాదు కానీ..

రాజమౌళి సినిమా అంటేనే భారీదనం. ఆయన చిత్రాల్లో పోరాట ఘట్టాలు, భావోద్వేగ సన్నివేశాలు చూస్తే రోమాలు నిక్కపొడవాల్సిందే. ప్రతీ చిత్రాన్ని అద్భుత దృశ్య కావ్యంగా మలచడంలో ఆయన దిట్ట. అందుకే రాజమౌళిని అభిమానంగా జక్కన్న అని పిలుస్తారు. ఆయన ఇప్పటి వరకూ ఒక్క ప్రేమకథా చిత్రాన్ని కూడా తీయలేదు. అదే విషయాన్ని చెబుతూ.. తాను ప్రేమ కథలకు అభిమానిని కాదు కానీ, 'తొలిప్రేమ' చిత్రాన్ని మాత్రం ఇప్పటికీ ఆస్వాదిస్తున్నానని అంటున్నారు. వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా, వెంకీ అట్లూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. ఫీల్‌గుడ్ లవ్ మూవీగా యువతను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఈ సినిమాను చూసిన రాజమౌళి చిత్ర బృందాన్ని అభినందించారు. 'ప్రేమ కథలకు నేను అభిమానిని కాదు. కానీ, 'తొలిప్రేమ' చిత్రాన్ని ఆస్వాదిస్తున్నా. వెంకీ తన తొలి చిత్రమే చాలా చక్కగా తీశాడు. వరుణ్‌తేజ్ మరో మెట్టు ఎక్కాడు. అతని బలం పెరిగింది. రాశీఖన్నా అందంగా ఉంది. అంతేకాదు ఆమె అభినయం కూడా బాగుంది. ప్రసాద్‌గారు, బాపిలకు శుభాకాంక్షలు. మంచి నిర్మాణ విలువలతో తీసి, విజయానికి అన్ని విధాల అర్హత ఉందని నిరూపించారు.' అని ట్వీట్ చేశారు. 'బాహుబలి' చిత్రాల విజయం తర్వాత రాజమౌళి తన తర్వాతి ప్రాజెక్టుపై కసరత్తులు ప్రారంభించారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా ఓ చిత్రాన్ని తెరకెక్కించే పనిలో ఉన్నారు. వీరితో పాటు మరో హీరో కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని సమాచారం. విజయేంద్ర ప్రసాద్ దీనికి కథను సిద్ధం చేస్తున్నారు.

నాగశౌర్య వరుస సినిమాలు..!



హీరోగానే కాదు నిర్మాతగా కూడా తొలి సక్సెస్ అందుకున్నాడు నాగశౌర్య. ఐరా క్రియేషన్స్‌పై నాగశౌర్య హీరోగా నటిస్తూ, నిర్మించిన చిత్రం "ఛలో" బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్‌ను అందుకుంది. తదుపరిగా నాగశౌర్య రెండు సినిమాలను లైన్‌లో పెట్టున్నాడు. అందులో ఒకటి సినిమాటోగ్రాఫర్ సాయిశ్రీరామ్ దర్శకత్వంలో ఒకటి.. కాగా శ్రీనివాస్ అనే డెబ్యూ డైరెక్టర్‌తో "నర్తనశాల" సినిమా రెండోది. ఈ రెండు సినిమాలు తర్వాత నాగశౌర్య మూడో సినిమా చేయడానికి కూడా సిద్ధమవుతున్నాడని టాక్. వివరాల్లోకెళ్తే.. 15 ఏళ్ల క్రితం తరుణ్, ఆర్తి అగర్వాల్ జంటగా వచ్చిన "నువ్వు లేక నేను లేను" వంటి సక్సెస్ చిత్రాన్ని తెరెక్కించిన దర్శకుడు కాశీ విశ్వనాథ్ అందరికీ సుపరిచితులే. ఈయన దర్శకుడిగా కంటే నటుడిగా ఫుల్ బిజీగా రాణిస్తున్నారు. ఇన్నేళ్ల తర్వాత కాశీ విశ్వనాథ్ మళ్లీ మెగాఫోన్ పట్టనున్నారట. ఈ సినిమాకు మహేష్ బాబు "దూకుడు"లోని 'గురువారం మార్చి ఒకటి..' అనే పాటలో ..గురువారం మార్చి ఒకటి..అనే టైటిల్ పరిశీలనలో ఉంది. అయితే శౌర్య పై రెండు సినిమాలు పూర్తయిన తర్వాతే ఈ సినిమా ట్రాక్ ఎక్కుతుందట మరి.

విశాలాంధ్ర సినిమా

హైదరాబాద్‌లో మహేష్ మూవీ షూటింగ్

సూపర్ స్టార్ మహేష్, కొరటాల శివ కాంబినేషన్‌లో "శ్రీమంతుడు" సినిమా తర్వాత రూపొందుతోన్న చిత్రం "భరత్ అనే నేను". డి.వి.వి.దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సీన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. తాజా షెడ్యూల్‌లో హీరో మహేష్, హీరోయిన్ కైరా అద్వానిపై ఓ సాంగ్‌ను చిత్రీకరించాల్సి ఉందట. ప్యాచ్ వర్క్ సహా సినిమాను మార్చి 27కంతా పూర్తి చేసేస్తారట. నిర్మాణాంతర కార్యక్రమాలను పూర్తి చేసేసి సినిమాను ఏప్రిల్ 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తమిళ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి టాలీవుడ్ రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు.





నిఖిల్ సరసన మేఘా ఆకాష్?

యంగ్ హీరో నిఖిల్ ప్రస్తుతం కన్నడ చిత్రం 'కిరిక్ పార్టీ'ని తెలుగులో 'కిరాక్ పార్టీ'గా రీమేక్ చేస్తున్నాడు. ఈ చిత్రం ఇది వరకే విడుదలవ్వాల్సి ఉండగా పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు పెండింగ్ ఉండటంతో వాయిదాపడింది. దీని తర్వాత ఆయన మరొక రీమేక్ చేయనున్నాడు. అదే అత్రవా నటించిన 'కనితన్'. త్వరలో ఈ రీమేక్ పట్టాలెక్కనుంది. ముందుగా ఈ చిత్రంలో ఒరిజినల్ వెర్షన్లో నటించిన క్యాథరిన్ థ్రెస హీరోయిన్‌గా నటిస్తుందని వార్తలు రాగా ఆమె వాటిని ఖండించింది. ఇప్పుడు తాజాగా 'లై' ఫేమ్ మేఘా ఆకాష్ ఈ చిత్రంలో నటిస్తుందని అంటున్నారు. మరి ఈ వార్తలో ఎంతవరకు వాస్తవముందో తేలాలంటే అధికారిక ప్రకటన ఇచ్చే వరకు ఆగాలి. ప్రముఖ నిర్మాత ఠాగూర్ మధు ఈ సినిమాను నిర్మించనున్నారట.

శర్వానంద్‌కి జతగా కళ్యాణి ప్రియదర్శన్

శర్వానంద్ సుధీర్ వర్మ సినిమా ఫాస్ట్ పేజ్‌లో ప్రీ ప్రొడక్షన్ జరుపుకుంటోంది. గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్‌లో హై ఎండ్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో శర్వా సరసన చాన్స్ కొట్టేసింది కళ్యాణి ప్రియదర్శన్. అఖిల్ 'హలో' సినిమాతో యూత్‌లో క్రేజ్ క్రియేట్ చేసుకున్న కళ్యాణి, ఈ సినిమాతో మరింత బిజీ కానుంది. డిఫరెంట్ ఎంటర్ టైనర్స్‌తో కరియర్‌ని ప్లాన్ చేసుకున్న శర్వానంద్‌ని ఈ సినిమాలో మరింత కొత్తగా ప్రెజెంట్ చేసే ప్రిపరేషన్స్‌లో ఉన్నాడు సుధీర్ వర్మ. ప్రస్తుతం కోల్‌కతాలో హను రాఘవపూడి సినిమాతో సెట్స్‌పై ఉన్న శర్వా, ఈ సినిమాకి ప్యాకప్ చెప్పే చెప్పగానే సుధీర్ వర్మ సినిమాతో సెట్స్ పైకి వచ్చేస్తాడు.



దేశంలో ఒక శాతం పెరిగిన అటవీ విస్తీర్ణం

న్యూఢిల్లీ : దేశంలో ఒకశాతం అటవీ విస్తీర్ణం పెరిగిందని భారతీయ అటవీశాఖ తన నివేదికలో పేర్కొంది. 2015తో పోల్చి చూస్తే అడవులు, చెట్లు పెరిగాయని, దట్టమైన అటవీ ప్రాంతం 1.36 శాత పెరిగిందని నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడి శా, తెలంగాణల్లో అటవీ విస్తీర్ణం పెరగగా, మిజోరం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ త్రిపుర, మేఘా లయల్లో గణనీయంగా అటవీ భూమి తగ్గిందన్నారు. పంటభూములు, పర్యా వరణ విపత్తులు, జీవ ఒత్తిడులతో ఆయా రాష్ట్రాల్లో అటవీ విస్తీర్ణం తగ్గిందని పర్యావరణ, అటవీ శాఖ మంత్రి హర్షవర్ధన్ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ప్రభుత్వాలు హరిత జాతీయ రహదారులకు ప్రాముఖ్యత నివ్వడంతో ఈ పరిస్థితి మెరుగైందని, 2030 నాటికి 3 బిలి యన్ టన్నుల అధికంగా కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకునే శక్తి ఈ చెట్ల ద్వారా వస్తుందన్నారు. భారత్‌తో సహా 10 దేశాల్లో జనాభా పెరుగు దల కారణంగా అటవీ భూములు తగ్గ తున్నాయని, అడవుల్లో చెరువులు, కుంటల సామ ర్థ్యం కూడా 2,647 చదరపు కిమీ పెరిగిం దన్నారు. 2019 నాటికి ఇది మరింత మెరుగవుతుందని హర్షవర్ధన్ ఆశాభావం వ్యక్తం చేశారు.





చౌకకానున్న రైల్వే స్టేషన్లలో మరుగుదొడ్లు

న్యూఢిల్లీ : రైల్వే స్టేషన్ల వద్ద వినియోగించే "చెల్లించు, వినియోగించు" మరుగుదొడ్లు ఇకమీదట చౌకకానున్నాయి. చిన్న రైల్వే స్టేషన్లలో ఉచితంగా వినియోగించుకునే అవకాశం కలుగనున్నది. రైల్వే బోర్డు తాజాగా చేసిన ప్రతిపాదన ఈ విషయాన్ని తెలిపింది. రైల్వే స్టేషన్లలో ప్రస్తుతం "చెల్లించు, వినియోగించు' మరుగుదొడ్ల విధానం కాంట్రాక్టర్లను అనుమతి స్తోంది. ఈ మరుగుదొడ్లను కాంట్రాక్టర్లే నిర్మించి మార్కెట్ రేట్లకన్నా తక్కువగా వినియోగ ఛార్జీలను వారే నిర్ణయిస్తారు. కొత్త విధానం ప్రకారం, ఈ మరుగుదొడ్లు వినియోగించినందుకు చార్జీలు వసూలు చేయాలా? లేదా ప్రజలను ఉచితంగా వినియోగించుకునేందుకు అనుమతించాలా? అనేది నిర్ణయించే అధికారాన్ని డివిజనల్ రైల్వే మేనేజర్లకు ఇస్తారు. "ఈ విధమైన మరుగుదొడ్లను నిర్మించడం, నిర్వహించడం, శుభ్రంచేయిం చడం వంటి పనులను డబ్బులు తీసుకునే కాంట్రాక్టర్లకు అప్పగించాలా? లేదా ఉచితంగా వినియోగించుకునేందుకు అనుమతించాలా అన్న విషయాన్ని నిర్ణయించే సాధికారత డీఆర్‌ఎంలకు ఉంటుంది" అని రైల్వే బోర్డు ఫిబ్రవరి 7వ తేదీన అన్ని జోన్లకు పంపిన లేఖ తెలిపింది. రైల్వే బోర్డు ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించింది.

ఆర్మీనే అవమానిస్తావా?

- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భగవత్‌పై రాహుల్ ఆగ్రహం
- తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండు
- అవినీతి గురించి మోడీ మాట్లాడటమా?
- యడ్యూరప్ప, ఆయన మంత్రులు జైలుకెళ్లారు...
- మరిచారా అని సూటిప్రశ్న



న్యూఢిల్లీ : దేశ రక్షణ కోసం పాటుపడుతున్న సైన్యాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అగౌరవపరిచారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. దేశం కోసం సైన్యం ప్రాణాలను పణంగా పెడుతోందని, అలాంటి దేశభక్తులను భగవత్ ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్, మోహన్ భగవత్ వెంటనే సైన్యానికి, దేశానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఆర్మీ కన్నా ఆర్‌ఎస్‌ఎస్ మూడు రోజుల్లో సైనికసిబ్బందిని తయారు చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ ప్రసంగం ప్రతి భారతీయుడిని అవమానించినట్టు ఉందని రాహుల్ విమర్శించారు. ఇందుకుగాను ఆర్‌ఎస్‌ఎస్ క్షమాపణ చెప్పితీరాల్సిందేనని డిమాండు చేశారు. సైన్యాన్ని అవమానించడమంటే జాతీయ జెండాను అవమానించినట్టేనని రాహుల్ సోమవారం ట్వీట్ చేశారు. ఎందుకంటే ప్రతి సైనికుడు జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తాడని పేర్కొన్నారు. 'మన అమరవీరులను, ఆర్మీని అవమానించావ్. మోహన్ భగవత్...ఇది సిగ్గుచేటు. ఆర్‌ఎస్‌ఎస్ క్షమాపణ చెప్పాలి' అని ఆయన ట్విట్టర్ వేదికగా డిమాండు చేశారు. మోహన్ భగవత్ ఆదివారం బీహారులో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ ఆర్మీకి సైన్యాన్ని తయారు చేయడానికి 6-7 మాసాలు పడుతుందని, అదే ఆర్‌ఎస్‌ఎస్ మూడు రోజుల్లో సిద్ధం చేస్తుందని అన్నారు. ఇది తమ శక్తిసామర్థ్యాలని గొప్పలు చెప్పుకున్నారు. దేశం ఏదైనా విపత్తు ఎదుర్కొం టే... రాజ్యాంగం అందుకు అనుమతిస్తే స్వయంసేవక్ ముందు వరుసలో ఉంటుందని భగవత్ అన్నారు.

జైషా అవినీతి సంగతేంటి

రాయ్‌చూర్(కర్నాటక) : ప్రధాని నరేంద్రమోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శల దాడి కొనసాగిస్తున్నారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జైషాకు వ్యతిరేకంగా వెలుగులోకి వచ్చిన అవినీతిపై మాట్లాడాల్సిందిగా మోడీకి రాహుల్ సవాల్ విసిరారు. కర్నాటకలో రాహుల్ సోమవారం జన ఆశీర్వాద్ యాత్రలో పాల్గొన్నారు. అవినీతి గురించి మాట్లాడేముందు వెనకా.. ముందూ చూసుకోవాల్సిన అవసరం ఉందని మోడీకి హితవు పలికారు. 'మీరు అవినీతి గురించి మాట్లాడాలనుకుంటున్నారా? అయితే, అమిత్‌షా కుమారుడు అవినీతి గురించి మాట్లాడండి.రూ.50వేల పెట్టుబడితో కేవలం మూడు నెలల్లో రూ.80 కోట్లు ఎలా ఆర్జించారో చెప్పండి. దీనిపై దేశానికి వివరణ ఇస్తే బాగుంటుంది' అని మోడీని రాహుల్ ప్రశ్నించారు. రాయ్‌చూర్ జిల్లాలో రాహుల్ రోడ్ షో నిర్వహించారు. పలుచోట్ల ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మోడీ, షా సహా బీజేపీ రాష్ట్ర నాయకుల అక్రమాలనూ రాహుల్ ప్రస్తావించారు. 'మోడీజీ...మీరు అవినీతి గురించి మాట్లాడుతున్నారు. దీనికి ముందు కుడి, ఎడమలు చూసుకోండి. ఒకవైపు ముఖ్యమంత్రిగా పనిచేసిన బీఎస్ యడ్యూరప్ప జైలుకెళ్లారు. ఆయన కేబినెట్‌లోని నలుగురు మంత్రులై జైలు ఊచలు లెక్కించారు. అవినీతి ఆరోపణలపై 11 మంది నాయకులు తమ పదవులకు రాజీనామా చేశారు' అని రాహుల్ గుర్తుచేశారు.

ఉద్యోగాల కల్పనలో మోడీ విఫలం

దేశంలో యువతకు ఉద్యోగాలు కల్పించడంలో మోడీ పూర్తిగా విఫలమయ్యారని రాహుల్ విమర్శించారు. రైతుల బాధలను అసలు పట్టించుకోలేదని అన్నారు. 'మోడీ జీ...ఈ దేశ ప్రజలు, రైతులు, యువత మీకు ఉద్యోగం ఇచ్చారు. చైనాతోనే మన పోటీ అని యువత మీకు చెప్పారు. మరి చైనా 24 గంటల్లో తమ యువతకు 50 వేల ఉద్యోగాలు కల్పించింది. మీరు మాత్రం పూర్తిగా విఫలమయ్యారు' అని రాహుల్ నిందించారు. సాయం చేయాల్సిందిగా రైతులు ప్రధానిని కోరుతున్నారన్నారు. 'నేను వ్యక్తిగతంగా మోడీ కార్యాలయానికి వెళ్లాను. రైతు రుణాలు రద్దు చేయాలని విన్నవించాను. దీనిపై మోడీ కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మౌనం వహించారు' అని ప్రజలకు వివరిం చారు. రైతు రుణాలు మాఫీ చేస్తామని సిద్ధరామయ్య ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని రాహుల్ గుర్తుచేశారు. కాంగ్రెస్ మాత్రమే రుణాలు మాఫీ చేయగలదన్నారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వడం ప్రారం భించాం. రుణాలు రద్దు ద్వారా రైతులను ఆదుకోవడం ఆరంభించాం. మీకు ఎక్కువ సమయం లేదు. ఏడాది మాత్రమే సమయం ఉన్నది. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని మీరు యోచిస్తున్నారు. పని చేయడం ఇప్పుడన్నా ప్రారంభించండి. కబుర్లు చెప్పడం ఆపండని రాహుల్ హితవు పలికారు. రాహుల్ రోడ్‌షోకు విశేష స్పందన లభించింది. రోడ్డు కిరువైపులా నిలబడి రాహుల్‌కు స్వాగతం పలికారు. రాహుల్ వెంట సీఎం సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు పరమేశ్వర, ఇతర నాయకులు ఉన్నారు.

హజ్ యాత్రికుల కోసం స్వతంత్ర కమిటీ

కేంద్రమంత్రి మండలికి హైకోర్టు సూచన

న్యూఢిల్లీ : హజ్ యాత్రికుల కోసం స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని హైకోర్టు కోరింది. దీనిపై ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్) దాఖలైన సందర్భంగా చీఫ్ జస్టిస్ గీతామిట్టల్, జస్టిస్ సి. హరిశంకర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు కేంద్రాన్ని కోరింది. హజ్ యాత్రీకులకు కేంద్రం రాయితీలను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై ఢిల్లీకి చెందిన షాహిద్ అలీ ఈ పిల్‌ను దాఖలు చేశారు. కేంద్రంలోని మంత్రి మండలి దీనిపై పరిశీలపి జరిపి పిటిషనర్‌కు నిర్ణయాన్ని తెలపాల్సిందిగా కోర్టు కోరింది. సబ్సిడీని రద్దు చేసిన నేపథ్యంలో ప్రభుత్వ ఆధీనంలోని ప్యానెల్ అవసరం లేదని హజ్ కమిటి చట్టం 20002 ప్రకారం దాన్ని రద్దు చేయాలని అలీ కోరారు. 1959లో కేంద్రం ముంబై-జెద్దాకు ప్రయాణించే ఎయిర్ ఇండియా, మిగతా విమానాలకు సబ్సిడీ వెలుసుబాటు కల్పించారు. ప్రస్తుతం ఉన్న హజ్‌కమిటీని రద్దు చేసి ముస్లింలు తమ స్వంత కమిటీని ఏర్పాటు చేసుకునే విధంగా అనుమతించాలని పిటిషనర్ కోరారు. ఇప్పటికే సిక్కుల కోసం అటువంటి కమిటీ ఉందని సిక్కు గురుద్వార చట్టం 1927 ప్రకారం దీన్ని ఏర్పాటు చేశారని కోర్టుకు వెల్లడించారు. ముస్లింలకు హజ్ సబ్సిడీ రద్దు చేసిన తర్వాత ప్రభుత్వ ఆధీనంలోని హజ్‌కమిటీ అవసరం లేదని ఇకపై స్వతంత్ర సంస్థ ఈ వ్యవహారాలను సమీక్షి స్తుందన్నారు. భారత్ - సౌదీల మధ్య ప్రయా ణించే ముస్లింల కోసం పౌరవిమానయాన సంస్థ ఓపెన్ టెండర్లను పిలవాలని దీంతో సరాసరి టికెట్ కొను క్కునే అవకాశం హజ్ యాత్రీకులకు కలుగుతుందని అలీ కోర్టును అభ్యర్థించారు.

పకోడీ తిన్న రాహుల్



రాయచూర్ (కర్ణాటక) : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాయచూర్‌లో స్థానిక తినుబండారమైన మిర్చి పకోడి (బజ్జి)ని రుచి చూశారు. ఇంకా తేదీలను ప్రకటించని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన జన ఆశీర్వాద యాత్రను చేపట్టారు. కాంగ్రెస్ నాయకులతో దాబా వద్ద ఆగిన ఆయన హోటల్ యజమాని మారమ్మ వడ్డించిన మిర్చిబజ్జీ, అటుకులు తిన్నారు. రాహుల్ వెంట కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మల్లిఖార్జున ఖర్గే, ఆరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కేసీ వేణుగోపాల్, మంత్రి డీకే శివకుమార్ ఉన్నారు. ముందు రోజు ఆయన రాయచూర్ దర్గాలో ప్రార్థనలు చేశారు. రాహుల్ , సిద్ధరామయ్యలు కలసి సోమవారం రోడ్ షో నిర్వహించారు.

నాగాలాండ్‌లో సెక్యులర్ అభ్యర్థులకు మద్దతు

కోహిమా : నాగాలాండ్ అసెంబ్లీకి జరిగే ఎన్నికలలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రాష్ట్రంలో తాను పోటీ చేయని నియోజకవర్గాలలో సెక్యులర్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వనున్నట్టు తెలిపింది. రాష్ట్రంలోని 60 శాసనసభా స్థానాలకు ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనున్నది. కాంగ్రెస్ పార్టీ 19 నియోజకవర్గాలలోనే పోటీ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 20 నియోజక వర్గాలలో నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ఒక చోట అభ్యర్థి ఉపసంహరిం చుకున్నాడు. "మన ప్రజల హక్కులు, జీవన విధానాలకు రాజీపడి బీజేపీ, దాని మిత్రపక్షాన్ని అధికారానికి దూరంగా ఉంచే లక్ష్యంతో లౌకిక అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నాం" అని నాగాలాండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఎన్పీసీసీ) సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. "హిందూత్వ ఊబిలో" కూరుకు పోకుండా ప్రజలను కాపాడేందుకు సెక్యులర్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని తమ శ్రేణులకు కాంగ్రెస్ పార్టీ ఆదేశించిందని ఆ ప్రకటన పేర్కొన్నది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన, ప్రస్తుత ఎంపీ నెఫ్యూ రియో నేతృత్వంలోని నేషనలిస్టు డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్డీపీపీ)తో బీజేపీ పొత్తు కట్టింది. ఈ ఎన్నికలలో బీజేపీ, ఎన్డీపీపీ వరుసగా 20, 40 నియోజకవర్గాలలో పోటీ చేస్తున్నాయి. రాష్ట్రంలో హిందూత్వ శక్తులను అడ్డుకుని లౌకిక, సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు లౌకిక భావాలు కలిగిన పార్టీల నాయకులు విశాల వేదికను ఏర్పాటుచేయడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. బీజేపీ, ఎన్డీపీపీ మధ్య పొత్తు ఏర్పడడం పట్ల దిగ్భ్రాంతిని కూడా వ్యక్తం చేసింది. "ప్రజల ఆందోళనలు, ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకుండా 20 సీట్లను ఇవ్వడం ద్వారా నాగాలాండ్ అసెంబ్లీ సీట్లను బీజేపీతో పంచుకోవాలని ఎన్డీపీపీ తీసుకున్న నిర్ణయం దిగ్భ్రాంతి కలిగించింది" అని ఆ ప్రకటన పేర్కొన్నది.

మరో దాడికి తీవ్రవాదుల విఫలయత్నం

సెంట్రీ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

భద్రతా సిబ్బంది, తీవ్రవాదుల మధ్య కాల్పులు



శ్రీనగర్ : జమ్మూ-కాశ్మీర్‌లో తీవ్రవాదులు సీఆర్‌పీఎఫ్ శిబిరాలపై దాడులకు తెగపడుతున్నాయి. నేటి తెల్లవారు జామున సీఆర్‌పీఎఫ్ శిబిరంపై దాడికి తీవ్రవాదులు చేసిన యత్నాన్ని సైనిక దళాలు సమర్థమంతంగా తిప్పికొట్టాయి. ఆ తరువాత నగరంలోని కరాన్ నగర్ ప్రాంతంలోని భవనంలో ఆశ్రయం పొందుతున్న తీవ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. నగరం నడిబొడ్డున జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో సీఆర్‌పీఎఫ్ జవాను ఒకరికి గాయాలయ్యాయి.

"తెల్లవారుజాము 4.30 గంటల ప్రాంతంలో భుజాన బ్యాగ్‌లు ధరించుకుని ఆయుధాలతో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా శిబిరం సెంట్రీ గమనించాడు. వెంటనే వాళ్లను అడ్డుకుని, కాల్పులు ప్రారంభించాడు" అని సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. వెంటనే తీవ్రవాదులు అక్కడి నుంచి పరారై సమీపంలో నిర్మాణంలో భవనంలో ఆశ్రయం పొందారని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆ భవనాన్ని దిగ్బంధించారు. ఆ భవనంలో ఇద్దరు తీవ్రవాదులు ఉన్నారని సీఆర్‌పీఎఫ్ సీనియర్ అధికారులు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ దళాలు, తీవ్రవాదుల మధ్య భీకర ఎదురు కాల్పులు జరుగుతు న్నాయని, తీవ్రవాదులు తప్పించుకు పోకుండా చూసేందుకు సీఆర్‌పీఎఫ్ మరిన్ని బృందాలను అక్కడకు పంపింది. జమ్మూలోని సుంజ్వాన్ ప్రాంతంలోని సైనిక శిబిరంపై జైషే మహ్మద్ తీవ్రవాదులు దాడిచేసిన రెండు రోజుల తరువాత ఈ ఘటన చోటుచేసుకున్నది. ఆ రోజు జరిగిన తీవ్రవాదుల దాడిలో ఐదుగురు సైనికులతో సహా ఆరుగురు మృతిచెందారు.

కొనసాగుతున్న గాలింపు

జమ్మూ-కాశ్మీర్‌లోని సుంజ్వాన్ సైనిక శిబిరంలో చొరబడిన ఉగ్రవాదుల ఏరివేత కోసం కొనసాగుతోందని సైన్యం సోమవారం తెలిపింది. సైనిక శిబిరంలోకి శనివారం జైషే మహ్మద్ ఉగ్రవాదులు చొరబడిన విషయం తెలిసిందే. ఉగ్రవాదుల కోసం శనివారం అర్ధరాత్రి నుంచి వేట కొనసాగుతోందని సైనికాధికారులు తెలిపారు. ఆర్మీ క్వార్టర్స్ నుంచి కుటుంబ సభ్యులను వేరే ప్రాంతా లకు తరలించారు. ఈ దాడిలో ఐదుగురు భద్రతా సిబ్బందితో సహా ఆరుగురు మరణించారు. ఆర్మీ క్యాంపులోకి చొరబడిన ఉగ్ర వాదుల ఏరివేతకు 30 గంటలుగా సైనిక కార్యాచరణ కొనసాగు తోంది. మరో ఇద్దరు ముగ్గురు ఉగ్రవాదులు ఆర్మీ క్యాంపులో ఉన్నట్లు భావిస్తున్నారు. ఉగ్రదాడి నేపథ్యంలో సైన్యం హైఅలర్ట్‌ను ప్రకటిం చింది. ఆర్మీ క్యాంపునకు సమీపం లోని పాఠశాలలను మూసివేశారు. ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ జమ్మూ చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఉగ్రదాడి నేపథ్యంలో పంజాబ్-జమ్మూ-కాశ్మీర్ సరిహద్దు గ్రామాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. "సైనిక క్యాంపు వద్ద గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి" అని సైనిక ప్రజాసంబంధాల అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ పీటీఐకి తెలిపారు. ఆపరేషన్ తుది దశలో ఉన్నదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్ రెహమాన్ వీరి శాసనసభలో ప్రకటించారు.

విదేశీయులను పంపగలరా?

గోవా ప్రభుత్వానికి శివసేన సవాల్

ముంబై : గోవా బీజేపీ ప్రభుత్వంపై శివసేన మండిపడింది. విదేశీ పర్యాటకులపై ఉక్కుపాదం మోపే దమ్ముందా అని సవాల్ విసిరింది. స్వదేశీ పర్యాటకులపై నోరు పారేసుకుంటారా అని నిలదీసింది. గోవా మంత్రికి కనీసం మతి ఉండి మాట్లాడుతున్నారా అని ప్రశ్నించింది. జమ్మూ కాశ్మీరు పర్యాటక రంగాన్ని ఉగ్రవాదం అనే భూతం అతలాకుతలం చేస్తున్నదని, ఉద్యోగ అవకాశాలు లేకుండా అడుగడుగునా అడ్డుకుం టున్నదని శివసేన ఆరోపించింది. ఒక ప్రాంత ప్రజలకు వ్యతిరేకంగా గోవా మంత్రి విజయ్ సర్దేశాయి వ్యాఖ్యలు బాధ్యతారహితమైనవని ఆగ్రహం వెలిబుచ్చింది. గోవా సంస్కృతిని నాశనం చేస్తున్న పర్యాటకులను తరిమి కొట్టాలని మరోమంత్రి మనోహర్ అజ్‌గాంకర్ బెదిరించారు. కేరళ మంత్రులు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, వారిపై ముఖ్యమంత్రి పారికర్, బీజేపీ అధిష్టానం ఏమి చర్యలు తీసుకున్నదని ప్రశ్నించారు. గోవాను చెత్తకుండీగా చేస్తున్నారని ఉత్తర భారతీయులను బీజేపీ మంత్రి ఒకరు ఆరోపించడంపై శివసేన తన పత్రిక సామ్నా సంపాదకీయంలో ఏకిపారేసింది.

పర్యాటకరంగం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉంటుందని, శాంతిభద్రతలు పరిరక్షించాల్సిన బాధ్యత కూడా రాష్ట్రాని దేనని తెలిపింది. శాంతిభద్రతలు పరిరక్షించడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించింది. గోవాలోని కొన్ని ప్రాంతాలకు స్థానిక పోలీసులు వెళ్ళే ధైర్యమే చేయటంలేదని తెలిపింది. అక్కడ రష్యా, నైజీరియా జాతీయుల ఆధిపత్యం ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లి వారిని నియంత్రించాలని సవాల్ విసిరారు.

పంజాబ్, హర్యానాలో వర్షాలు

చండీగఢ్ : పంజాబ్, హర్యానాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షాలు కురిశాయి. అయినా ఈ రెండు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కొద్దిగా పెరిగినట్టు వాతావరణ విభాగం అధికారి తెలిపారు. చండీగఢ్, అంబాలా, హిసార్, కర్నాల్, రోహ్‌తక్, అమృత్‌సర్, లూథియానా, పాటియాలా, పఠాన్‌కోట్, బతిండాలలో వర్షాలు కురిసినట్టు చెప్పారు. గోధుమ, ఇతర పంటలు వేసిన రైతులకు ఈ వర్షాలతో మేలు జరుగుతుందని ఆనందం వ్యక్తంచేశారు. చండీగఢ్‌లో 12 డిగ్రీల సెల్సియస్, అంబాలాలో 12, హిసార్‌లో 12.6, కర్నాల్‌లో 10.5, రోహతక్‌లో 11.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు అధికారి తెలిపారు.

సుంజ్వాన్ మృతులకు జమ్మూ అసెంబ్లీ సంతాపం

జమ్మూ : సుంజ్వాన్ సైనిక శిబిరంపై ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన ఐదుగురు జవాన్లను స్మరించుకుంటూ జమ్మూ, కాశ్మీర్ శాసనసభ సోమవారం రెండు నిమిషాలు మౌనం పాటించింది. అనంతరం ఎన్‌సీ ఎమ్మెల్యే మైన్ అల్తాఫ్ దాడికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం అందించాలని కోరారు. శనివారం తెల్లవారుజామున సైనిక శిబిరంపై జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు గాయపడగా, పదిమందికి గాయాలయ్యాయి. ముగ్గురు ఉగ్రవాదులను సైన్యం హతమార్చింది.

ఒడిశా ప్రముఖ నటి ప్రబాతి కన్నుమూత

న్యూఢిల్లీ : ఒడిశా చలనచిత్ర ప్రముఖ నటి, డైరక్టర్, నిర్మాత ప్రబాతి ఘోష్ (85) అస్వస్థతతో సోమవారం తెల్లవారుజామున కన్నుమూసినట్టు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. 1933లో కటక్‌లోని మనసింగపటనాలో ఆమె జన్మించారు. 'అమరి గోన్ జిహియా' ' భాయి భాయి' ' మా' 'లక్ష్మీ' , 'కా', 'శ్రీ అండ్ సంసార్ ' వంటి చిత్రాల్లో ఆమె నటించారు. వాటిలో 'లక్ష్మీ, 'కా', 'శ్రీ' చిత్రా లకు ఆమె జాతీయ ఉత్తమ చలనచిత్ర అవార్డులను అందుకున్నారు. అమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విమానాశ్రయంలో బంగారం స్వాధీనం

న్యూఢిల్లీ : కోల్‌కతాలో ఎన్‌ఎస్‌సీ బోస్ విమానాశ్రయంలో ప్రయాణీకుడు నుంచి ఐదు కిలోలకు పైగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు దుబాయ్ కస్టమ్స్ అధికారులు సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి దుబాయి నుంచి వచ్చిన వీల్‌ఛైర్‌లో ఉన్న 60 ఏళ్ల వ్యక్తి నుంచి 5.35 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అయితే ఆ వ్యక్తి నడవగలడని, అధికారులను పక్కదారి పట్టించేందుకే వీల్‌ఛైర్‌లో ఉన్నట్టు గమనించామని తెలిపారు. తమిళనాడుకు చెందిన ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్టు తెలిపారు.

అసెంబ్లీలో 'జయ' చిత్రపటంపై కోర్టును ఆశ్రయించిన డీఎంకే

చెన్నై : తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జె.జయలలిత నిలువెత్తు చిత్రపటాన్ని అసెంబ్లీలో ఆవిష్కరించడంపై డీఎంకే అభ్యంతరం వ్యక్తంచేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. అవినీతి ఆరోపణలపై సుప్రీంకోర్టు దోషిగా నిర్ధారించిన జయలలిత ఫోటోను తక్షణం తొలగించాల్సిందిగా ఆదేశించాలంటూ దాఖలు చేసిన తమ పిటిషన్‌ను తక్షణ విచారణ చేపట్టాలని మద్రాసు హైకోర్టును కోరింది. సోమవారం 10.30 గంటలకు చీఫ్ జస్టిన్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ అబ్దుల్ ఖద్దూస్‌తో కూడిన ఫస్ట్ బెంచ్ కోర్టు కార్యక్రమాలను ప్రారంభించగానే డీఎంకే సీనియర్ పి. విల్సన్ ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు.

ఎస్‌బీఐ ఆపరేటర్‌పై కాల్పులు

మోటిహారి : బీహార్‌లో తూర్పు చంపారన్ జిల్లాలో ఎస్‌బీఐ 'గ్రహక్ సేవా కేంద్రం' ఆపరేటర్‌ను దుండగులు కాల్పులు జరిపి రెండు లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు చెప్పారు. తురకౌలియా బ్రాంచిలో ఎస్‌బీఐలో నగదు విత్‌డ్రా చేసుకుని బాగియా గ్రామంలోని 'గ్రహక్ సేవా కేంద్రం'లో నగదు డిపాజిట్ చేసేందుకు వచ్చిన సంతోష్ కుమార్‌పై దాడి చేసినట్టు చెప్పారు. ఆయన వద్ద నుంచి 2.38 లక్షలు లూటీ చేసినట్టు తెలిపారు. సంతోష్‌ను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

రెండవ పెళ్లి చేసుకున్నాడని భర్తను చంపిన మహిళ

బరైలీ : భర్త రెండవ పెళ్లి చేసుకున్నాడన్న కోపంతో భార్య ఆయన నిద్రపోతున్న సమయంలో రుబ్బుడురోలుతో హత్యచేసింది. దీంతో భర్త అక్కడికక్కడే మృతిచెందాడని పోలీసులు సోమవారం తెలిపారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి ఉత్తరప్రదేశ్‌లోని బరైలీలో చోటుచేసుకుంది. బబ్లీ అనే వివాహితకు తన భర్త పదిరోజుల క్రితం వేరొక మహిళను రహస్య వివాహం చేసుకున్న సంగతి నాలుగు రోజుల క్రితం తెల్సిందని ఈ విషయంపై భార్యాభర్తలిద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుందని చెప్పారు. బబ్లీని అరెస్టు చేసినట్టు చెప్పారు.

బీజేపీ వైఖరే విద్యార్థి మృతికి కారణం : మాయావతి

లక్నో : కుల రాజకీయాలు, సంకుచిత భావాల ఫలితంగానే అలహాబాద్‌లో దళిత విద్యార్థి హత్య జరిగిందని బీజేపీపై బీఎస్పీ అధినేత్రి మాయావతి ధ్వజమెత్తారు. అలహాబాద్‌లో మృతుడి కుటుంబ సభ్యులను కలుసుకుని ఆమె వారికి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ వైఖరి వల్ల దేశవ్యాప్తంగా ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆమె దుయ్యబట్టారు.

దున్నపోతుల పందేల స్టేకు సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ : కర్ణాటకలోని కంబాలాలో దున్నపోతుల పందేలు జరిగేందుకు మధ్యంతర స్టే విధించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. జంతుహక్కుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు ఏఎం ఖన్విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మధ్యంతర స్టేకు నిరాకరిస్తు చివరి విచారణను మార్చి 12కు వాయిదా వేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ ద్వారా కంబాలలో దున్నపోతుల పందేలు జరపడం చట్టబద్ధం కాదని జంతుహక్కుల న్యాయవాది సిద్ధార్థ లూథ్ర స్పష్టం చేశారు. పందేలు నవంబరు - మార్చి మధ్య నిర్వహిస్తారు.

నాగాలాండ్ ఎన్నికలకు సీఏపీఎఫ్ మోహరింపు

కోహిమా : నాగాలాండ్‌లో ఫిబ్రవరి 27న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతా చర్యలు తీసుకున్నారు. 281 కంపెనీల కేంద్ర బలగాలు మోహరిస్తున్నామని ఎన్నికల అధికారి వెల్లడించారు. 281 కంపెనీలలో ఇప్పటికే 77 కంపెనీల బలగాలు రాష్ట్రానికి చేరుకున్నాయని మీడియాసెల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి అభిజిత్ సిన్హా తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టే ధన, ఆయుధ, మద్యం లాంటి వాటిని భద్రతాబలగాలు నిరోధిస్తాయి.

వంతెనను ఢీకొట్టిన ఎంపీయూ : 8 మంది మృతి

మీర్జాపూర్ : ఎంపీయూ వాహనం వంతెన రెయిలింగ్‌ను ఢీకొట్టి నదిలో పడటంతో 8 మంది దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాథీ ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. డ్రైవరు స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోవడంతో బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టిన వాహనం ఆపై జోరియా నదిలో పడిపోయిందన్నారు. అక్కడికక్కడే 8 మంది మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారన్నారు. హిందీ వార్తా పత్రిక పంపిణీకి వెళుతుండగా ఈ ఘటన జరిగిందన్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

కల్తీ సారా స్వాధీనం , ఇద్దరి అరెస్టు

బలియా (యూపీ) : ఉత్తరప్రదేశ్‌లోని వజిద్‌పూర్‌లో రూ. 10 లక్షల ఖరీదు చేసే కల్తీసారాను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు సోమవారం వెల్లడించారు. కచ్చితమైన సమాచారం అందటంతో బీహార్ నుంచి పంజాబ్‌కు కల్తీసారాను తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్పీ అనిల్ కుమార్ వెల్లడించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

రాజస్థాన్ రైతులకు రుణమాఫీ

జైపూర్ : రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు ఒకేసారి రూ. 50 వేల వరకు రుణమాఫీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి వసుంధర రాజే సోమవారం బడ్జెట్ సమావేశాల్లో వెల్లడించారు. దీంతో ఎక్కువ మంది రైతులకు ఉపశమనం లభిస్తుందని, ఇందుకోసం రూ. 8వేల కోట్లు కేటాయించామన్నారు. ఈ రుణ మాఫీని రైతులందరికీ వర్తింప చేయాలని కాంగ్రెస్ అసెంబ్లీలో పోరాడింది. బస్సు ప్రయాణాల్లో 80 ఏళ్ల పైబడిన వారికి సహాయకుడితో సహా సగం చార్జీలు వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచుతూ గో శాలల్లో బయోగ్యాస్ ఉత్పత్తికి చర్యలు తీసుకున్నామన్నారు.



శ్రీశైలం కొండ నిండా జనం

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : శ్రీశైల క్షేత్రం లక్షలాది మంది భక్తులతో సోమవారం కిటకిటలాడింది. క్షేత్రంలోని వీధులన్నిటిలో జనం నిండిపోయారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానానికి సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. పాతాళ గంగలో పెద్దఎత్తున పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్న సిద్ధ రామశివాచార్య మహాస్వాములు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ అధికారులు సాంప్రదాయబద్ధంగా ఆయనకు స్వాగతం పలి కారు. నేడు మహాశివరాత్రి రోజు భారీ స్థాయిలో శివస్వాములు ఇక్కడ దీక్షా విరమణ చేయనున్నారు. ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. సోమ వారం కలెక్టర్ సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి భరత్‌గుప్త ఏర్పా ట్లు పరిశీలించారు. ఎస్పీ గోపీనాథ్ జెట్టి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం శ్రీశైల క్షేత్ర పురవీధుల గుండా రథోత్సవం నిర్వహించనున్నారు.

మావోయిస్టుల మందుపాతరకు జవాన్ బలి

విశాలాంధ్ర-చింతూరు : చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి 389 బెటాయిలియన్‌కు చెందిన జవాను సోనేధార్ హేమ్‌లా (28) సోమవారం మృతి చెందాడు. మావోయిస్టుల కోసం డీఆర్జీ బెటాలియన్ గంగలూరు, తిప్పాపురం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులు లక్ష్యంగా అమర్చిన మందుపాతర జవాన్ల తాకిడికి పేలి పోవటంతో జవాను మృతి చెందాడు. మృతదేహాన్ని రాయ్‌పూర్‌కు తరలించారు. ప్రభుత్వ లాంచనాలతో నివాళులు అర్పించారు.

పవన్ పర్యటనను అడ్డుకుంటాం



విశాలాంధ్ర-విశాఖసిటీ : మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చే అంశానికి మద్దతిచ్చేందుకు ఈ నెల 21వ తేదీన శ్రీకాకుళం పర్యటించనున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను అడ్డుకుంటామని ఆదివాసీ విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎల్.మధు అన్నారు. మత్స్యకారులకు ఎస్టీల్లో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ ఆ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం విశాఖలోని ఏయూ మెయిన్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోకపోతే తగిన బుద్ధిచెబుతామని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్.మధు హెచ్చరించారు. ఇప్పటికే గిరిజనులు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్న విషయాన్ని గమనించకుండా ఏ హామీలు పడితే వాటిని ఇవ్వడం దుర్మార్గమన్నారు. కులాలను తెగలలో కలపటం కుదరదన్నారు. తెగల్లో మార్పుచేయాల్సి వస్తే గిరిజన సలహామండలిలో చర్చించి తీర్మానం ఆధారంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బోయవాల్మీకులను ఎస్టీలలో చేర్చే ఆలోచన ప్రభుత్వం విరమించకపోతే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ధర్నాలో విద్యార్థి సంఘం నాయకులు కె.దేవి, శ్యామ్ సుందర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

విశాలాంధ్ర - ఏలూరు : పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు తంగెళ్లమూడి వద్ద ఆరేళ్ల క్రితం జరిగిన భట్టా గంగాధరరావు హత్య కేసులో నేరం రుజువుకావడంతో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం జిల్లా ఒకటో అదనపు సెషన్స్ జడ్జి జి గోపి తీర్పు చెప్పారు. ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిట్టి సతీష్, భట్టా గంగాధరరావు వర్గాల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో 2008లో గంగాధరరావు అనుచరులు సతీష్‌ను హత్య చేశారు. ఆ తర్వాత గంగాధరరావును సతీష్ వర్గీయులు 2012 జూలై తొమ్మిదో తేదీ అర్ధరాత్రి హత్య చేశారు. గంగాధరరావు హత్య కేసులో కంచి మురళీకృష్ణ, మీసాల దుర్గారావు, చిట్టి ప్రసాద్, మహ్మద్ జానీబాషా, కత్తిర సతీష్, కెంగం గణేష్, అమర్‌సింగ్‌చంద్ర సతీష్, కనక రామ్మోహనరావు అలియాస్ పూరీలను అరెస్టు చేశారు. ఈ కేసులో ఏడుగురికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ఒకటో అదనపు సెషన్స్ జడ్జి గోపి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ప్రేమ్‌కుమార్, కె ఉషాకిరణ్ వాదించారు. ప్రాసిక్యూషన్‌కు టూ టౌన్ సీఐ జి మధుబాబు సహకరించారు.



రాష్ట్రంలో 30 మోడల్ పోలీస్‌స్టేషన్లు

అవనిగడ్డ-విశాలాంధ్ర : రాష్ట్రంలో 30 మోడల్ పోలీస్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్టు డీజీపీ ఎం మాలకొండయ్య తెలిపారు. అత్యధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకునే ఈ స్టేషన్ల ద్వారా నేరాల అదుపు, శాంతిభద్రత పరిరక్షణ చర్యలు వేగవంతంగా చేయవచ్చన్నారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌ను రూ.1.44 కోట్లతో అభివృద్ధి పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక చెక్కకుర్చీ, ఎర్రరంగు స్టేషన్‌లకు స్వస్తి చెప్పనున్నామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజికవర్గంలో ఒకటి, గుంటూరులో 2, కుప్పం నియోజకవర్గంలో ఒక మోడల్ పోలీస్‌స్టేషన్లు ప్రారంభమయ్యాయన్నారు. మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ టెక్నాలజీతో నేరాల అదుపునకు పోలీసుశాఖ తీసుకుంటున్న చర్యలు ఎంతో ఫలితాన్ని ఇస్తున్నాయన్నారు. శాసనసభా ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దివిసీమలో ఎక్కువ ప్రకృతి వైపరిత్యాలు, సంబరాల సమయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి మోడల్ పోలీస్‌స్టేషన్ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ నాగుల్‌మీరా పోలీస్ హౌసింగ్ బోర్డు ఎండీ రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా ఎస్పీ త్రిపాఠి, డీఎస్పీ వి. పోతరాజు, సీఐ ఎస్వీ వీఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వెలుగోడుకు ప్రత్యేక స్థానం



విశాలాంధ్ర - వెలుగోడు (కర్నూలు) : వెలుగోడు ప్రాంతంలో జలవనరులు, అటవీసంరక్షణ తదితర అంశాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి ఉపాధి అవకాశాల మెరుగుదలకు ఆసియాదేశాల ప్రతినిధులు ఆసక్తి చూపుతున్నారని, దీంతో వెలుగోడుకు భవిష్యత్‌లో ఓ ప్రత్యేకస్థానం ఏర్పడుతుందన్నారు. ఆసియా దేశాల యునైటెడ్ నేషన్స్ ఆంధ్రప్రదేశ్ జనరల్ కార్యదర్శి జయరాములు అన్నారు. కర్నూలు జిల్లా వెలుగోడు పట్టణంలోని లిటిల్‌ఎంజిల్స్ పాఠశాల ప్రాంగణంలో సోమవారం గ్రామీణ మహిళలు, బాలికల శక్తి అంశంపై సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ అభివృద్ధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 9, 10 తరగతుల విద్యార్థులు భాగస్వాములు అయ్యేందుకు ఆసియా కమిషన్‌లో సభ్యులుగా చేరవచ్చన్నారు. పాలకులు నిజాయితీగా పనిచేస్తే అద్భుత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దవచ్చు అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఇమ్మానియల్‌కు చెన్నై, జెరుసలేమ్ యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కారుణ్య స్కూల్ కరస్పాండెంట్ దర్గయ్య, నూర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో మరో భూ కుంభకోణం

- రూ.6 కోట్ల స్థలం స్వాహాకు కుట్ర
- నకిలీ డాక్యుమెంట్ల సృష్టి
- కోర్టును తప్పుదారి పట్టించేయత్నం
- పది మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



విశాలాంధ్ర- విజయవాడ : రాష్ట్ర నూతన రాజధాని ప్రాంతంలోని విజయవాడ నగరంలో మరో భారీ భూకుంభకోణం వెలుగులోకి వచ్చింది. నకిలీ డాక్యుమెంట్లతో రూ.6 కోట్ల విలువైన 1,484 చదరపు గజాల స్థలాన్ని స్వాహా చేసేందుకు ముగ్గురు కుట్ర పన్నారు. స్థల యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పటమట పోలీసులు ప్రమేయం ఉన్న పది మందిని అరెస్ట్ చేశారు. విజయవాడ సూర్యారావుపేట పోలీస్టేషన్‌లో సోమవారం ఈ కుంభకోణం కుట్రను డీసీపీ గజరావు భూపాల్ మీడియాకు వెల్లడించారు. సూర్యారావుపేట ప్రకాశం రోడ్డులో నివాసం ఉంటున్న డాక్టర్ యేపూరి మధుసూదనరావు(83)కు ఇద్దరు కుమార్తెలు. వారిద్దరితోపాటు నాదెండ్ల మాధవరావు అనే వ్యక్తి కుమార్తె పేరున పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామచంద్రనగర్‌లో 1,484 చదరపు గజాల స్థలం ఉంది. డాక్టర్ మధుసూదనరావు కుమార్తెలు ఇద్దరూ వృత్తిరీత్యా విదేశాల్లో ఉంటున్నారు. దీంతో వారిద్దరి పేరున ఉన్న భూమికి డాక్టర్ మధుసూదనరావు జీపీ హోల్డర్‌గా వ్యవహరిస్తున్నారు. తన కుమార్తెల స్థలాన్ని 2012వ సంవత్సరంలో ఆయన అరుణా మోటార్స్ కంపెనీకి 2017 వరకు లీజుకు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారు. దీంతో అరుణా మోటార్స్ కంపెనీ యాజమాన్యం సంబంధిత స్థలంలో సుద్దపల్లి గోపి కమలాకర్ అలియాస్ గోపిని వాచ్‌మన్‌గా పెట్టింది. గోపి తన తల్లిదండ్రులు విజయకుమారి, శివయ్యతో కలిసి ఆ స్థలంలోని రేకుల షెడ్డులో నివాసం ఉండేవారు. 2017లో లీజు గడువు ముగియడంతో అరుణా మోటార్స్ వారు ఆ స్థలాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఈ ఖాళీ స్థలాన్ని స్వాహా చేసి విక్రయించాలని ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన మందాడి ఆదిరెడ్డి, రవి, సందిపోగు రవీంద్ర అలియాస్ బుజ్జి కుట్ర పన్నారు. దీంతో ప్రకాశం జిల్లా భగవాన్‌రాజుపాలేనికి చెందిన నార్నె పోతురాజు అనే వ్యక్తిని కలిసి తాము చెప్పినట్లు చేస్తే కొంత డబ్బు ఇస్తామని ఆశ చూపించారు. అతను అంగీకరించడంతో సదరు స్థలానికి పోతురాజును యజమానిగా తెరపైకి తీసుకొచ్చారు. ఆ తర్వాత గతంలో ఈ స్థలంలో వాచ్‌మన్‌గా పనిచేసిన గోపి, అతని తల్లి విజయకుమారిని కలిసి తాము చెప్పినట్లు చేస్తే పెద్దఎత్తున డబ్బు ఇస్తామని ఆశ చూపారు. ఈ స్థలం వద్దకు ఎవరు వచ్చినా స్థల యజయమాని నార్నె పోతురాజు అని, ఆయనే తమను కాపలాదారులుగా నియమించారని చెప్పాలని సూచించారు. అనంతరం ఆదిరెడ్డి, రవీంద్ర కలిసి రియల్ ఎస్టేట్ మీడియేటర్ అబ్దుల్లా ద్వారా కాజా మధుసూదనరావు అనే వ్యక్తికి రూ.1.10 కోట్లకు 1,484 గజాలు విక్రయించేలా అగ్రిమెంట్ చేసుకుని రూ.10 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు.

నకిలీ డాక్యుమెంట్ అని తెలిసినా...

అగ్రిమెంట్ తర్వాత తనకు స్థలం విక్రయిస్తున్న వారి వద్ద ఉన్నవి నకిలీ డాక్యుమెంట్లని కాజా మధుసూదనరావు గుర్తించారు. అయినా తక్కువ ధరకు విలువైన స్థలం వస్తుందనే ఆశతో మధుసూదనరావు కూడా రవీంద్ర, ఆదిరెడ్డితో చేతులు కలిపాడు. ఈ నేపథ్యంలో తమ స్థలాన్ని ఎవరో విక్రయించాలని ప్రయత్నిస్తున్నట్లు డాక్టర్ మధుసూదనరావుకు సమాచారం అందింది. హుటాహుటిన స్థలం వద్దకు చేరుకున్న ఆయన రేకుల షెడ్డులో ఉంటున్న గోపి, విజయకుమారిని తక్షణం ఖాళీ చేయాలని చెప్పారు. అయితే, ఆ స్థలానికి యజమానిగా నార్నె పోతురాజు ప్రస్తుతం అక్కడ ఉంటున్న విజయకుమారికి అద్దెకు ఇచ్చినట్లు అగ్రిమెంట్ డాక్యుమెంట్లు తయారు చేయించి కోర్టులో దావా వేశారు. నకిలీ డాక్యుమెంట్లను అడ్డు పెట్టి పోతురాజు బ్యాంకులో రుణానికి కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాలన్నీ తెలియడంతో డాక్టర్ మధుసూదనరావు పటమట పోలీసులకు నార్నె పోతురాజు, విజయకుమారిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. నకిలీ డాక్యుమెంట్లతో పోలీసులతోపాటు కోర్టును, మున్సిపల్, బ్యాంకు అధికారులను తప్పుదారి పట్టించినట్టు గుర్తించారు. ఈ కేసులో మందాడి ఆదిరెడ్డి, సందెపోగు రవీంద్ర, నార్నె పోతురాజు, సుద్దపల్లి విజయకుమారి, సుద్దపల్లి గోపి కమలాకర్, షేక్ అబ్దుల్లా, నక్కా వీరకుమార్, మర్రి రవీంద్ర, కాజా మధుసూదనరావు, షేక్ సిరావుద్దీన్ అలియాస్ దిలీప్‌కుమార్, వెల్లంకి సుధాకర్‌లను నిందితులుగా చేర్చారు. మందాడి ఆదిరెడ్డి మినహా మిగిలిన పది మందిని అరెస్ట్ చేసినట్లు డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీలో భీకర పోరు

- పోలీసులు, మవోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు
- 45 కిట్‌బ్యాగ్‌లు, ఆయుధాలు స్వాధీనం
- రహస్య సమావేశానికి కీలక నేతలు హాజరు
- కూంబింగ్‌కు అదనపు బలగాల తరలింపు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి/ చింతపల్లి : ఆంధ్రా - ఒడిషా సరిహద్దులో (ఏవోబీ) మరోసారి పోలీసులు, మావోయిస్టుల మధ్య సోమవారం భీకర పోరు జరిగింది. మల్కన్‌జిల్లా జోడుంబా, కటాఫ్‌తోపాటు సీలేరు, చిత్రకొండ ప్రాంతంలో పోలీసులు, మావోల మధ్య పరస్పర కాల్పులతో గిరిజనులు వణికిపోయారు. ఆంధ్రా, ఒడిషా పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేయటంతో మావోయిస్టులు కిట్ బ్యాగ్‌లను వదిలేసి పరారైనట్లు సమాచారం. కాల్పులు జరిగిన ప్రదేశంలో 54 కిట్ బ్యాగ్‌లతోపాటు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో 54 మంది మావోయిస్టు నేతలు పాల్గొన్నట్టు పోలీసు అధికారులు భావిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ నేతలు పెద్ద ఎత్తున రిక్రూట్‌మెంట్ చేపట్టేందుకు మావోయిస్టు పార్టీ కీలక నేతలు ఏవోబీలో సమావేశం నిర్వహించారు. దీనికి ఆ పార్టీ కీలక నేత ఆర్కే కూడా హాజరైనట్లు వినికిడి. సమాచారం అందుకున్న రెండు రాష్ట్రాల పోలీసులు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో మావోయిస్టులు ఎదురుపడటంతో పరస్పర కాల్పులు జరిగాయి. కటాఫ్ ప్రాంతంలో కొన్ని గంటలపాటు ఈ ఆపరేషన్ కొనసాగినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం వాటిల్ల లేదని, మావోయిస్టులంతా తప్పించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. సరిహద్దు గ్రామాల్లో మావోయిస్టులు సమా వేశాలు నిర్వహిస్తూ యువకులను రిక్రూట్ చేసుకుంటున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో పోలీసు బలగాలు రంగంలోకి దిగి కూంబింగ్ కొనసాగించాయి. మావోయిస్టు పార్టీ అగ్రనేత ఆర్కే కూడా రహస్య సమావేశానికి వచ్చారన్న సమాచారంతో రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎదురు కాల్పుల్లో సుమారు 50మం దికిపైగా మావోయస్టులు పాల్గొన్నట్లు సమాచారం. తప్పిం చుకున్న మావోయిస్టుల కోసం ముమ్మర కూంబింగ్ కొనసాగుతోంది. అదనపు బలగాలను రంగంలోకి దించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

కృష్ణా కలెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సీరియస్

- ముగ్గురు దళిత అధికారులకు అవమానంపై ఆగ్రహం
- 48 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం
- త్వరలో సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తాం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ వెల్లడి

విశాలాంధ్ర- మచిలీపట్నం : కృష్ణాజిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం దళిత అధికారులతో వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ముగ్గురు జిల్లా స్థాయి దళిత అధికారులపై కలెక్టర్ వివక్షత చూపుతున్నారంటూ కమిషన్‌కు ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో సోమవారం ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడారు. అధికారులపై వివక్షకు సంబంధించి 48 గంటల్లో సంజాయిషీ ఇవ్వా లని కలెక్టర్‌ను కోరినట్టు ఆయన చెప్పారు. వివక్షతకు గురైన దళిత అధికారులకు కలెక్టర్ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని స్వయంగా కలిసి కమిషన్ ఫిర్యాదు చేస్తుందన్నారు. ఐఏఎస్ అధికారే దళిత అధికారులపై వివక్షత చూపడం గర్హనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పడిన తర్వాత ఓ ఐఏఎస్ అధికారిపై ఇటువంటి ఫిర్యా దులు రావడం ఇదే ప్రథమం అని, కమిషన్ చాలా సీరియస్‌గా తీసుకుంటుం దన్నారు. కమిషన్ ముందు ఎంతటి ఉన్నత స్థాయి అధికారి అయినా ఒకటేనన్నారు. ప్రతిభ కలిగిన దళిత అధికారులను ఉద్దేశించి పౌరుషపదజాలం వాడటంతోపాటు వాడుక భాషకు అందని విధంగా కలెక్టర్ వ్యవహరిస్తున్న తీరు సభ్య సమాజం సిగ్గు పడేలా ఉందన్నారు. రాష్ట్ర రాజధాని ప్రాంతంలోని కలెక్టర్‌పై ఇటువంటి ఫిర్యాదులు రావడం విచారకరమ న్నారు. దళిత అధికారుల మనోభావాలు దెబ్బతినేలా జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో కలెక్టర్ వ్యవహ రించిన తీరుపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమగ్ర నివేదిక కోరనుందని కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ వివరించారు.



ప్రత్యేక హోదా మన హక్కు- ప్యాకేజితో మోసపోవద్దు

మార్చి 1న కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

- మార్చి 5న జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా • జగన్ అధ్యక్షతన వైసీపీ సమావేశంలో నిర్ణయం

విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : 'ప్రత్యేక హోదా మన హక్కు.. ప్యాకెజితో మోసపోవద్దు' అనే నినాదంతో మార్చి ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని సోమవారం రాత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. నెల్లూరు జిల్లా కనిగిరి మండలం పెదకొండూరు గ్రామంలో వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైసీపీ ఎంపీలు, ముఖ్యనేతల సమావేశం రెండుగంటపాటు జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా నిరాకరించడం, ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి మీడియాకు సమావేశ వివరాలను వెల్లడించారు. మార్చి 5వ తేదీన ప్రత్యేక హోదా మన హక్కు.. ప్యాకేజీ మాకొద్దు అన్న నినాదాంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ కీలక నేతలు ధర్నా చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

ఈ ఆందోళనకు సంబంధించి మార్చి 3వ తేదీన పార్టీ కీలక నేతలందరూ ఢిల్లీ ప్రయాణానికి జగన్ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ప్రత్యేక హోదాతో మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలు సిద్ధిస్తాయని, సాధించే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆపబోదని భూమన తెలిపారు. ఫలితం రాని పరిస్థితుల్లో మా పార్టీ ఎంపీలు రాజీనామాలు చేస్తారని జగన్ స్పష్టం చేసినట్టు కరుణాకరరెడ్డి వివరించారు.

బోయవాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు

- కదంతొక్కిన గిరిజనం
- మెట్టుగూడ జలపాతం వద్ద గిరిదీక్ష
- గిరిజనులకు అన్యాయం చేయొద్దని హెచ్చరిక



విశాలాంధ్ర-సీతంపేట : బోయ వాల్మీకులను, మత్స్యకారులను ఎస్టీలో చేర్చొద్దంటూ సోమవారం సిక్కోలులో గిరిజనులు గిరిదీక్ష చేపట్టారు. గిరిజనులతో జలపాతం వద్ద నేతలు ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన గిరిజనులు శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటీడీఏలోని అడవితల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన తర్వాత డప్పు వాయిద్యాలు, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలతో మెట్టుగూడ జలపాతం వరకు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం గిరిజనులంతా కొండపైకి చేరుకొని గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను అడ్డుకోవాలంటూ నినదించారు. జిల్లాలోని 1,250 గిరిజన గ్రామాల్లో 108 గ్రామాలు మాత్రమే షెడ్యూల్ ప్రాంత జాబితాలో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదాల వల్ల నాన్‌షెడ్యూల్ ప్రాంతాల్లోని గిరిజనులు అన్ని విధాలుగా నష్టపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. 2017 డిసెంబర్ 2న ఏపీ ప్రభుత్వం శాసనసభ, శాసనమండలి బోయవాల్మీక కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదన చేయడంతో గిరిజనులు రగిలిపోయారు. బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ గత 41 రోజులుగా సీతంపేట ఐటీడీఏ ముఖద్వారం వద్ద గిరిజన ఐక్యవేదిక, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ పోరాటంలో భాగంగా గిరిదీక్షలో ఉమ్మడి రాష్ట్రాల గిరిజన ఐక్యవేదిక నాయకులు వివేక్ వినాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓట్ల కోసం శవ రాజకీయాలు చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో గిరిజనులంతా ఐక్యంగా పాలకులకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. మన్నెసీమ వ్యవస్థాపకుడు చందా లింగయ్య దొర మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు నేటికీ విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం బోయవాల్మీకి, మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు కూరంగి ముఖలింగం మాట్లాడుతూ గిరిజనుల జీవనశైలి, కట్టు, బొట్టు, ఆచారాలు, సాంప్రదాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా తప్పుడు నిర్ణయాలతో గిరిజనుల మనోధైర్యాన్ని దెబ్బతీయడం దారుణమన్నారు. పోరాటాలతో ప్రభుత్వాలకు తగిన బుద్ధిచెప్పాలన్నారు.

గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బిడ్డిక తేజేశ్వరరావు మాట్లాడుతూ బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. ముగ్గురు డీఎస్పీలు కృష్ణమూర్తి నాయుడు, పెంటారావు, రాఘవేంద్రరావు, కొత్తూరు, ఆమదాలవలస సీఐలు శ్రీనివాసరావు, నవీన్ కుమార్, ఎస్‌ఐలు కె.రాము, దోనుబాయి, రాజేష్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అడు గడుగునా డ్రోన్ కెమేరాలతో చిత్రీకరించారు. కార్య క్రమంలో పాలకొండ ఎమ్మెల్యే వి. కళావతి, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ, సాకే గంపన్న దొర, సోడా, వెంకటేష్, నిమ్మక జయరాజు, పడాల భూదేవి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో శాటిలైట్ కేబుల్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర- విజయవాడ (గాంధీనగర్) : కేబుల్‌రంగంలో వస్తున్న విదేశీ నూతన టెక్నాలజీపై విజయవాడలో తొలిసారి శాటిలైట్ కేబుల్ టీవీ బ్రాడ్‌బాండ్‌లకు సంబంధించి ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఎగ్జిబిషన్, సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటరావు తెలిపారు. విజయ వాడలోని ఓ హోటల్‌లో సోమవారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిం చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఫైబర్ గ్రిడ్ పేరుతో ప్రజలకు ఇంటర్నెట్, టీవీ ఛానల్స్, టెలిఫోన్ వంటి సౌకర్యాలు అందిస్తున్న నేపథ్యంలో తాము కూడా వినియోగదారులకు మంచి ప్రసా రాలు అందించడానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. విజయవాడ ఎగ్జిబిషన్‌లో దేశ విదేశాలకు చెందిన అనేక కంపెనీల ఉత్పత్తు లతోపాటు టెక్నాలజీలను పదర్శిస్తున్నామ న్నారు. రాష్ట్రంలోని కేబుల్ ఆపరేటర్స్, ఎం.ఎస్.ఓలు అందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షులు ఎ.వెంకటరావు, నాయకులు కె.శ్రీనివాస్, సన్యాసినాయుడు, ఎం.జె.ఆలీ పాల్గొన్నారు.

మూవీరూల్జ్‌పై చర్యలు తీసుకోండి

కేటీఆర్‌కు కోన వెంకట్ వినతి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మూవీరూల్జ్ వెబ్‌సైట్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి కె.తారకరామారావుకు సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ విజ్ఞప్తి చేశారు. తెలుగు సినీపరిశ్రమకు ఈ వెబ్‌సైట్ ప్రతిబంధకంగా మారిందని, వెబ్‌సైట్ నిర్వాహకులపై చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని ట్విట్టర్ ద్వారా కేటీఆర్‌కు విన్నవించారు. సినీ పరిశ్రమకు మంచి చేసి ఆదుకోవాలని ఆయన కోరారు. రిలీజైన ప్రతి సినిమా ఈ వెబ్‌సైట్లో ప్రత్యక్షమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. వెబ్‌సైట్లో ఉంచిన కొత్తగా రిలీజైన తెలుగు సినిమాల వివరాలను కేటీఆర్‌కు తెలియజేశారు. కొత్త సినిమా విడుదలైన గంటల్లోనే వెబ్‌సైట్లలో ఆ సినిమా పైరసీలు ప్రత్యక్షమవుతుంటాయి. కొన్ని సైట్లు అయితే ఏకంగా సినిమాల విడుదలకు ముందే వాటిని తమ సైట్లలో పెట్టి సినీ రంగాన్ని ఘోరంగా దెబ్బతీస్తున్నాయి. దీంతో కోట్లాది రూపాయల పెట్టుబడితో సినిమా నిర్మిస్తున్న నిర్మాతలు భారీగా నష్టాన్ని మూటగట్టుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేటీఆర్‌కు కోన వెంకట్ విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ శుభాకాంక్షలు



విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు మహాశివరాత్రి శుభాకాం క్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతో షాలతో జీవించేలా భగవంతుడు దీవించాలని ప్రార్థించినట్లు చెప్పారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యాటకశాఖ భక్తులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. నాలుగు ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులతో పాటు ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, రామప్ప ఆలయాలకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది.



రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న సర్కార్

అంజయ్య నాయక్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: గిరిజనులకు రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ విమర్శించారు. ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత ఇచ్చిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. గిరిజన సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం సోమవారం రంగారెడ్డి జిల్లా మంచ్యాల మండలంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంజయ్యనాయక్ మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు దుర్భర దయనీయమైన జీవితాలు సాగిస్తున్నా, పాలకవర్గాలు పట్టించుకోవడం లేదని గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదన్నారు. తక్షణమే 10 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిస్తూ, తండాల అభివృద్ధికి అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసిన తరువాతే తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. 500 జనాభా ఉన్న తండాలను పంచాయతీలుగా గుర్తిస్తామన్న ప్రభుత్వం వాటికి మౌలిక వసతులు కల్పించకుండా పంచాయతీల ఏర్పాటు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. 2003లో భద్రాచలంలో గిరిజన సమాఖ్య ఆవిర్భావమైందని, 15 ఏళ్లుగా గిరిజనుల హక్కుల కోసం సుదీర్ఘంగా పోరాటం సాగిస్తుందని అంజయ్యనాయక్ చెప్పారు. తొలుత చెన్నారెడ్డిగూడలో ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజు నాయక్, నాయకులు వెంకటేష్, రాజు, గణేష్, ప్రభృతులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ కోసం ఏఐవైఎఫ్ ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండు చేస్తూ మాసాబ్‌ట్యాంక్‌లోని ఉపాధి కల్పన కార్యాలయం ముందు ఏఐవైఎఫ్ హైదరాబాద్ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా జరిగింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ధర్నాలో మాట్లాడుతూ విద్యార్థి, యువకులు, సకల జనుల వీరోచిత పోరాట ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందన్నారు. రాష్ట్రం ఏర్పడి మూడున్నరేళ్లు అవుతున్నా ఖాళీ పోస్టులు ఇంకా భర్తీ చేయక పోవడం దారుణమన్నారు. నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంప్లాయిమెంట్ కార్యాలయాల్లో 13,03,770 మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వీరికి ఉద్యోగం లేదా ఉపాధి కల్పించాలని డిమాండు చేశారు. వివిధ కంపెనీల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నా మని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నదని, అందులో వాస్తవం లేదని ఆయన అన్నారు. ఇప్ప టికైనా ఉపాధి కల్పన కార్యాలయంలో పేరు నమోదు చేసుకున్న ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం లేదా ఉపాధి కల్పించాలన్నారు. ప్రభుత్వం లక్ష ఉద్యోగాల కల్పన హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. నిరుద్యోగులకు ప్రతి నెల రూ.5వేల నిరుద్యోగ భృతి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ నగర కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, నాయకులు హరినాథ్‌గౌడ్, ఆర్.బాలకృష్ణ, షేక్ మహమూద్, ఎం.చైతన్య యాదవ్, రాము, రమేశ్, భాషా, విఠల్ పాల్గొన్నారు.

మాది సరికొత్త పాలన

మంత్రి కె.తారకరామారావు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల అభీష్టం మేరకే పాలనా సంస్కరణలతో సరికొత్త పాలన అందిస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. అందులో భాగంగానే స్టేట్ యూనిఫైడ్ రూల్స్‌ని తీసుకు వచ్చామన్నారు. రాష్ట్ర టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సోమవారం ఖైరతాబాద్ లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యాలయంలో కేటీఆర్ సమావేశమయ్యారు. జీహెచ్ఎంసీ, డీటీసీపీ అధికారులు, రాష్ట్రంలోని టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సాధారణ పౌరులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అనుమతులు వచ్చేలా డీపీఎంఎస్ విధానాన్ని అమలులోకి తీసుకుని వచ్చామని, ఈ విధానంలో నెల రోజుల గడువును కుదించి 21 రోజుల్లో అన్ని అనుమతులు వచ్చేలా చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో లోపించిన పత్రాల తాలుకు సమాచారాన్ని దరఖాస్తుదారుడికి తెలియజేయాలని, అనుమతుల ప్రక్రియలోని అనవసర ఆలస్యాన్ని తగ్గించేందుకే ఈ విధానం తీసుకువచ్చామని మంత్రి వివరించారు. డీపీఎంఎస్ విధానం పట్ల టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, సంపూర్ణ పరిజ్ఞానంతో పనిచేయాలని మంత్రి అధికారులను కోరారు. ఆన్‌లైన్ విధానంపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 21 రోజుల గడువు లోపల అనుమతులు ఇవ్వకుండా ఆలస్యం చేసే అధికారులపైన పెనాల్టీలు వేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రతి మూడు నెలలకోసారి సమావేశం అవుతామన్న మంత్రి నూతనంగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో రోడ్ల విస్తరణ, అక్రమ కట్టడాలను అరికట్టడం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీంతోపాటు అన్ని మున్సిపాలిటీలలో లేఅవుట్లలోని ఖాళీ ప్రదేశాలు(ఓపెన్ ప్లాట్లు)ను కాపాడడంలో మున్సిపల్ కమిషనర్లతో కలిసి పనిచేయాలన్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టేందుక టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపైన వివరాలు అందించాలని సీడీఎంఏ శ్రీదేవి, డీటీసీపీ డైరెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం నడుస్తున్న ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని , టౌన్ ప్లానింగ్ అధికారులు తమ విధుల్లో టెక్నాలజీ సహకారంతో విధులు నిర్వర్తించేందుకు అవసరమైన సూచనలివ్వాలని కేటీఆర్ కోరారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు, సీడీఎంఏ, డీటీసీపీ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అరుదైన గుండె మార్పిడి శస్త్ర చికిత్స

డా.ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే నేతృత్వంలో వైద్య బృందం ఘనత



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అరుదైన గుండె మార్పిడి శస్త్ర చికిత్సను జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ (17) గుండెను ప్రత్యేక ఏర్పాట్ల మధ్య కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు తరలించి విజయవాడకు చెందిన 56 సంవత్సరాల వ్యక్తికి అమర్చారు. సాధారణ గుండె మార్పిడీలో రోగగ్రస్తమైన గుండెను తొలగించి ఆ స్థానంలో కొత్త గుండెను అమర్చుతారు, కానీ హెటిరోటాపిక్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్‌లో జబ్బుపడిన గుండెను దాని స్థానంలోనే కొనసాగిస్తూ కొత్త గుండెను దానికి అనుసంధానం చేస్తారు. ఈ విధంగా, రోగిలో రెండు గుండెలు ఉంటాయి. ఉన్న గుండెకు కొత్త గుండె సహాయపడుతూ రెండూ ఒక దానికి ఒకటి సమన్వయం చేసుకుంటూ శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా జరిగేందుకు దోహదపడతాయి. హెటిరోటాపిక్ గుండె మార్పిడి విధానం అనేది ఒక అరుదైన ప్రక్రియ, ప్రపంచవ్యాప్తంగా కొన్ని కేసులు మాత్రమే ఈ విధానంలో చేయడం జరిగింది. ఈ గుండె మార్పిడికై బ్రెయిన్ డెడ్‌తో మరణించిన బాలుడి నుంచి సేకరించిన గుండెను ఉపయోగించి, ప్రముఖ గుండె ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సల నిపుణుడు డా.ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే నేతృత్వంలోని వైద్య బృందం హెటిరోటోపిక్, పిగ్గీబ్యాక్ హార్ట్‌ట్రాన్స్ ప్లాంట్ గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. గ్రహీత వయస్సు దాత వయస్సు కన్నా ఎక్కువగా ఉండడం కారణంగా గుండె పరిమాణంలో తేడాను అధిగమించడానికి ఈ కొత్త విధానాన్ని అమలు చేశామని డాక్టర్. గోఖలే వెల్లడించారు.

ఎస్సీల అభివృద్ధికి కృషి

మంత్రి జగదీశ్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటేనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం జరుగుతుందని తమ ప్రభుత్వం నమ్ముతుందని, అందుకే అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపడుతుందని రాష్ట్ర విద్యుత్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎస్సీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు వాటిని సక్రమంగా అమలు చేస్తోందని చెప్పారు. అన్ని వర్గాలకు సమాన అవకాశాలతోనే అసమానతలు, వివక్షతను రూపుమాపవచ్చని వ్యాఖ్యానించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి గత ఆర్థిక సంవత్సంలో రూ.10వేల కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం వాటిని రూ.14,300కోట్లకు పెంచామన్నారు. ఇందులో ఇప్పటికే రూ.6,689కోట్లు ఖర్చు చేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలు ఎస్సీలకు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు కొత్తగా 11 ఎస్సీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేశామని, పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని, దీనివల్ల ఇప్పటికే 100మంది ఉద్యోగాలు సంపాదించినట్లు వివరించారు. త్వరలోనే ఎస్సీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా సైన్స్ పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కాంగ్రెస్ అంతర్గత కలహాలతోనే...

నల్గొండ జిల్లాలో గతంలోనూ హత్యలు జరిగాయని, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కలహాలే దీనికి కారణమని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. శ్రీనివాస్ హత్య కేసుతో టీఆర్ఎస్‌కు సంబంధం లేదని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ చూపుతున్న కాల్‌లిస్టు ఎవరిచ్చారో బయటపెట్టాలని మంత్రి డిమాండు చేశారు. మూడున్నరేళ్లలో నల్గొండలో 4-5 ఘటనలు జరిగాయని, ఇతర ప్రాంతాల్లో ఎందుకు జరగడం లేదో ప్రజలు గుర్తించాలన్నారు. 15 సంవత్సరాలుగా నల్గొండలో రాజకీయ హత్యలు జరుగుతునూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నర్సింహ హత్య జరిగిందన్నారు. శ్రీనివాస్ కేసుతో నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశంకు సంబంధం లేదన్నారు. శ్రీనివాస్‌కు ప్రాణభయం ఉన్నట్టు ఇంతవరకు ఫిర్యాదు చేయలేదన్నారు. 2019లో కాంగ్రెస్‌ను ప్రజలే ఎన్‌కౌంటర్ చేస్తారని వ్యాఖ్యానించారు..

23న వైద్య పరికరాల ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఇండియాలో అతిపెద్ద బి2బి మెడికల్ ఎక్విప్మెంట్ ట్రేడ్ ఫెయిర్ జరుగనుంది. మెడెక్స్ పార్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ప్రదర్శనలో సర్జికల్ కాటన్ నుంచి పెద్ద పెద్ద వైద్య పరికరాలను అందుబాటులో ఉంచనున్నట్లు కావేరి హాస్పిటల్ జాయింట్ ఎండీ మెడెక్స్ పార్ట్ ప్రమోటర్ డాక్టర్ మణివణ్ణన్ వెల్లడించారు. దాదాపు 5 వేల రకాలకు పైగా ఉత్పత్తులు ఇక్కడ ప్రదర్శనకు కొలువుదీరుతాయని అన్నారు. ఇదే తరహా ప్రదర్శనలు త్వరలోనే చెన్నై, ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, కోలకతా, కొలంబోలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పాశ్వాన్‌తో వినోద్ భేటీ

కంది రైతులను ఆదుకోవాలని వినతి



విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ: కంది రైతులను ఆదుకోవాలని కేంద్ర పౌర సరఫరాలు, ఆహార శాఖ మంత్రి రాం విలాస్ పాశ్వాన్‌ను కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బి. వినోద్ కుమార్ కోరారు. సోమవారం ఢిల్లీలోని కృషి భవన్‌లో పాశ్వాన్‌తో వినోద్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కందుల అధిక దిగుబడితో రేట్లు పడిపోయాయని, రైతులను ఆదుకునేలా పంటను కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు బి. వినోద్ కుమార్ మీడియాతో మాట్లా డుతూ, పీఎస్ఎఫ్ (ప్రైజ్ స్టేబిలైజేషన్ ఫండ్)లో కందులను కొనుగోలు చేయాలని కేంద్ర మంత్రిని కోరామని,తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన పాశ్వాన్ కందులు కొనుగోలు చేసేలా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది 2,8400 మెట్రిక్ టన్నుల కందిపంట ఉత్పత్తి అయిందన్నారు. అధిక దిగుబడి నేపథ్యంలో రైతులకు ఎంఎస్‌పీ దక్కేలా కందులు కొనుగోలు చేయాలని రాష్ట్ర మంత్రి హరీష్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి రెండు సార్లు కలిసారని, మంత్రి,ఎంపీల విజ్ఞప్తులతో కేంద్ర ప్రభుత్వం 1,67,000 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని,మిగిలిన లక్ష మెట్రిక్ టన్నుల పరిస్థితి కేంద్రమే చెప్పాలన్నారు. అన్ని పంటలకు ఎంఎస్‌పీ ఇస్తామని ప్రధాని మోడీ చెబుతున్నారని, అయితే ఇందుకు భిన్నంగా సాగైన పంటలో 30 శాతమే కేంద్రం కొంటామంటోందని, మరి 70 శాతం పంటను ఎవరు కొనాలని ఎంపీ వినోద్ ప్రశ్నించారు. సమావేశంలో తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌టీ దరఖాస్తుకు గడువు పెంపు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల దరఖాస్తుకు గడువు పెంచుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల కోసం పోటీ పరీక్షల అర్హత నిబంధనలను టీఎస్‌పీఎస్సీ సవరించింది. ఒకేషనల్ కోర్సులతో పాటు మరో 12 కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులను కూడా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు అర్హులుగా పరిగణిస్తూ నిబంధనలు సవరించింది. ఈ మేరకు దరఖాస్తుల గడువును ఈ నెల 25 వరకు పెంచింది. 200 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు టీఎస్‌పీఎస్సీ గతంలోనే నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

కన్నీటి గాథలు...

- అంతులేని నయీం అకృత్యాలు
- న్యాయ కోసం బాధితుల మొర

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: బెదిరించి తమ వ్యవసాయ భూములను నయీం లాక్కున్నాడు. తుపాకీ నుదుటన పెట్టి తమ విలువైన ఇంటి స్థలాన్ని నయీం పేరిట రాయించుకున్నాడు. తన ఏడెకరాల భూమిని బలవంతంగా లాక్కెళ్లి నయీం కుటుంబ సభ్యుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. కష్టపడి సంపాదించిన భూమిని బలవంతంగా తన పేరిట రాయించుకున్నాడు. లక్షలాది రూపాయల విలువల చేసే 1700 గజాల ఇళ్లను బలవంతంగా లాక్కున్నాడు. రూ.10 కోట్లు ఇస్తావా...చస్తావా అంటూ బెదిరించాడు. తుపాకీ గురిపెట్టి రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండు చేసి కిడ్నాప్ చేశాడు. నయీం ఆగడాలను తాళలేక రెండు సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడపాల్సి వచ్చింది. ఇలా ఒకటా... రెండా... అనేక ఘటనలను కళ్లారా చూశాం...తమ ఆస్తులు పోతేపోయాయి ప్రాణాలు దక్కితే చాలని భయంతో బతికాం అంటూ పలువురు నయీం బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఏమని చెప్పాలి, ఎంతని చెప్పాలి, మిమ్మల్ని చంపేస్తాం, మీ పిల్లల్ని చంపేస్తాం, మీ ఆస్తంతా రాసివ్వాలని నయీం డిమాండు చేశారని బాధితులు మొరపెట్టుకున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం జరిగిన సదస్సులో స్వయంగా బాధితులు పాల్గొని తమ గోడును, బాధను వినిపించారు. బాధితుడు అశోక్ మాట్లాడుతూ తన విలువైన 1700 గజాల భూమిని బెదిరింపులకు, మానసిక ఇబ్బందులకు గురిచేసి తన పేరిట రాయించుకున్నాడని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, ప్రభుత్వం న్యాయం చేయాలని విన్నవించారు. గోకుల్ బ్యాంక్ చైర్మన్, బాధితుడు జగదీష్ మాట్లాడుతూ తనకు రూ.10 కోట్లు ఇవ్వాలని బెదిరించి, కిడ్నాప్ చేశారని తెలిపారు. చివరికి రూ.5 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించానని, నయీం బతికుండగానే ఈ సేవకు చెందిన రూ.3.50 కోట్లు చెల్లించానని తెలిపాడు. తనదగ్గర డబ్బులేదని, బ్యాంకులో 13 వేల మంది ఖాతాదారులు చెప్పినా వినిపించుకోకుండా బలవంతంగా డబ్బు లాక్కున్నాడని ఆందోళన వ్యక్తం చేశాడు. మరోబాధితుడు రామచంద్రారెడ్డి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ... కోట్లాది రూపాయల విలువ చేసే వ్యవసాయ భూమిని లాక్కున్నాడని, ఎంతోమంది పోలీసు అధికారుల వద్దకు వెళ్లినా న్యాయం దక్కలేదన్నారు. తన ఆరెకరాల భూమిని నయీం పేరిట రాయించుకున్నాడని మరో బాధిత రైతు బి.రామిరెడ్డి కన్నీరు మున్నీరయ్యారు. భూమి ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించడంతో పాటు తనను కిడ్నాప్ చేశాడని, గత్యంతరం లేని పరిస్థితిలో భూమి రాసివ్వాల్సి వచ్చిందన్నారు. వజ్రేస్వరిదేవి మాట్లాడుతూ నగరంలోని కామినేని ఆసుపత్రి వద్ద ఉన్న 2 వేల గజాల భూమిని నయీం తన పేరిట రాయించుకున్నాడని తెలిపారు. అంతటితో ఆగకుండా అమానుషంగా తన భర్తను చంపి తనను వీధులపాలు చేశాడని మొరపెట్టుకుంది. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, బ్రతుకు ఎలా సాగించాలో అంతుపట్టని పరిస్థితి నెలకొందన్నారు. బాధితులు అశోక్, కళాపతి, సత్యనారాయణ, హనుమయ్యగుప్త, పాపిరెడ్డి ప్రభృతులు తమ గోడును వెల్లబోసుకున్నారు.

ఏటీఎం యంత్రం దహనం

- ఓ యువకుడి దుశ్చర్య
- ఘటనాస్థలంలో లేఖ లభ్యం

హైదరాబాద్: తాను రాసిన లేఖ వెలుగులోకి రావడానికి ఓ యువకుడు ఏటీఎం యంత్రాన్ని తగులబెట్టిన ఘటన నగరంలోని కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. అతడు ఘటనాస్థలంలో వదిలివెళ్లిన లేఖలో ముఖ్యాంశాలను పోలీసులు విశ్లేషించారు. సీఐ కుశాల్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురు తెలియని వ్యక్తి కాలనీ ఒకటోఫేజ్‌లోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ఏటీఎం యంత్రాన్ని తగులబెట్టాడు. ముందుగా ఒక కవర్‌లో మంటలు ఏర్పడే మిశ్రమ న్ని ఏటీఎం యంత్రంపై ఉంచాడు. తర్వాత కవర్‌లోని కేబుల్ బయటవరకు తీసుకువచ్చి నిప్పుపెట్టాడు. కేబుల్ ద్వారా నిప్పు ఏటీఎం యంత్రంపై ఉంచిన మిశ్రమానికి అంటుకోవడంతో యంత్రం డిస్‌ప్లే, గదిలోని రెండు సీసీ కెమేరాలు కాలిపోయాయి. కెమేరాలు ధ్వంసం కాకముందు నమోదైన ఫుటేజీలను పోలీసులు పరిశీలించడంతో నిందితుడు ఏటీఎం యంత్రాన్ని తగలబెట్టిన తీరు వెల్లడైంది. యంత్రంలోని నగదు భద్రంగానే ఉంది. ఇతనికి సుమారు 25ఏళ్లు ఉంటాయని, ఘటన సమయంలో ముఖానికి చేతి రుమాలు ధరించాడని పోలీసులు గుర్తించారు. ప్రపంచంలో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటు న్నారని, వాటిని పరిష్కరించాలంటూ నిందితుడు 17పేజీల లేఖ రాసి వదిలి వెళ్లాడు. వ్యక్తులకు ప్రపంచమంతటా ఒకే గుర్తింపుకార్డు ఉండాలని, కులమత భేదాలతో పాటు రిజర్వేషన్లు ఉండకూడదని ప్రస్తావించాడు. ఆకలిచావులు అరికట్టే బాధ్యతలను ప్రభుత్వాలు తీసుకోవాలన్నాడు. విద్య, వైద్యం, శాంతి భద్రతల వ్యవస్థలు మెరుగుపడాల్సి ఉందని, పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరాడు. మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నందున వాటిని నివారించేం దుకు వ్యభిచారాన్ని చట్టబద్ధం చేయాలన్నాడు. తన లేఖను 24గంటల్లోపు మీడియాలో ప్రచురించాలని, లేనిపక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొన్నాడు. నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశామని సీఐ చెప్పారు.

ఉపాధి హామీ నిర్వీర్యం

కేసీఆర్ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నాలుగు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు కూలి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. సోమవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కార్మికనేతలతో కుంతియా, సంజీవరెడ్డి, ఉత్తమ్ సమావేశమయ్యారు. అనంతరం కూలీలతో సమావేశమయ్యారు. వారి సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిర్వీర్యానికి ప్రభుత్వ కుట్రలు చేస్తోందని నాయకులు విమర్శించారు. అలాంటి ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపాధి కూలీలకు కనీసం కూలి కూడా ఇవ్వలేకపోతున్నా రని హేళన చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా తీసుకొచ్చిందని అన్నారు. ఈ చట్టం కోట్లాది మంది నిరు పేదల జీవితాల్లో వెలుగునింపిందన్నారు. మోడీ సర్కార్ అదానీ, అంబానీల కోసం పనిచేస్తోందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులు ఒక్కటైతే ఏ ప్రభుత్వమైనా దిగిరావాల్సిందేనన్నారు. కార్మికులంతా సంఘటితమై హక్కుల కోసం పోరా డాలని, కాంగ్రెస్ మద్దతుగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు.

ఓటర్ల సవరణ గడువు పెంచండి

ఓటర్ల సవరణ కోసం ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువును మరో మూడువారాలు పొడిగించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఓటర్ల సవరణ కోసం ప్రత్యేక క్యాంపులు పెట్టినా అధికారులు అందుబాటులో లేరని ఆయన అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశం చైర్మన్ మర్రి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఏఐసీసీ ఇన్‌చార్జ్ కుంతియా పాల్గొన్నారు. రాష్ట్రంలో ఓటర్ల సవరణకు సంబంధించిన వివరాలను మర్రి శశిధర్‌రెడ్డి వివరించారు. 5 నుంచి 10వ తేదీ వరకు తమ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ జిల్లాలలో పర్యటించిం దని, ఓటర్ల చేర్పులు, మార్పుల్లో అనేక అక్రమాలు జరిగాయని, అశాస్త్రీయంగా ఓటర్ల తొలగింపు జరిగిందని ఆయన వివరించారు. ఈ నెల 4వ తేదీన, 11వ తేదీన స్పెషల్ క్యాంపెయిన్ కోసం గ్రామాలలో సవరణ క్యాంపులు పెడతామని ఎన్నికల సంఘం ప్రకటించిందని, అయితే చాలా క్యాంపులకు అధికారులు ఎవరూ రాలేదని, అలాంటప్పుడు ఓటర్లు ఎవరి వద్ద తమ ఫిర్యాదులు నమోదు చేస్తారని ప్రశ్నిం చారు. నియోజకవర్గ స్థాయిలోనూ అధికారులు అందు బాటులో లేరన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల సవరణ గడువును మూడు వారాల పాటు పొడిగించాలని కోరుతూ ఈసీకి లేఖ రాయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జి.నిరంజన్, కమలాకరరావు, వినోద్ రెడ్డి, టి.రాజేశ్వర్, టి.నరేందర్, పి.రాజేశ్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో డమ్మీ జాబితా

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన 60 మంది అభ్యర్థులతో కూడిన జాబితా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో కాంగ్రెస్ క్యాడర్ అంతా కలవరానికి గురయ్యారు. చివరకు టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకుని ఈ లిస్ట్‌తో పార్టీకి ఏలాంటి సంబంధం లేదని ప్రకటించడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం 60మందితో కూడిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను రాష్ట్ర పీసీసీ,ఏఐసీసీకి పంపిందంటూ సోషల్‌మీడియాలో చక్కెర్లు కొటింది. దీంతో రాష్ట్ర పార్టీ నాయకత్వం ఏం జరుగుతుందనే విషయంపై ఆరా తీశారు. చివరకు ఇలాంటి జాబితా ఏది కూడా రాష్ట్ర పార్టీ అధిష్టానికి పంపలేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇలాంటి జాబితాలను కాంగ్రెస్ కార్యకర్తలు నమ్మవద్దని, ఏలాంటి అపోహలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. శాసనమండలి విపక్ష ఉపనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కావాలనే ఇలాంటి జాబితాను విడుదల చేసి కాంగ్రెస్‌లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. అధికార పార్టీ లబ్ది పొందే కుట్ర కోణంతో దీన్ని చూడాల్సి వస్తుందని, ఈ జాబితాలోని వాగ్గేలా మిత్రసేన మరణించారని, వీటిని కార్యకర్తలు గుర్తించాలన్నారు.

సిరీసే లక్ష్యంగా...!

- నేడు ప్రొటీస్‌తో ఐదో వన్డే
- కలసిరాని పోర్టు ఎలిజబెత్
- గెలిస్తే చరిత్రే..!

పోర్ట్ ఎలిజబెత్:
వరుస విజయాలతో ఊపు మీదున్న కోహ్లిసేనకు నాలుగో వన్డే గులాబీ రంగు రూపంలో షాకిచ్చింది దక్షిణాఫ్రికా. ఇటు మెరుపులు అటు వర్షంతో రెండుసార్లు విరామం రావడంతో 28 ఓవర్లకు కుదించిన మ్యాచులో టీ20 తరహాలో బ్యాటింగ్ చేసి సఫారీలు విజయం సాధించారు. ఏకపక్షంగా మారిన సిరీస్‌ను రసవత్తరంగా మార్చేశారు. అచ్చిరాని పోర్ట్ ఎలిజబెత్‌లో టీమిండియా మంగళవారమే ఐదో వన్డేలో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఇందులో విజయం సాధించేస్తే కోహ్లిసేన సఫారీ గడ్డపై సిరీస్ గెలిచిన భారత తొలి జట్టుగా చరిత్ర తిరగరాస్తుంది. లేదంటే ఆత్మవిశ్వాసంతో పుంజుకున్న ఆతిథ్య జట్టుతో చివరి వన్డేలో చావో రేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి తప్పదు. ఇప్పటి వరకు ఆరు వన్డేల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 3-1తో ఆధిక్యంలో ఉంది. మరొక్క మ్యాచ్ గెలిస్తే చాలు సిరీస్ సొంతం అవుతుంది. టీమిండియా డర్బన్‌లో 6 వికెట్లు, సెంచూరియన్‌లో 9 వికెట్లు, కేప్‌టౌన్‌లో 124 పరుగుల తేడాతో విజయాలు సాధించింది. అయితే ఏబీడీ రాకతో పుంజుకున్న సఫారీలు జొహనెస్‌బర్గ్ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపు సొంతం చేసుకున్నారు. ఐదో మ్యాచ్ జరగనున్న సెయింట్ జార్జ్ పార్క్‌లో భారత్‌కు అంత మెరుగైన రికార్డేమీ లేదు. 1992 నుంచి ఇక్కడ జరిగిన ఐదు మ్యాచుల్లోనూ ఓటమి పాలైంది. ఒక్క పోరులోనూ 200 పైచిలుకు పరుగులు నమోదు చేయలేదు.

వీక్‌గా మిడిలార్డర్
ఇప్పటి వరకు జరిగిన నాలుగు వన్డేల్లో టీమిండియా సారథి విరాట్ కోహ్లి (393 పరుగులు), ఓపెనర్ శిఖర్ ధావన్ (271) చెలరేగి ఆడారు. కోహ్లి అయితే తన కెరీర్‌లో అత్యద్భుతమని చెప్పే ఇన్నింగ్స్ ఆడాడు. సిరీస్‌లో మిగతా బ్యాట్స్‌మెన్ అంతా చేసిన 239 కన్నా వీరిద్దరు కలిపి చేసిన పరుగులే మూడు రెట్లు అధికం. అయితే మరో ఓపెనర్ రోహిత్ శర్మ ఆటతీరు అందరినీ కలవరపెడుతోంది. బౌన్సీ, సీమ్ పిచ్‌లపై అతడి ఆట బాగాలేదు. ప్రతిసారీ రబద బౌలింగ్‌లోనే ఔటవుతున్నాడు. నాలుగో స్థానంలో ఆడుతున్న అజింక్య రహానె తొలి మ్యాచ్‌లో 79 పరుగులు చేసినా తర్వాత మ్యాచుల్లో 11, 8 మాత్రమే చేశాడు. ఒకదాంట్లో అవకాశం రాలేదు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య సైతం ఆశించిన మేరకు రాణించడం లేదు. అటు బంతితో.. బ్యాటుతో సాధించిందేమీ లేదు. ధోనీ నాలుగో వన్డేలో కష్టపడి 42 నాటౌట్ (43 బంతుల్లో)గా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ కొత్త కుర్రాడన్న సంగతి తెలిసిందే. స్లో స్పిన్ వేయగల బ్యాట్స్‌మన్ కేదార్ జాదవ్ గాయపడడం కాస్త ఇబ్బందికరమే.

సాయంత్రం 4:30 గంటలకు మ్యాచ్ ఆరంభం

స్పిన్నర్ల స్వర్గధామం
ఐదో వన్డే జరగనున్న పోర్ట్ ఎలిజబెత్ స్పిన్నర్ల స్వర్గధామం. ఇక్కడ ఆతిథ్య జట్టు ఆడిన చివరి రెండు వన్డేల్లో స్పిన్నర్లే కీలకంగా నిలిచారు. 2017లో శ్రీలంకపై ఇమ్రాన్ తాహిర్ 26 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. 2016 అక్టోబర్‌లో ఆస్ట్రేలియాపై షంషీ 3/36తో నిలిచాడు. మరో స్పిన్నర్ ఆరోన్ ఫంగిసో 2/17తో రాణించాడు. అంటే ఈ మ్యాచ్‌లోనూ భారత్‌కు స్పిన్నర్లే కీలకంగా మారే అవకాశం ఉంది. నాలుగో వన్డేలో కుల్‌దీప్, చాహల్ బౌలింగ్‌లో ఆతిథ్య బ్యాట్స్‌మెన్ ధారాళంగా పరుగులు సాధించినా ఈ మ్యాచ్‌ను వారే మలుపు తిప్పగలరు! గత మ్యాచ్‌లో విరామాలతో లయ దెబ్బతినడం, పిచ్, ఔట్ ఫీల్డ్ తడిసిపోవడం మణికట్టు ద్వయానికి కలిసిరాలేదు. సారథి కోహ్లి, జట్టు మేనేజ్‌మెంట్ వారిపై విశ్వాసం ఉంచింది. ఇక పోర్ట్ ఎలిజబెత్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లో భారత్ సాధించిన అత్యధిక పరుగులు 176. దక్షిణాఫ్రికాపై 2001లో ఆ పరుగులు సాధించింది.



ఇక్కడే కెన్యాపైనా ఓడిపోవడం గమనార్హం. ఆతిథ్య జట్టు ఇక్కడ 32 మ్యాచ్‌లు ఆడగా 11 మాత్రమే ఓడిపోయింది. అయితే గత అనుభవాలను పట్టించుకోకుండా విశ్వాసంతో అద్భుత ప్రదర్శనలు చేస్తే విజయం కోహ్లిసేన వశం కాగలదు! వైవిధ్యంగా స్పిన్ బౌలింగ్ వేయగల కేదార్ జాదవ్ జట్టులో ఉంటే స్పిన్ దళానికి మరింత బలం చేకూరేది. ఇప్పుడు శ్రేయస్ అయ్యరే మిగిలిన వనరు.

జట్లు:

భారత్:
విరాట్ కోహ్లి (కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్య రహానె, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్య, యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, షమి, శార్దూల్ ఠాకూర్

దక్షిణాఫ్రికా:
అయిడెన్ మార్క్రమ్ (సారథి), హషీమ్ ఆమ్లా, జేపీ డుమిని, ఇమ్రాన్ తాహిర్, డేవిడ్ మిల్లర్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగి ఎంగిడి, అండిలే ఫెలుక్‌వాయో, రబాడ, తబ్రైజ్ షంషీ, జొండొ, ఫర్హాన్ బెహార్డీన్, హెన్రిచ్ క్లాసెన్, ఏబీ డివిలియర్స్



టికెట్ కోసం వస్తే...

జట్టులో చోటు దక్కింది..!

పోర్ట్ ఎలిజబెత్:
కొద్ది వారాల క్రితం ఓ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ భారత్-దక్షిణాఫ్రికా మధ్య నాలుగో వన్డేను కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యక్షంగా చూసేందుకు నిర్వాహకులను టికెట్లు అడిగాడు. కానీ, అతనికి టికెట్లు దొరకలేదు. దీంతో ఆ ఆటగాడు తీవ్ర నిరాశ చెందాడు. ఇక దాని గురించి ఆలోచించడమే మానేశాడు. కానీ, ఓ రోజు ఏకంగా దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు నుంచి అతడికి ఫోన్ వచ్చింది. 'జట్టులో కీపర్, బ్యాట్స్‌మెన్ డీకాక్ గాయపడ్డాడు. దీంతో అతడు భారత్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో నిన్ను జట్టులోకి ఎంచుకున్నాం' అని తెలిపారు. దీంతో అతడు ఎగిరి గంతేశాడు. అంతేకాదండోయ్ ఏ మ్యాచ్ చూసేందుకు అయితే అతనికి టికెట్లు దక్కలేదో ఆ మ్యాచ్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇంతకీ అతగాడు ఎవరంటే.. హెన్రిచ్ క్లాసెన్. భారత్-దక్షిణాఫ్రికా మధ్య శనివారం జరిగిన నాలుగో వన్డేలో 27 బంతుల్లో 43 పరుగులు చేసి భారత్ ఓటమికి కారకుడయ్యాడు క్లాసెన్. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న క్లాసెన్ తన అనుభవాలను మీడియాతో పంచుకున్నాడు. 'కొద్ది రోజుల క్రితం జొహానెస్‌బర్గ్‌లో జరగబోయే ఈ గులాబీ రంగు వన్డేను కుటుంబసభ్యులతో కలిసి చూడాలనుకున్నాను. కానీ, టికెట్లు దొరకలేదు. ఆ తర్వాత అనుకోకుండా ఒకరోజు బోర్డు సెలక్టర్ల నుంచి ఫోన్ వచ్చింది. డీకాక్ స్థానంలో జట్టులోకి రావాల్సిందిగా కోరారు. టికెట్ల కోసం ప్రయత్నిస్తున్న నాకు ఏకంగా జట్టులో చోటు దక్కడంతో ఇక నా ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. కేప్‌టౌన్‌లో జరిగిన వన్డేలో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాను. ఈ మ్యాచ్‌లో 6 పరుగులే చేశాను. జట్టు ఓటమి పాలైంది. జొహానెస్‌బర్గ్ వన్డే మాకు చాలా కీలకమైంది. ఇది ఓడితే మేము సిరీస్ చేజార్చుకున్నట్లే. కీలక మ్యాచ్‌లో బాగా ఆడటం, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.' అని క్లాసెన్ వివరించాడు.

వివాదంలో ఇమ్రాన్ తాహిర్



జొహానెస్‌బర్గ్:
దక్షిణాఫ్రికా ఆటగాడు ఇమ్రాన్ తాహిర్ వివాదంలో చిక్కుకున్నాడు. జొహానెస్‌బర్గ్‌లో భారత్-దక్షిణాఫ్రికా మధ్య నాలుగో వన్డేలో తాహిర్ అభిమానులపై మాటల యుద్ధానికి దిగాడు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. దీనిపై దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు కూడా విచారణ చేపట్టింది. అసలేం జరిగిందంటే.. భారత్-దక్షిణాఫ్రికా మధ్య శనివారం నాలుగో వన్డే జరిగిన సంగతి తెలిసిందే. ఈ వన్డేలో తుది పదకొండులో చోటు దక్కించుకోలేదు తాహిర్. మధ్యమధ్యలో ఆటగాళ్లకు డ్రింక్స్ అందజేస్తూ కనిపించాడు. ఈ నేపథ్యంలో తాహిర్ డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళు న్న క్రమంలో ఓ అభిమాని తాహిర్‌ను అసభ్యపదజాలంతో దూషించాడు. అది విన్న తాహిర్ సదరు అభిమానితో ఘర్షణకు దిగాడు. ఇంతలో భద్రతా సిబ్బంది కలగజేసుకుని తాహిర్‌ను అక్కడి నుంచి పంపించి వేశారు. అనంతరం క్రికెటర్‌తో గొడవపడిన అభిమానిని స్టేడియం నుంచి బయటికి పంపారు. తాహిర్-అభిమాని ఘర్షణ పడుతుండగా పక్కన ఉన్న వారు ఎవరో ఆ తతంగాన్ని వీడియో తీశారు. ఇప్పుడు ఈ వీడయో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. ఈ ఘటనలో నా తప్పు లేదంటే.. నా తప్పు లేదంటూ తాహిర్, ఆ అభిమాని వెల్లడించారు. ఈ ఘటనపై దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు విచారణకు ఆదేశించింది. విచారణలో తాహిర్ తప్పు ఉందని తేలితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు తెలిపారు.

నో బాల్.. కొంపముంచింది : సన్నీ

న్యూఢిల్లీ:



భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన నాలుగో వన్డేలో చాహల్ వేసిన నో బాల్‌పై మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్లు ఎదురుదాడికి దిగడంతో భారత్ స్పిన్నర్లు లయ కోల్పోయారు. ముఖ్యంగా చాహల్ ఎలా పడితే అలా బంతులేశాడు. మంచి బంతితో మిల్లర్‌ను ఔట్ చేసినా.. అది కాస్తా రివ్యూలో నోబాల్‌గా తేలింది. దీంతో ఊపిరి పీల్చుకున్న మిల్లర్ ఆ తర్వాత చెలరేగి ఆడాడు. 28 బంతుల్లో 39 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. తాజాగా భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ..'డివిలియర్స్‌ను ముందుగానే పెవిలియన్‌కు పంపడంతో నాలుగో వన్డేలో భారత్ గెలుపు ఖాయమనుకున్నారు. కానీ, చాహల్ నోబాల్ భారత్‌ను ఓటమి వైపు నడిపించింది. అతడి నోబాల్ కారణంగా డేవిడ్ మిల్లర్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పుకున్నాడు. ఇదే ఈ మ్యాచ్‌లో కీలక మలుపు. ఆ తర్వాత మిల్లర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అలాగే కాస్లెన్ కూడా బాగా ఆడాడు. మోడ్రన్ డే క్రికెట్‌లో స్పిన్నర్లు నోబాల్స్ వేయడం లేదు. ఫాస్ట్ బౌలర్లు వేగంగా వచ్చి బంతిని విసిరే క్రమంలో ఒక్కోసారి నోబాల్స్ పడొచ్చు. కానీ, ఈ మధ్య వారు కూడా చాలా తగ్గించేశారు. స్పిన్నర్లు నోబాల్స్ వేయడం ఆశ్చర్యం కలిగించే అంశం. చాహల్ వేసిన బంతి నన్ను తీవ్ర నిరాశకు గురి చేసింది' అని గవాస్కర్ చెప్పాడు.

PSL
Pakistan Super League

కరాచిలో పీఎస్ఎల్ ఫైనల్

కరాచి:
పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) నిర్వహిస్తోన్న ట్వంటీ20 లీగ్ పాకిస్థాన్ సూపర్ లీగ్(పీఎస్ఎల్) మూడో సీజన్ ఈనెల 22న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రారంభంకానుంది. ఐతే టోర్నమెంట్లోని రెండు ప్లే-ఆఫ్ల మ్యాచ్‌లను మార్చి 20-21న ఫైనల్‌ను కరాచి వేదికగా మార్చి 25న నిర్వహించనున్నారు. లాహోర్‌లో 2009లో శ్రీలంక ఆటగాళ్లపై జరిగిన ఉగ్రవాదుల దాడి అనంతరం అక్కడ అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగని విషయం తెలిసిందే. గతేడాది పీఎస్ఎల్ ఫైనల్ మ్యాచ్‌ను లాహోర్‌లో నిర్వహించారు. కొంతమంది విదేశీ ఆటగాళ్లు ఇక్కడ పర్యటించగా ఎక్కువ మంది భద్రత కారణాలను చూపుతూ దూరంగా ఉన్నారు. పీఎస్ ఎల్‌లో ఆరు ఫ్రాంఛైజీలు ఉండగా ప్రతి జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లను తుదిజట్టులోకి తీసుకో వచ్చు. ఈ నేపథ్యంలో కరాచీలో మ్యాచ్‌ల నిర్వహణ కోసం చేస్తున్న భద్రతా ఏర్పాట్లను ఆదివారం విదేశీ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ నగరంలో దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత ఓ అంతర్జాతీయస్థాయి క్రికెట్ మ్యాచ్ జరగబోతోంది.

ఆసిస్ కెప్టెన్‌కు అరుదైన గౌరవం

మెల్‌బోర్న్:
ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కి అరుదైన గౌరవం దక్కింది. యాషెస్ సిరీస్‌లో అద్భుతంగా రాణించి ఎన్నో రికార్డులను సొంతం చేసుకున్న స్మిత్ 'ఆస్ట్రేలియా టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచాడు. మెల్‌బోర్న్‌లో జరిగిన ఓ వేడుకలో ఆస్ట్రేలియా క్రికెటర్లకు ఇచ్చి ప్రతిష్టాత్మక 'అలెన్ బార్డర్' మెడల్‌ను స్మిత్ రెండోసారి అందుకున్నాడు. స్మిత్‌తో పాటు 'ఉమెన్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచిన ఆస్ట్రేలియా మహిళ క్రికెట్ క్రీడాకారిణి ఎలీస్ పెర్రీ రెండోసారి 'బెలిండా క్లార్క్' అవార్డును సొంతం చేసుకుంది. వీరితో పాటు ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా, ఆరోన్ ఫించ్ 'టీ-20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచారు.



నాగర్‌కోటికి నజరానా..!

జైపూర్:
ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ గెలుచుకున్న భారత జట్టులో సభ్యుడైన నాగర్‌కోటికి రాజస్థాన్ ప్రభుత్వం తాజాగా రూ.25లక్షల నజరానా ప్రకటించింది. సోమవారం రాజస్థాన్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధర రాజే బడ్జెట్ ప్రసంగంలో నాగర్‌కోటికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రూ.25లక్షల నజరానా అందజేస్తున్నట్లు ప్రకటించారు. గత నెల న్యూజిలాండ్ వేదికగా జరిగిన అండర్-19ప్రపంచకప్ ఫైనల్లో భారత్.. ఆసీస్‌ను చిత్తు చేసి ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. టోర్నీలో భారత్ విజయాల్లో నాగర్‌కోటి కీలక పాత్ర పోషించాడు. 140కి.మీ స్పీడుకు ఏమాత్రం తగ్గకుండా కళ్లు చెదిరే బంతులతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించాడు. ఈ యువ ఆటగాడు ఐపీఎల్‌లోనూ ఎక్కువ ధరే పలికాడు.



రూ.3.2కోట్లు పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ నాగర్‌కోటిని సొంతం చేసుకుంది. ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులోని ఒక్కో ఆటగాడికి బీసీసీఐ నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. అండర్-19 జట్టు సారథి పృథ్వీ షాకు ముంబై క్రికెట్ అసోసియేషన్ రూ.25లక్షలు ప్రకటించిన సంగతి తెలిసిందే..

ఇకపై.. ఏటా మంచు క్రికెట్



న్యూఢిల్లీ:
ఈ ఏడాది స్విట్జర్లాండ్‌లోని సెయింట్ మోర్టిజ్‌లో జరిగిన ఐస్ క్రికెట్ టోర్నమెంట్‌కి అసాధారణ స్పందన వచ్చింది. దీంతో ఈ టోర్నమెంట్‌ని ప్రతి ఏడాది నిర్వహించాలని టోర్నమెంట్ ప్రచారకర్తలు భావిస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయినా క్రికెట్ దిగ్గజాలు ఈ టోర్నీలో పాల్గొన్నారు. దీంతో ఈ క్రికెట్ చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు. దీంతో ఈ క్రికెట్‌ని ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ప్రచారకర్తలు అఖిలేష్ బహుగుణ, విజయ్ సింగ్ తెలిపారు. "ఈ టోర్నమెంట్‌కు అసాధారణ స్పందన వచ్చింది. ప్రపంచంలోని ప్రముఖ క్రికెటర్లు ఈ టోర్నీలో పాల్గొనడంతో దీన్ని ప్రతిసారి నిర్వహించాలనుకుంటున్నాం. వచ్చే ఏడాది టోర్నీలో మూడు మ్యాచ్‌లు నిర్వహించడమే మా లక్ష్యం" అని వాళ్ల పేర్కొన్నారు. ఈ ఏడాది ప్యాలెస్ డైమండ్స్, రాయల్స్ మధ్య ఉత్కంఠభరితంగా రెండు టీ-20 మ్యాచ్‌లు జరిగాయి. ఈ రెండు మ్యాచుల్లోనూ రాయల్స్ జట్టు ఘన విజయం సాధించింది.

పాక్ మానవ హక్కుల కార్యకర్త

ఆస్మా కన్నుమూత

ఇస్లామాబాద్:



పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, మానవ హక్కుల న్యాయవాది ఆస్మా జహంగీర్(66) గుండె పోటుతో ఆదివారం కన్ను మూశారు. పాక్ సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి మహిళ ఆస్మానే. సైన్యంపై ఆమె బహిరంగంగానే విమర్శలు సంధించే వారు. 'ఆదివారం ఉదయం ఆస్మాకు గుండె పోటు వచ్చింది. లాహోర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడే ఆమె తుది శ్వాస విడిచారు' అని ఆమె కుమార్తె మునీజే జహంగీర్ తెలిపారు. లాహోర్‌లో 1952 జనవరిలో ఆస్మా జన్మించారు. ఆమె మహిళలకు, మైనారిటీలకు జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా ప్రతిఘటించే వారు.

అవిశ్రాంత పోరా యోధ : సురవరం సంతాపం
పాకిస్తాన్‌లో మానవహక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణకోసం ధైర్యసాహసాలతో అవిశ్రాంతగా పోరాడిన ఆస్మా జహంగీర్ మృతికి సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. జియా ఉల్‌హక్, జనరల్ ముషారఫ్‌ల నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాటం జరపడంతో ముస్లిం ఛాందసవాదులనుంచి ఆమె అనేక బెదిరింపులను, అవమానాలను ఎదుర్కొన్నారు. పలుమార్లు అరెస్టయి జైలు జీవితం గడిపారు. మహిళ హక్కుల పోరాట యోధురాలు. ప్రాణానికి ముప్పుఉందని తెలిసినప్పటికీ ఆమె మత ఛాందసవాదుల బెదిరింపులకు వ్యతిరేకంగా కరాచి నగరంలో ప్రదర్శనలు నిర్వహించారు. సైనిక నియంతృత్వంపై ఆమె నిశితంగా విమర్శించేవారు. పాకిస్తాన్ సుప్రీంకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షురాలిగా ఆమె పనిచేశారు. న్యాయవాదులు, మేధావులలో ఆమెకు ఎంతగానో ఆదరణ ఉంది. పాకిస్తాన్‌లో దక్షిణాసియా జర్నలిస్టుల అసోసియేషన్ నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లో భారతదేశం తరఫున పాల్గొన్న పార్లమెంటరీ బృందంలో నేను కూడా ఉన్నాను. సెమినార్‌లో ఆమెను కలుసుకుని ఆమెతో వేదికను పంచుకున్నాను. యునెస్కో ఇంకా అనేక అంతర్జాతీయ సంస్థలు ఆమెను గౌరవించాయి. పాకిస్థాన్‌లోనే కాక అన్ని చోట్లా ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులకు ఆమె గొప్ప స్ఫూర్తిగా నిలుస్తారు. ఆస్మా జహంగీర్ అకాలమృతికి సీపీఐ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేస్తూ ఆమెకు ఘన నివాళి అర్పిస్తున్నది.

ఒమన్‌తో చెలిమి బలోపేతం : మోడీ

మస్కట్:
ఒమన్‌లో తన పర్యటన, భారీ చమురు నిల్వలు కలిగిన గల్ఫ్ దేశ ఉన్నత నాయకత్వంతో జరిపిన చర్చలు ద్వైపాక్షిక సంబంధాలన్నింటిని బలోపేతం చేస్తాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం అన్నారు. 'ఒమన్‌లో ఈ పర్యటన భవిష్యత్తుకు దోహదపడుతుంది' అని మోడీ తన రెండు రోజుల ఒమన్ పర్యటన ముగింపు సందర్భంగా ట్వీట్ చేశారు. రక్షణ సహకారం పెంపుతో సహా ఎనిమిది ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. 'మన ఔత్సాహిక ప్రజల మధ్య శతాబ్దాల నాటి సంబంధాలను తిరిగి నిర్మించడానికి ఈ పర్యటన దోహదపడుతుంది. అలాగే వాణిజ్య, పెట్టుబడి సంబంధాలతో సహా అన్ని రంగాల్లో మన సంబంధాలు బలోపేతమవుతాయి' అని మోడీ పేర్కొన్నారు. 'మీ అసాధారణ ఆతిథ్యం, ఆత్మీయత, స్నేహానికి, మీ వ్యక్తిగత శ్రద్ధకు గౌరవనీయ సుల్తాన్ కబూస్(బిన్ సెద్ అల్ సెద్)కు కృతజ్ఞతలు. నా అత్యంత చిరస్మరణీయ పర్యటనలలో ఒమన్ పర్యటన ఒకటి' అని ప్రధాన మంత్రి తెలిపారు. ఒమన్ ప్రజల అద్భుతమైన మద్దతు, ఆదరాభిమానానికి, సుల్తాన్‌కు మోడీ ధన్యవాదాలు తెలిపారు. 'మీ దేశ 50వ వార్షికోత్సవం కోసం



ఎదురుచూస్తున్నాం. మేము ఎంతో గౌరవిస్తున్నాం' అని యూఏఈ, ఒమన్, పాలస్తీనా దేశాల్లో తన పర్యటనలను ముగించుకున్న మోడీ అన్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా దుబాయ్ నుంచి ఇక్కడకు చేరుకున్న మోడీ, ఒక విస్తృత స్థాయి అంశాలపై గత రాత్రి సుల్తాన్ కబూస్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో రెండు దేశాల మధ్య ప్రస్తుత సహకారానికి సంబంధించిన అనేక అంశాలతోపాటు సంబంధాల మెరుగుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించినట్లు ఒమన్ అధికార వార్తా సంస్థ పేర్కొంది. ఆహార భద్రత, ప్రాంతీయ సమస్యలు, రక్షణ, భద్రత, ఇంధన వనరులు, వాణిజ్యం, పెట్టుబడుల్లో సహకారం బలోపేతానికి సంబంధించి రెండు వ్యూహాత్మక భాగస్వామ్యులు చర్చించినట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ ట్వీట్ చేశారు. ఒమన్ అభివృద్ధికి దోహదపడుతున్న నిజాయతీపరులైన, కష్టించి పని చేస్తున్న భారతీయుల కృషిని సుల్తాన్ ఖబూస్ అభినందించారు.

ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు
రక్షణ, ఆరోగ్యం, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారంపై భారత్, ఒమన్ దేశాలు ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు చేశాయి. వీటిలో పౌర, వాణిజ్య అంశాల్లో చట్ట, న్యాయ సహకారంపై ఒక ఎంవోయూ కూడా ఉంది. దౌత్యాధికారులు, ప్రముఖుల పాస్‌పోర్టుల విషయంలో వీసా మినహాయింపులకు సంబంధించిన అంశంపైనా అంగీకారానికి వచ్చారు. ఆరోగ్యం, పర్యాటక రంగాల్లో సహకారంపై ఎంఓయూపై సంతకం చేశారు. సైనిక సహకారంపై ఎంవోయూకు రెండు దేశాలు సంతకం చేశాయి. ఒమన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ బిన్ నసీర్ అల్ రసబి మాట్లాడుతూ కొన్ని రక్షణ కొనుగోళ్లు, ప్రాజెక్టులు, వివిధ రంగాలలో భారత వైపు నుంచి సహకారం అందిస్తాయన్నారు. భారత రాయబారి ఇంద్రమన్ పాండే మాట్లాడుతూ రెండు స్నేహ దేశాల మధ్య సహకారం పెంపునకు ఎంవోయూలపై సంతకాలు జరిగినట్లు తెలిపారు. అలాగే ఒమన్‌లో భారత చమురు కంపెనీలు గట్టి ఉనికిని కలిగి ఉన్నాయని, సుహర్, సలాలాలో పోర్టులు, ఒమని స్వేచ్ఛ మండలాల్లో ముఖ్యమైన పెట్టుబడులు కలిగి ఉన్నట్లు చెప్పారు. దుఖ్మ్‌లోని ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లో రెండు ప్రాజెక్టుల్లో 1.8 బిలియన్ డాలర్లుగా భారత పెట్టుబడుల అంచనా ఉన్నట్లు ఆయన వివరించారు. విదేశీ సేవల సంస్థ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత, ఒమన్ దౌత్య సంస్థల మధ్య సహకారానికి సంబంధించి కూడా రెండు దేశాలు ఒప్పంద సంతకాలు చేశాయి. కాగా ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ఒమన్ ఉప ప్రధానమంత్రి, మంత్రులతో సమావేశమయ్యారు. పెట్టుబడిదారులు, వ్యాపార ప్రముఖులతో కూడా సమావేశం జరిపారు. 125 ఏళ్ల చరిత్ర కలిగిన శివ ఆలయాన్ని, ఒమన్‌లోని ప్రధాన మసీదు సుల్తాన్ కబూస్ గ్రాండ్‌ను మోడీ సందర్శించారు. మస్కట్‌లోని సుల్తాన్ కబూస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మోడీ ప్రవాసులతో సమావేశమై ప్రసంగించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.